V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

మంగళవారం
22-10-2024

సంపుటి : 01 | సంచిక : 170 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

## భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలి

- ఇండియాకు మరోసారి రష్యా మద్దతు
- బ్రెజిల్‌తోపాటు ఆఫ్రికా దేశాలకూ ఉండాలి
- రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్



**మాస్కో:** ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి శాశ్వత సభ్యత్వం పొందే విషయంలో భారత్‌కు రష్యా మరోసారి మద్దతుగా నిలిచింది. భారత్, బ్రెజిల్‌తోపాటు ఆఫ్రికా దేశాలకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఉండాలని **మిగతా2లో...**



## సరిహద్దు గస్తీపై భారత్-చైనా ఒప్పందం

- వివాద పరిష్కారంలో కీలక పురోగతి
- సఫలమైన ఇరు దేశాల చర్చలు

2

## భారత్ లౌకికదేశంగా ఉండాలనుకోవడం లేదా?

- పిటిషనర్‌కు సుప్రీం ప్రశ్న
- మరో కేసులో మదర్సాల విషయంలో ఎన్సీపీసీఆర్ సిఫారసులపై అత్యున్నత న్యాయస్థానం స్టే

9






అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు

# రూ.కోటి పరిహారం

### శాంతి భద్రతలు, నిఘా విషయంలో పోలీసుల పాత్ర కీలకం

**వారి కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించాలి**

**విధినిర్వహణలో పోలీసులకు ఎలాంటిలోటు రాకుండా చూస్తాం**

**అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి**

**విశ్వంభర, హైదరాబాద్:** శాంతి భద్రతలు, నిఘా విషయంలో తెలంగాణ పోలీసుల పాత్ర కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదన్నారు. అమరులైన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. విధి నిర్వహణలో మరణించిన అధికారులను గుర్తు చేసుకోవడం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. **మిగతా2లో...**

### యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ భవనానికి సీఎం శంకుస్థాపన



2

# జోక్యం చేసుకోలేం

### గ్రూప్–1 అభ్యర్థుల పిటిషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య

పరీక్ష నిలుపుదల కుదరదని వెల్లడి

ఫలితాల విడుదలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచన



**ఢిల్లీ:** తెలంగాణ గ్రూప్–1 అభ్యర్థుల పిటిషన్‌పై జోక్యం చేసుకు నేందుకు, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వుల్లో అన్ని అంశాలూ స్పష్టంగా చెప్పిందని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొంది. ఫలితాల విడుదలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించింది. వాదనల సందర్భంగా.. **మిగతా2లో...**

### ముగిసిన తొలి రోజు గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష

తెలంగాణలో తొలి రోజు నిర్వహించిన గ్రూప్- 1 మెయిన్స్ పరీక్ష ముగిసింది. 31,383 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించారు. వీరిలో అత్యధికులు సోమవారం పరీక్షకు హాజరయ్యారు. ఈ నెల 27 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్షలను వాయిదా వేయాలంటూ ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అన్ని కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ విధించారు. పరీక్ష గది, చీఫ్ సూపరింటెండెంట్, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలించారు. హైదరాబాద్ జిల్లాలో 5,613 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 4,896 మంది హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 87.23% హాజరైనట్టు ఆర్డీవో జైపాల్ రెడ్డి తెలిపారు.

## జీవో 29, 46 తప్పని హైకోర్టులో రుజువు చేయిస్తాం

- గ్రూప్ 1పై పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించలేదు
- విద్యార్థుల కోసం చివరివరకు పోరాడుతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**విశ్వంభర, హైదరాబాద్:** గ్రూప్-1 నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు జరుగుతున్న అన్యాయంపై చివరి వరకు పోరాడుతామని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. జీవో 29, జీవో 46 తప్పని హైకోర్టులో రుజువు చేయిస్తామని, సమర్థుడైన న్యాయవాదితో వాదనలు వినిపిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "గ్రూప్-1 అభ్యర్థుల తరపున మా పార్టీ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దాసోజు శ్రవణ్.. పది మంది గ్రూప్-1 అభ్యర్థులతో కలిసి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కపిల్ సిబల్ బలమైన వాదనలు వినిపించారు. పిటిషన్‌ను సుప్రీంకోర్టు **మిగతా3లో...**

## గడ్చిరోలి జిల్లాలో ఎన్‌కౌంటర్

### ఐదుగురు మావోయిస్టుల మృతి

జవాన్‌కు గాయాలు...ఆస్పత్రికి తరలింపు



2



2

త్వరలో తెలంగాణలో

## సమగ్ర కులగణన

గవర్నర్‌ను కలిసిన బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్




2

## హన్ తరహాలో మూసీ పునరుజ్జీవం

### సియోల్‌లోని నది పరిశీలనకు వెళ్లిన రాష్ట్ర ప్రత్యేక బృందం

- మంత్రి పొంగులేటి సారథ్యంలో సాగుతున్న పరిశీలన
- వ్యాపార, విహార కేంద్రంగా మూసీకి కొత్త కళ తెస్తామని ప్రకటన



2

సియోల్‌లో మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను సందర్శించిన

### మంత్రుల బృందం

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

దీపావళి నుంచి ఏపీలో

## ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం

ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలించకుండా చర్యలు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



2



2

## '16 మంది పిల్లల్ని ఎందుకు కనకూడదు?'

కొత్త జంటలను ప్రశ్నించిన సీఎం స్టాలిన్

జనాభా నియంత్రణపై ఆందోళన

పార్లమెంట్‌లో దక్షిణాదికి తగ్గిన ప్రాతినిధ్యం



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 120 | రిటైల్ ₹ 142 |
| స్కిన్ ₹ 206 | స్కిన్ లెస్ ₹ 234 |

## నడవలేక పోయినా సమాజానికి నడకనేర్పిన సాయిబాబా

- ప్రొఫెసర్ హరగోపాల్
- ప్రొఫెసర్ సాయిబాబాను నిర్బంధించిన వారిని శిక్షించాలి
- సంస్మరణ సభలో వక్తల డిమాండ్

3



## పంచాంగం

**22-10-2024, మంగళవారం**

శ్రీ క్రోధినామ సంవత్సరం
ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం
**తిథి:** షష్ఠి రా.01.33 వరకు తర్వాత సప్తమి
**నక్షత్రం:** ఆరుద్ర తె.05.36 వరకు
**సూర్యోదయం:** ఉ.6.14
**సూర్యాస్తమయం:** సా.5.46
**వర్జ్యం:** సా.05.57 నుంచి రా.07.35వరకు
**దుర్ముహూర్తం:** ఉ.08.33 నుంచి ఉ.09.19 వరకు తిరిగి రా.10.45 నుంచి రా.11.35 వరకు
**రాహుకాలం:** మ.02.53 నుంచి సా.04.19 వరకు
**అమృత ఘడియలు:** రా.07.44 నుంచి రా.09.19 వరకు

# హన్ తరహాలో మూసీ పునరుజ్జీవం

**విశ్వంభర, హైదరాబాద్:** దక్షిణ కొరియాలోని సియోల్ నగరంలోని చెయోంగ్ గయ్ చియోన్ నది( హన్ నది)కి అక్కడి ప్రభుత్వం పునరుజ్జీవం కల్పించిన తరహాలోనే మన మూసీ నదిని ప్రక్షాళన చేసి సరికొత్త సోయగాలను, ప్రగతి ఫలాలను ప్రజలకు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మూసీ నది పునరుజ్జీవ కార్యక్రమంలో భాగంగా 12మందితో కూడిన ప్రత్యేక బృందం ఆదివారం సియోల్ చేరుకుంది. ఈ బృందానికి నాయకత్వం వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో హన్ నదీ పరీవాహక ప్రాంతాలను సభ్యులతో కలిసి పరిశీలించారు. అక్కడ ఒకప్పుడు అత్యంత కాలుష్యంతో నిండి ప్రజలు జీవించలేని పరిస్థితుల నుంచి పునరుజ్జీవంతో ఏవిధంగా నూతన కళను సంతరించుకుందన్న విషయంపై సమగ్రంగా తెలుసుకున్నారు. హన్ నది పరీవాహక ప్రాంతాలలో బడుగులు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే కుటుంబాలు జీవనం సాగించేవారు. ప్రభుత్వం 2003 అక్టోబర్ 1న ఈ నదిని సంపూర్ణంగా , సుందరంగా తీర్చిదిద్దాలని ప్రతిపాదించింది. ఆమేరకు పనులకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించగా ప్రభుత్వం వారికి కొత్త జీవితం, జీవనం లభిస్తుందని ఒప్పించింది. ఫలితంగా కేవలం 2 ఏళ్లలో అంటే 2005 అక్టోబర్ 1 నాటికి ప్రాజెక్ట్ పూర్తయింది. దీంతో గతంలో ఎన్నడూ చూడని కొత్త సొగసులు చేకూరడమేగాక వ్యాపారాలు విస్తరించాయి. ప్రపంచమే విస్తుపోయేలా భారీ కట్టడాలు, సుందరీకరణతో పర్యాటకం పరుగులు తీసింది. దీంతో అప్పటి వరకు నదీతీరంలో కుళ్లు, బురద, అపారిశుధ్యంతో విలవిల్లాడిన నిర్వాసితులకు సరికొత్త లోకం ఆవిష్కృతమైంది. వారితోపాటు పర్యాటకులు కూడా వచ్చి సుందర, ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు.

**మూసీని అభివృద్ధి చేసి చూపిస్తాం: పొంగులేటి**



హన్ నది తరహాలోనే తెలంగాణలోని వివిధ ప్రాంతాలలో విస్తరించిన మూసీనదిని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు చేసే నిరాధార, అభూత కల్పనలకు భిన్నంగా మూసీ నిర్వాసితులకు అభివృద్ధి ఫలాలను అందిస్తామని అన్నారు. ఇప్పటికే ఈ పునరుజ్జీవ ప్రాజెక్ట్ తో పాటు చెత్తను రీసైల్ చేసి విద్యుత్ గా మార్చే వేస్ట్ టు ఎనర్జీ( డబ్ల్యూటీఈ) కేంద్రాలను కూడా పరిశీలించామని మంత్రి పొంగులేటి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సారధ్యంలో 5 రోజుల పర్యటనకు వెళ్లిన ఈ బృందంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి , పలువురు మీడియా ప్రతినిధులు ఉన్నారు.

### సియోల్‌లో మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను సందర్శించిన మంత్రుల బృందం

**విశ్వంభర, హైదరాబాద్:** దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో తెలంగాణ మంత్రులు, అధికారుల బృందం పర్యటిస్తోంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పలువురు ఎమ్మెల్యేలు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, జీహెచ్‌ఎంసీ, మూసీ రివర్‌ఫ్రంట్ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. సియోల్‌లో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను ఈ బృందం సందర్శించింది. మాపో ప్లాంట్‌లో రోజుకు వెయ్యి టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. వ్యర్థాల రీసైక్లింగ్‌కు వేస్ట్ టు ఎనర్జీ టెక్నాలజీని సియోల్ నగరపాలక సంస్థ వాడుతోంది. పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. మరో 10 ఏళ్లలో పూర్తిగా భూ ఉపరితలం నుంచి తొలగించి భూగర్భంలో అతిపెద్ద ప్లాంట్‌ను నిర్మించేందుకు సియోల్ నగర పాలక సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాపో ప్లాంట్ పనితీరును అధ్యయనం చేసేందుకు తెలంగాణ మంత్రుల బృందం వెళ్లింది. ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ సియోల్, హైదరాబాద్ నగర నమూనాలు ఒకేలా ఉంటాయని తెలిపారు. సియోల్‌లో సుమారు 10వేల మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి నగరంలోని నాలుగు వైపులకు తరలిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో దాదాపు 8వేల మెట్రిక్ టన్నులు సేకరించి ఒకే వైపునకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరం చుట్టూ నాలుగు ప్రదేశాలను గుర్తించినట్లు వివరించారు. నగరంలోని చెత్తను నాలుగు వైపులకు పంపించడం ద్వారా రవాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ ప్రజల భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూసీ నదిని ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సియోల్‌లో చెయోంగ్ గయ్ చియోన్ నదిని ఆయన పరిశీలించారు.

## సరిహద్దు గస్తీపై భారత్-చైనా ఒప్పందం

**ఢిల్లీ:** భారత్, చైనా సరిహద్దు ప్రాంతాల్లో నెలకొన్న వివాదాల పరిష్కారానికి జరుగుతున్న చర్చలు కొంత మేర సఫలమయ్యాయి. వాస్తవాధీన రేఖ వద్ద సరిహద్దు ప్రాంతాల వెంబడి గస్తీ నిర్వహణను పునఃప్రారంభించేందుకు ఇరుదేశాలు అంగీకరించాయి. తూర్పు లద్దాఖ్‌లోని వాస్తవాధీన రేఖ వెంబడి మళ్లీ గస్తీ నిర్వహించే అంశంపై ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరిందని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ఈ ఒప్పందం బలగాల ఉపసంహరణ, 2020లో తలెత్తిన సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**మోదీ, జిన్‌పింగ్ భేటీ**

దెమ్‌చోక్, డెప్సాంగ్ ప్రాంతాల్లో గస్తీ నిర్వహణకు ఒప్పందం కుదిరినట్లు చెప్పారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న సరిహద్దువివాదాల పరిష్కారాల కోసం గతకొద్ది వారాలుగా జరుగుతన్న చర్చల ఫలితంగా ఈ పురోగతి చోటుచేసుకుందని మిస్రీ అన్నారు. ఈ ఒప్పందం బలగాల ఉపసంహరణ 2020లో తలెత్తిన సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేస్తుందని మిస్రీ ఆశాభావం వ్యక్తం చేశారు. రష్యాలో జరగనున్న బ్రిక్స్ 16వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడానికి ప్రధాని నరేంద్ర మోదీ, వెళ్లనున్న నేపథ్యంలో ఈ ఒప్పందం కుదరడం గమనార్హం. ఈ సదస్సులో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ కానున్నట్లు తెలుస్తోంది.

**ల్వాన్‌లో ఘర్షణ**

2020లో భారత్-చైనా సరిహద్దులోని గల్వాన్ లోయలో చోటుచేసుకున్న ఘర్షణ తర్వాత ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. 2020 జూన్ 15న గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికులు ఘర్షణ పడ్డారు. ఆ పోరులో తెలంగాణకు చెందిన కర్నల్ సంతోష్ బాబు సహా 20 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. ఐదుగురు చనిపోయినట్లు చైనా అధికారికంగా తెలిపింది. ఘర్షణల నేపథ్యంలో ఇరు దేశాలు అక్కడ భారీ స్థాయిలో బలగాలను మోహరించాయి. భారత్ దాదాపు 68,000 మంది సైనికులను సరిహద్దుకు తరలించింది. ఏదైనా ఊహించని పరిణామాలు ఎదురైతే దీటుగా ఎదుర్కొనేందుకు భారత సైన్యం అన్నివిధాలా సిద్ధమైంది. అయితే, వాస్తవాధీన రేఖ వెంట నెలకొన్న ఈ ప్రతిష్టంభనపై ఇరుదేశాల సైనిక ఉన్నతాధికారులు అనేక దఫాల్లో చర్చల్లో పురోగతి కనిపించడంతో పరిస్థితులు కొంతమేర కుదుటపడినట్లు కనిపిస్తోంది.

## భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

రష్యా మరోసారి స్పష్టం చేసింది. "భారత్, బ్రెజిల్‌తోపాటు ఆఫ్రికా దేశాల ప్రతినిధులు ఐరాస భద్రతా మండలిలో శాశ్వత ప్రాతిపదికన ప్రాతినిధ్యం ఉండాలి. మెజార్టీ వర్గం తరపున ప్రాతినిధ్యం ఉండేలా చూసుకోవడం ఎంతో అవసరం" అని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ పేర్కొన్నారు. స్థానిక మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఉండాల్సిందేనన్నారు.

**శాశ్వత సభ్యత్వానికి అర్హమైన దేశం భారత్!**

ఐరాస భద్రతా మండలిలో సంస్కరణలు అవసరమని భారత్ ఎప్పటి నుంచో వాదిస్తోంది. సమకాలీన భౌగోళిక రాజకీయ పరిణామాలను ఐరాసలో ప్రతిబింబించడం లేదని ఉద్ఘాటిస్తోంది. ఈ క్రమంలో శాశ్వత సభ్యత్వానికి అర్హమైన దేశమని భారత్ చేస్తున్న వాదనతో అగ్రదేశాలు కూడా ఏకీభవిస్తున్నాయి. లో భారత్ ప్రాతినిధ్యం కోసం ప్రపంచ దేశాల నుంచి మద్దతు పెరుగుతుండగా.. కేవలం చైనా మాత్రం దీన్ని వ్యతిరేకిస్తోంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఇప్పటికే భారత్‌కు మద్దతుగా నిలవగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కూడా ప్రాతినిధ్యం ఉండాల్సిందేనని అన్నారు. ప్రస్తుతం భద్రతా మండలిలో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, చైనాలు శాశ్వత సభ్యదేశాలుగా ఉన్నాయి.

## గడ్చిరోలి జిల్లాలో ఎన్‌కౌంటర్

**గడ్చిరోలి:** మహారాష్ట్ర లోని గడ్చిరోలి జిల్లాలో పోలీసులకు, నక్సలైట్లకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు నక్సలైట్లు మృతిచెందారు. మరోవైపు మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఒక జవానుకు గాయాలయ్యాయి. గాయపడ్డ జవాన్‌ను చికిత్స కోసం నాగ్‌పూర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలోని కోప్రి అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. కోప్రి అటవీ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ కమాండో టీమ్ కూంబింగ్ జరుపుతుండగా మావోయిస్టులు ఎదురుపడ్డారు. దాంతో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. గడ్చిరోలిలో నక్సలైట్లు ఎక్కువగా సంచరిస్తున్నారు. ఇటీవల నక్సలైట్ దంపతులు రూ.8 లక్షల రివార్డు తీసుకుని పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆ దంపతులను అసిన్ రాజారామ్ కుమార్ (37) అలియాస్ అనిల్, అతని భార్య అంజు సుళ్య జాలే (28) అలియాస్ సోనియాగా గుర్తించారు. రాజారామ్ కుమార్ ఒడిశాలోని మావోయిస్టుల ప్రెస్ టీమ్‌లో ఏరియా కమిటీ సభ్యుడు అని పోలీసులు తెలిపారు. అతను హర్యానాలోని నర్వానా గ్రామానికి చెందినవాడు. హిమాచల్‌ప్రదేశ్ రాజధాని సిమ్లా సమీపంలోని ఓ ప్రాంతంలో నకిలీ గుర్తింపుతో నివసిస్తున్నాడు.

### తిరుమల లడ్డూ వ్యవహారంలో వ్యాఖ్యలపై

## పవన్‌కల్యాణ్‌కు సిటీ సివిల్ కోర్టు నోటీసులు

**నవంబరు 22న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశాలు**

**విశ్వంభర, హైదరాబాద్:** తిరుమల శ్రీవారి లడ్డూలో ఉపయోగించే కల్తీ నెయ్యి అంశం ఇంకా కాకరేపుతూనే ఉంది. గత పాలక మండలి కల్తీ నెయ్యి ఉపయోగించిందని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఆయన చేసిన వ్యాఖ్యలతో చాలా మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయంటూ హైదరాబాద్‌కు చెందిన అడ్వకేట్ ఇమ్మనేని రామారావు సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి వై రేణుకతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. వచ్చే నెల 22వ తేదీన కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాలని సమన్లు జారీచేసింది.

## అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ.కోటి పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

అమరులైన ఎస్సై, సీఐ కుటుంబాలకు రూ.కోటి 25 లక్షలు.. డీఎస్పీ, ఏఎస్పీ కుటుంబాలకు రూ.కోటి 50 లక్షలు.. ఎస్పీ, ఐపీఎస్ కుటుంబాలకు రూ.2 కోట్ల పరిహారం ఇస్తామన్నారు. శాశ్వత అంగవైకల్యం పొందిన పోలీసులకు పరిహారం ఇస్తామని ప్రకటించారు.

''పోలీసు సిబ్బంది పట్ల నాకు ప్రత్యేక అభిమానం ఉంది. పోలీసులు, వారి కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించాలి. ఎవరి ముందో చేయి చాచే పరిస్థితి తెచ్చుకోవద్దని కోరుతున్నా. విమర్శలకు అవకాశం ఇవ్వొద్దని కోరుతున్నా. విధి నిర్వహణలో పోలీసులకు ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటాం. వారి ఖర్చులు, ఇతర ఏర్పాట్లకు నిధులు కేటాయిస్తాం. నేరగాళ్లు సరికొత్త విధానాలతో ముందుకొస్తున్నారు. పెరుగుతున్న ఆధునిక సాంకేతికత ద్వారా నేరాలు చేస్తున్నారు. తెలంగాణ పోలీసుల విధానాలను ఇతర రాష్ట్రాలు పాటిస్తున్నాయి. మన ఫోరెన్సిక్ ల్యాబ్ అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. మన సైబర్ క్రైమ్ విభాగం దేశంలోనే గొప్పదని కేంద్ర హోంశాఖ అభినందించింది. ప్రస్తుతం డ్రగ్స్ మహమ్మారి యువతను పట్టిపీడిస్తోంది. డ్రగ్స్ వల్ల పంజాబ్ అనేక కష్టాలు ఎదుర్కొంటోంది. మాదకద్రవ్యాల వినియోగం రాష్ట్రంలో క్రమంగా పెరుగుతోంది. వీటి నివారణకు రాష్ట్రంలో టీజీన్యాబ్‌ను ఏర్పాటు చేశాం. ఏఐ పరిజ్ఞానంతో ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించేవారిని గుర్తిస్తున్నాం. నేరస్థులను కఠినంగా శిక్షించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. శాంతిభద్రతలను చేతుల్లోకి తీసుకోవద్దని ప్రజలను కోరుతున్నాం. వివిధ పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడంలో పోలీసుల సేవలు మరచిపోలేము. జీతం కోసం వారు పనిచేయడం లేదు. బాధ్యతాయుతంగా భావించి సేవలు అందిస్తున్నారు'' అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యత: డీజీపీ జితేందర్**

దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యత అని డీజీపీ జితేందర్ అన్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాది 214 మంది పోలీసులు అమరులయ్యారని చెప్పారు. తెలంగాణ రాష్టం నుంచి ఒక పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీసు శాఖ ముందు వరుసలో ఉందని వివరించారు.

## యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ భవనానికి సీఎం శంకుస్థాపన

**విశ్వంభర, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ భవనానికి సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలీసుల పిల్లలకు ఇక్కడ విద్య అందించనున్నారు. పోలీసులు, ఎక్సైజ్, ఫైర్, ఎస్‌పీఎఫ్ ఉద్యోగుల పిల్లలు ఇక్కడ విద్యనభ్యసించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

**పోలీసుల సంక్షేమం కోసం ఆలోచించింది కాంగ్రెస్ ప్రభుత్వమే: శ్రీధర్‌బాబు**

పోలీసుల సంక్షేమం కోసం ఆలోచించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ నేపథ్యంలోనే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు శంకుస్థాపన చేశామన్నారు. 2014లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూ గత ప్రభుత్వం పార్టీ కోసం పోలీసులను ఉపయోగించుకుంది తప్ప.. ప్రజా సంక్షేమం కోసం కాదని విమర్శించారు. ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పని చేస్తున్న పోలీసులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో యువత శ్రేయస్సు కోసం మొదటిగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకున్నామన్నారు. ''విద్యార్థుల్లో కులమతాల భేదం ఉండకూడదని అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు దిశగా ముందుకెళ్తున్నాం. పోలీసుల పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో ఎదిగేలా నాణ్యమైన విద్యను అందించేందుకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నాం. గత ప్రభుత్వం 10 ఏళ్లలో చేసిందేమీ లేదు. తెలంగాణ వచ్చాక గ్రూప్-1 మెయిన్స్ నిర్వహిస్తున్నాం. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 10 నెలలుగా ఓ విజన్‌తో ముందుకెళ్తున్నాం'' అని శ్రీధర్‌బాబు తెలిపారు.

## దీపావళి నుంచి ఏపీలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం

**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మహిళలకు దీపావళి కానుకగా ఈ పథకాన్ని అమలు చేసేలా నిర్ణయించిందన్నారు. ఈ నెల 31 తేదీ నుంచి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. మహిళా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సీఎం.. దీపం పథకం గొప్ప ముందడుగని వ్యాఖ్యానించారు.

**ఇసుక లభ్యత పెంచేందుకు సీనరేజి రద్దు**

ఏపీలోని ఇసుకను పొరుగు రాష్ట్రాలకు తరలించకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేసేందుకు, లభ్యత పెంచేందుకు సీనరేజి రద్దు చేసినట్లు సీఎం పునరుద్ఘాటించారు. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు మార్గాల్లో తరలింపు అధికంగా జరుగుతోందని, ఆయా మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ఠ పర్యవేక్షణ ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానంపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఉచిత ఇసుక విధానం నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్రమ ఇసుక తవ్వకాలపై సామాన్యులు కూడా ఫిర్యాదు చేసేలా సరికొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ''గ్రామ పంచాయతీల పరిధిలో సొంత అవసరాలకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపునకు అనుమతిచ్చాం. ఇసుక తీసుకెళ్లేవారు గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేయించాలి. రీచ్‌లలో తవ్వకాలు, లోడింగ్ ప్రైవేటుకు అప్పగింతపై ఆలోచించాలి'' చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## వాయనాడ్ లో 23న ప్రియాంక గాంధీ నామినేషన్

- మల్లికార్జున ఖర్గేతో సమావేశం
- నామినేషన్‌కు సోనియా, రాహుల్ హాజరు

**ఢిల్లీ:** కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తొలిసారి ఎన్నికల్లో పోటీ సిద్ధమయ్యారు. సోదరుడు రాహుల్ గాంధీ రాజీనామా చేసిన కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికకు ఈ నెల 23న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో ప్రియాంక గాంధీ సోమవారం సమావేశమయ్యారు. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. కాగా, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, ఆ పార్టీ అధినేత్రి, తల్లి సోనియా గాంధీ, సోదరుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు కూడా ప్రియాంక గాంధీ నామినేషన్ కార్యక్రమానికి హాజరవుతారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా కలెక్టర్ ఎదుట యూడీఎఫ్ అభ్యర్థిగా ఆమె నామినేషన్ దాఖలు చేస్తారని పేర్కొన్నారు. దీనికి ముందు ఉదయం 11 గంటలకు కల్పేట కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు రాహుల్ గాంధీతో కలిసి ప్రియాంక గాంధీ రోడ్‌షో నిర్వహిస్తారని వెల్లడించారు. మరోవైపు 52 ఏళ్ల ప్రియాంక గాంధీ ఐదేళ్ల కిందట కాంగ్రెస్ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించారు. అయితే వాయనాడ్ నుంచి తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. జమ్ముకశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన కాంగ్రెస్ పార్టీ, ప్రియాంక గాంధీ విజయంతో దాని నుంచి బయటపడాలని, వయనాడ్ స్థానాన్ని నిలుపుకోవాలని భావిస్తున్నది.



## జోక్యం చేసుకోలేం

(మొదటి పేజీ తరువాయి)

14 ఏళ్ల తర్వాత గ్రూప్-1 పరీక్ష జరుగుతోందని అభ్యర్థుల తరఫు న్యాయవాది తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 29 తెచ్చిందని తెలిపారు. పరీక్షపై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ తరఫు న్యాయవాది చెప్పారు. ఇరువర్గాల వాదనలు విన్న సుప్రీంకోర్టు గ్రూప్-1 పరీక్ష నిలుపుదల కుదరదని తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తీర్పు వచ్చే వరకు పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వుడుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా.. రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షలు నిలిపివేయాలని కొందరు అభ్యర్థులు కోరగా.. హైకోర్టు నిరాకరించింది. నోటిఫికేషన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ఉన్నత న్యాయస్థానం.. నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని విచారణ వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## '16 మంది పిల్లల్ని ఎందుకు కనకూడదు?'

**చెన్నయ్:** జనాభా నియంత్రణపై ఆందోళన వ్యక్తం చేస్తూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఒక్కరూ 16 మంది పిల్లలను కనాలనే ఆలోచనతో ఎందుకు ఉండకూడదు అని ప్రశ్నించారు. తిరువాన్మియూర్‌లోని మరుంధీశ్వరార్ ఆలయం కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన 31 జంటల కల్యాణోత్సవానికి సీఎం స్టాలిన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమం అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు. జనాభా నియంత్రణ విధానాలు పకడ్బందీగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గిపోయి, నిధుల కేటాయింపులో కోత పడొచ్చన్న విశ్లేషణల నేపథ్యంలో స్టాలిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'కొత్తగా పెళ్లయిన జంటలకు 16 రకాల ఆస్తులను పొందాలని పూర్వం పెద్దలు ఆశీర్వాదించేవారు. ఇప్పుడు ఆస్తికి బదులుగా 16 మంది పిల్లలను కనాలని, వారు ఆనందంగా జీవించాలని దీవించండి. జనాభా నియంత్రణ కారణంగా పార్లమెంట్ నియోజకవర్గాల సంఖ్య తగ్గిపోతోంది. పరిస్థితులు తగ్గట్టుగా మారాలి. ప్రతి ఒక్కరూ 16 మంది పిల్లలను కనాలనే ఆలోచనతో ఎందుకు ఉండకూడదు?' అని స్టాలిన్ ప్రశ్నించారు.

### త్వరలో తెలంగాణలో సమగ్ర కుల గణన

**విశ్వంభర,హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను నిర్ణయించేందుకు జరగనున్న అన్ని కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమగ్ర సర్వే షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వివరించినట్లు బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ తెలిపారు. అంతకుముందు రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌ను బీసీ కమిషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. కమిషన్ ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, సమగ్రంగా సేకరించిన కులాల వివరాలను గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8 వరకు ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో కులాల వారీగా సమగ్రంగా వివరాలు సేకరిస్తామని నిరంజన్ తెలిపారు.



# నడవలేక పోయినా సమాజానికి నడకనేర్పిన సాయిబాబా



**విశ్వంభర, హైదరాబాద్:** తాను నడవలేకపోయినా సమాజానికి సాయిబాబా నడక నేర్పినవాడని, ఉద్యమాలకు నడక నేర్పినవాడని ప్రొఫెసర్ జి. హరగోపాల్ అన్నారు. సోమవారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞన కేంద్రంలో నిర్వహించిన ప్రొఫెసర్ సాయిబాబా సంతాప సభలో ఆయన మాట్లాడారు. సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం, వీక్షణం వేణుగోపాల్, ప్రొఫెసర్ జి. లక్ష్మణ్ తదితరులు ప్రసంగించారు. ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాను అక్రమంగా పదేళ్ల పాటు నాగ్‌పూర్ జైల్లోని అండాసెల్ లో నిర్బంధించిన కేంద్ర, రాష్ట్ర పాలకులు, పోలీస్ అధికారులను శిక్షించాలని వక్తలు డిమాండ్ చేశారు. సాయిబాబా నిర్దోషి అని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని, అలాంటప్పుడు ఆయనను అక్రమంగా జైల్లో నిర్బంధించిన వారికి ఎలాంటి శిక్షలు వేస్తారో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో న్యాయ వ్యవస్థ, చట్టాలు, రాజ్యాంగం లేవా.., పాలకులు తమ ఇష్టానుసారంగా అరెస్టు చేసి 10 ఏళ్ల పాటు జైల్లో నిర్భంధిస్తారా అన్ని ప్రశ్నించారు. చట్టాల లోపంతో సాయిబాబాను జైల్లో నిర్బంధించారా లేక పాలకుల మెదళ్లలో విషం నిండి ఈ పని చేశారా అని తేల్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏ నేరం చేయని వారిని ఏళ్ల తరబడి జైళ్లలో నిర్భంధించే ఈ చట్టాలు ఉంటే ఎంత? లేకపోతే ఎంత? అని మండిపడ్డారు. మావోయిస్టులను తుదముట్టిస్తామని ప్రగల్భాలు పలుకుతున్న కేంద్ర పాలకులు ఒక పౌర హక్కుల ఉద్యమకారుడి సంస్మరణ సభకు స్వచ్ఛందంగా ఎంత మంది వచ్చారో చూడాలన్నారు. నేరస్తులు ఎన్నికల్లో గెలిచి దేశాన్ని పాలిస్తున్నారని అన్నారు. గుజరాత్ లో అనేక ఆర్థిక నేరాలకు పాల్పడిన అమిత్ షా ఈ రోజు దేశానికి హోం మంత్రి అని, ప్రధాని మోదీపైనా నేరారోపణలు ఉన్నాయన్నారు. ఇలాంటి వారి పాలనలో దేశం ఏమైపోతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. హక్కుల కోసం పోరాడుతున్న సాయిబాబా లాంటి వారు దేశ ద్రోహులైతే మహాత్మాగాంధీ, మార్టిన్ లూథర్‌కింగ్, నెల్సన్ మండేలా లాంటి వారు కూడా ద్రోహులేనా అని ప్రశ్నించారు. దేశ ప్రజలపై యుద్ధం చేస్తోన్న అమిత్ షా మావోయిస్టులపై 80 శాతం విజయం సాధించామని చెప్పుకొని భుజాలు తడుముకుంటున్నారని మండిపడ్డారు. తమకు ఎదురే లేదని విర్రవీగిన నియంతలే కాలగర్భంలో కలిసిపోయారన్న వాస్తవం మర్చిపోవద్దన్నారు. పాలకుల ఆగడాలకు అంతం పలకాలంటే ఎర్రజెండాలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ సాయిబాబా పోరాట స్ఫూర్తితో దండకారణ్యం నుంచి ఆదివాసీలను తరిమేసేందుకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కాగర్ కు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాలని సభలో తీర్మానించారు. సంస్మరణ సభలో పౌర హక్కుల సంఘం, నిర్బంధ వ్యతిరేక వేదిక, అమరుల బంధుమిత్రుల సంఘం, ప్రజాసంఘాల నాయకులు ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, ఎం.రాఘవాచారి, పద్మకుమారి, మీనా కందస్వామి, సాయిబాబా సహచరి వసంత, కూతురు, మంజీర తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని అమలు చేయండి

**మంత్రి దామోదర రాజనరసింహాతో టీయూడబ్ల్యూజే భేటీ**



**విశ్వంభర, హైదరాబాద్:** గత ఐదేళ్ల నుండి రాష్ట్రంలో జర్నలిస్ట్స్ హెల్త్ స్కీం సక్రమంగా అమలుకాక పోవడంతో జర్నలిస్టులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అది అమలయ్యేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహాను తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) కోరింది. మంగళవారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ నేతృత్వంలో ప్రతినిధి బృందం బంజారా హిల్స్ లోని ఆరోగ్యశ్రీ కార్యాలయంలో, మంత్రి దామోదర రాజనర్సింహాను, రాష్ట్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు ఆర్.వి.కర్ణన్ ను కలిసి జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుపై చర్చించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఈజేహెచ్ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టి, హెల్త్ కార్డులు జారీ చేయగా, ఆ పథకం 2019వరకు సక్రమంగా పనిచేసిందని విరాహత్ అలీ తెలిపారు. కారణాలు ఏమిటో తెలియదు కానీ గత ఐదేళ్లుగా వైద్యం కోసం జర్నలిస్టులు కార్పొరేట్ ఆసుపత్రులకెళ్తే హెల్త్ కార్డులను తిరస్కరిస్తున్నారని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఐదేళ్ల కాలంలో వివిధ ప్రమాదాలు, కరోనా కాటు, ఆయా వ్యాధులకు గురై రాష్ట్రంలో దాదాపు 300మంది జర్నలిస్టులు అకాలమరణానికి గురైనట్లు ఆయన తెలిపారు. పథకం అమలుకాక పోవడంతో పలువురు జర్నలిస్టులు అప్పులు చేసి చికిత్స పొందుతున్నట్లు ఆయన విచారం వ్యక్తం చేశారు. వెంటనే ఆరోగ్య పథకాన్ని పునరుద్ధరించి జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత కల్పించాలని మంత్రి దామోదర రాజానరసింహాను కోరారు. మంత్రిని కలిసిన టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందంలో రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యదర్శులు వరకాల యాదగిరి, కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, హెల్త్ కమిటీ కన్వీనర్ ఏ.రాజేష్, హెచ్ యూ జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ లు పాల్గొన్నారు .

**త్వరలో ఉన్నత స్థాయి సమావేశం-మంత్రి దామోదరరాజనరసింహా**

ఆరోగ్య పథకం విషయంలో జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఆరోగ్య పథకాన్ని పటిష్టంగా అమలుచేసే విషయంలో త్వరలో శాఖా పరంగా ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించి చర్చిస్తామని టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందానికి మంత్రి దామోదర రాజనరసింహా హామీ ఇచ్చారు. ఈ పథకాన్ని ట్రస్ట్ ద్వారానైనా, థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారానైనా నిర్వహించేందుకు ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అధికారులతో సమావేశమై, తదుపరి జర్నలిస్టు, ఉద్యోగ సంఘాల బాధ్యులతో సమావేశం నిర్వహిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# జీవో 29, 46 తప్పని హైకోర్టులో రుజువు చేయిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తిరస్కరించలేదు. సోమవారం పరీక్ష ఉంది కాబట్టి.. ఈ సమయంలో ఆపడం కరెక్ట్ కాదు. గ్రూప్-1 అభ్యర్థులు దాఖలు చేసిన రిట్ పిటిషన్ మీద హైకోర్టు నిర్ణయం తీసుకునే వరకు ఫలితాలను ప్రకటించొద్దని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. త్వరగా విచారణ జరిపి న్యాయం చేయాలని కూడా సుప్రీంకోర్టు చెప్పింది"అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిందే నిరుద్యోగులు. ఇప్పుడేమో వారిని జీవో 29 తీసుకొచ్చి మోసం చేస్తున్నారు. జీవో 46కు సంబంధించిన పిల్లల కోసం కూడా సుప్రీంకోర్టులో కొట్లాడుతాం. గ్రూప్-4లో బ్యాక్ లాగ్ పోస్టులు కానివ్వొద్దని కోరుతున్నారు. ప్రభుత్వానికి ఇంత బేషజం ఉండొద్దు. హైకోర్టులో సమర్థవంతమైన న్యాయవాదులను నియమించి తమ వంతు పోరాడుతాం. ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తప్పని హైకోర్టులో రుజువు చేపిస్తామన్న విశ్వాసం మాకుందని కేటీఆర్ పేర్కొన్నారు.

**మా సోషల్‌మీడియాను ఏదో చేయడం కాదు.. చేతనైతే శాంతి భద్రతలు కాపాడండి**

జర్నలిస్టులను అవమానించానంటూ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జర్నలిస్టులకు పెద్ద ఎత్తున రాజకీయ అవకాశాలు కల్పించిందే బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో యాజమాన్యాలు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ.. జర్నలిస్ట్ లు తెలంగాణ కోసం



ఎంతో కష్టపడ్డారని.. వారంటే బీఆర్ఎస్ కు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. జర్నలిస్టులను నేను అవమానించానని అంటే అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఒక్క మత ఘర్షణల సంఘటన కూడా జరగలేదని కేటీఆర్ తెలిపారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి సంఘటనపై ఖండిస్తే లా అండ్ ఆర్డర్ ఇష్యూ అని నా మీద సైబర్ క్రైమ్ వాళ్లు ఎక్స్‌కు ఫిర్యాదు చేశారని మండిపడ్డారు. మత ఘర్షణల సంఘటనపై కూడా మేము ఖండన చెప్పవద్దా అని ప్రశ్నించారు. ఈ ముఖ్యమంత్రికి చేతనైతే శాంతి భద్రతలను కాపాడాలి. కానీ మా సోషల్ మీడియాను ఏదో చేయాలని ప్రయత్నించటం అరాచకమని విమర్శించారు.

**విద్యుత్ బిల్లుల పెంపు ప్రతిపాదనలు విరమించుకోవాలి**

ప్రజలపై భారీగా విద్యుత్ బిల్లుల పేరుతో భారం మోపనున్నట్లు తమకు సమాచారం అందిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెంచాలంటూ డిస్కంలు చేసిన 9 ప్రతిపాదనలను విరమించుకోవాలని ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమిటీ ఛైర్మన్ ను కలిసి కోరామని తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. ఇళ్లలో వాడుకునే కరెంట్‌కు సంబంధించి నెలకు రూ. 300 యూనిట్లు దాటితే ఫిక్స్‌డ్ ఛార్జీలను 10 రూపాయల నుంచి ఏకంగా రూ. 50 పెంచాలని ప్రతిపాదన చేశారని అన్నారు. ఇది అతి ప్రమాదకరమైన ప్రతిపాదన అని.. ఈ ఒక్క నిర్ణయం మొత్తం ప్రజల ఆర్థిక పరిస్థితిని ఇబ్బందుల్లోకి నెడుతుందని వ్యాఖ్యానించారు. సామాన్యుల గృహాలకు సంబంధించి బలంగా, భారీగా విద్యుత్ బిల్లుల భారం పడుతుందని అన్నారు. పరిశ్రమలన్నింటినీ ఒకే కేటగిరీ అనే ప్రతిపాదన చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ఇది చాలా అసంబద్ధమైన, సిల్లీ ఆలోచన. పరిశ్రమలకు తీవ్ర అన్యాయం చేసే నిర్ణయమని పేర్కొన్నారు. దేశంలో ఎప్పుడూ లేని విధంగా ఇలాంటి పిచ్చి ఆలోచన చేస్తున్నారని మండిపడ్డారు. పరిశ్రమలన్నింటికీ ఒకే టారిఫ్ చేసే విధంగా చేయడమంటే అది రాష్ట్ర ప్రగతికి గొడ్డలి పెట్టుగా మారుతుందని అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయంపై కూడా ఈ ప్రభుత్వం ఏమీ మాట్లాడటం లేదని కేటీఆర్ అన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో ఇప్పటికే ప్రజలు విసిగిపోయి ఉన్నారని కేటీఆర్ అన్నారు.










# ముదిమి వయసు కారాదు శాపం

**నడక, నడత నేర్పిన అమ్మానాన్నలను దిక్కవుతున్న వృద్ధాశ్రమాలు**

**హృదయం ఉన్న ప్రతీ కొడుకు, కూతురు ఆలోచించాలి**

**ఆస్తుల పంచుకోవడమే కాదు... పెద్ద వయసులో ఆత్మీయంగా సాకండి..**



అబ్బబ్బా.. ఈ వృద్ధులతో పడలేకపోతున్నామండీ. వీళ్ళ ఛాదస్తాలు, వీళ్ళూనూ, వీళ్ళ అతి ఛాదస్తాలతో, ప్రవర్తనలతో విసిగిపోతున్నామండీ. ఏం చేసినా? ఏం మాట్లాడినా? తప్పేనండీ బాబూ. ఏ పని చేయరు కానీ అన్నీ ఆరాలు వీళ్ళకే కావాలి. వీళ్ళతో పడలేం కానీయండి పాపమో? పుణ్యమో? ఏదైనా ఆశ్రమం చూడండి. తీసుకెళ్ళి జాయిన్ చేసేద్దాం అనేవాళ్ళే ఎక్కువ. వృద్ధుల గురించి ఇదీ నేటి కాలంలో వినిపించే మాటలు. ఇప్పుడు ప్రతి చోటా, ప్రతీ ఇంటా, అందరి నోటా వినబడే మాట వృద్ధుల గురించే.? వృద్ధులంటే? మన తల్లిదండ్రులే కదా! పెద్దవారైనంతమాత్రాన వృద్ధులైపోతారా? మనకు పనికి రాకుండాపోతారా? మన తల్లిదండ్రులను వృద్ధులన్న కారణంతో తీసుకెళ్ళి వృద్ధాశ్రమాలలో జాయిన్ చేసేయటం ఎంతవరకూ సమంజసం.? వృద్ధులంటే కాదు వ్యర్థులు. మన అభివృద్ధికి నిరంతరాయం రక్తాన్ని చిందించి, ఎన్నో కష్టనష్టాలకోర్చిన త్యాగమూర్తులే కదా! మనకు తన రక్తమాంసాలిచ్చి, జన్మనిచ్చి, పోషిస్తూ, పెంచి, పెద్ద చేసిన మన తల్లిదండ్రులే కదా! ఒకసారి మనసు పెట్టి ఆలోచించండి. వృద్ధులు ఆరోగ్యవంతమైన సమాజానికి మార్గదర్శకులు. అనుభవాల ఆలోచనతో సమాజాన్ని చైతన్యపరిచే దిక్సూచీలు. అటువంటి వృద్ధుల సంక్షేమం కోసం మొట్ట మొదటిసారిగా వియన్నాలో 1984 లో వృద్ధుల అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. వృద్ధులను సీనియర్ సిటిజన్స్ అని గౌరవించాలని సూచించారు. 1990 డిసెంబర్ 14 వ తేదీన ఐక్యరాజ్య సమితి వారు ఒక సదస్సు నిర్వహించి, వృద్ధుల కోసం ఒక నిర్దిష్ట ప్రణాళిక తయారుచేసి 1991అక్టోబర్ 1వ తేదీనాడు ప్రపంచ వ్యాప్తంగా వృద్ధుల దినోత్సవం చేయాలని సంకల్పించింది. ఆనాటి నుంచి ప్రతీ ఏడాది అక్టోబర్ 1 వ తేదీనాడు వృద్ధుల దినోత్సవం నిర్వహించుకొంటూ వృద్ధులకోసం ఎన్నో సంక్షేమాలు, రాయితీలు ప్రకటిస్తూ పండుగలా చేస్తున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థల వారు వృద్ధాశ్రమాలు నడుపుతూ జీవిత చరమాంకంలో వున్న వారిని సేదతీరుస్తున్నాయి. కాలమెప్పుడూ ఒకేలా ఉండదు కదా!వ్యక్తుల ఆలోచనా విధానాన్ని బట్టి ఆర్థిక అసమానతలు బట్టి సమాజంలో హెచ్చుతగ్గులు ఏర్పడుతాయి. ఉన్నదానితో తృప్తి చెందకుండా ఇంకా ఏదో కావాలని వెంపర్లాడుతూ కాలంతో పరుగెట్టే జీవితాలకు ఇవేమీ అర్థం కాకపోవచ్చు. కానీ ఏదో ఒక సమయంలో ఈ ఇబ్బందులను ప్రతీ వ్యక్తి ఎదుర్కొంటాడు. అందుకనే పూర్వ కాలంలో మన పెద్దలు కష్టమైనా నష్టమైనా కలిసే వుందాం అనుకొంటూ బతికేవారు. కలిసి ఉంటే కలదు సుఖం అని వూరకే చెప్పలేదు కదా? మనం ఇప్పుడు మన పిల్లలను దగ్గర కూర్చోబెట్టుకుని జీవన విధానం గూర్చి భవిష్యత్తు గురించి ఎంతమంది చెప్పగలుగుతున్నాం. ఎవరూ చెప్పడం లేదు కదా! మనకి అంత తీరిక, ఓపిక వుండటం లేదు. పైగా మనకు మనం చేసే పని గూర్చి తప్ప ఇతర విషయాలేవీ అంతగా తెలియవు. తెలుసుకునే అవకాశం వున్నా తెలుసుకోటానికి ఆసక్తి చూపడం లేదు. ఒకవేళ అడపాదడపా తెలిసిన విషయాలు కొద్దో గొప్పో చెబుతామన్నా వినటానికి పిల్లలు ఇష్టపడడం లేదు. వాళ్ళని మచ్చిక చేసుకొని శాంతంగా ఓపికగా చెప్పే నేర్పు మనకు వుండటం లేదు. అందుకనే మన సమాజంలో రక రకాలైన అసాంఘిక కార్యకలాపాలు, అనైతిక చర్యలు జరుగుతున్నాయి. నేడు సమాజంలో వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు, దుస్సంప్రదాయాలు, విపరీత ధోరణులు, వేనకి వేల రూపాలెత్తి విష సర్పాలై కాటేస్తూ, సామాన్య జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి.

వీనికంతటికీ ఒకటే పరిష్కారం. ప్రశాంతమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి మూలకాలైన వృద్ధులను దూరంగా పెట్టడమే. వృద్ధులైపోయారనీ వృద్ధాశ్రమాలలో చేర్చేస్తూ చేతులు దులుపుకొంటూ గొప్పలు చెప్పుకొంటున్న ఓ కుటుంబ పెద్దలారా! ఆలోచించండి ఒక్కసారి. వేలు పట్టి నడిపించిన నాన్నకి నువ్వు ఓ ఊతం అవ్వలేవా? భుజం ఆసరా ఇచ్చి నడిపించలేవా? ముందు చూపుతో నీకో దారి చూపెట్టి, నీకన్నీ అమర్చి పెట్టిన అమ్మకు నాన్నకు నువ్వు కంటి వెలుగునివ్వలేవా? ఊతమై భుజమిచ్చి నడిపించలేవా? మీ ప్రైవసీకీ అడ్డొస్తున్నారనీ వృద్ధాశ్రమాలకు పంపేయకుండా ఇంట్లో నలుగురిలో ఉంచుకోలేవా? ఆఖరి రోజులలో నావాళ్ళ మధ్యనే నేనున్నాను అనే భరోసాను వాళ్ళకివ్వలేవా? ఆస్థులు, అంతస్థులు, ఇళ్లు, పొలాలు, హోదాలు, పరపతులు, ఇవన్నీ తినీ, తినక సంపాదించి మీకివ్వాలా? తల్లిదండ్రులు ఇచ్చే ఆస్థులు కావాలి కానీ ఆ ఆస్థులు ఇచ్చిన వృద్ధులు మీకు వద్దా?


మన ఇంట్లో వృద్ధులుంటే మనకు తరాల వారసత్వ సంపద వున్నట్లే, సంప్రదాయాచారాలను అలవరిచే అనుభవజ్ఞులున్నట్లే, కష్టం విలువ, శ్రమ విలువ విడమర్చి చెప్పే వేత్తలున్నట్లే,నీతి నిజాయితీలు, క్రమశిక్షణ అలవరచే అధికారులున్నట్లే, చక్కని భవితకు పునాదులేసే మార్గదర్శకులున్నట్లే,మన సక్రమ ఎదుగుదలకు తోడ్పడే ప్రగతినిర్దేశకారులున్నట్లే, కాదంటారా? వృద్ధులంటే వేరే ఎవరో కాదు మన వాళ్ళే. మన ఉన్నతికి నిరంతరం కరిగిపోయి ఆరిపోయే దీపాలే.మనం చీదరింపులకు చీకాకులకు నొచ్చుకోని మన వాళ్ళే ఒక్కసారి వృద్ధులను చూడండి కళ్ళతో కాదు మనసుతో. వారు చెప్పేదానిని వినండి చెవులతో కాదు స్పందించే హృదయంతో. ఏదో వృద్ధుల దినోత్సవం నాడు హడావుడి కార్యక్రమాలు చేసేసి వృద్ధాశ్రమాలకు వెళ్ళి కొంతమంది వృద్ధులను సన్మానించేసి కాసేపు ఓదార్పు మాటలు మాట్లాడి కాసిని కన్నీళ్లు కార్చేసి మీడియాకు ఫోజులిచ్చే పెద్దమనుషుల్లారా! కాసింత ఓపిగ్గా వినండి. ఆ వృద్ధుల గాథలు, బాధలు. ప్రభుత్వాలు చట్టాలు చేసినంత మాత్రాన వృద్ధుల బాధలు తీరవుగా! హృదయం వున్న ప్రతీ కొడుకూ, కూతురు ఆలోచించండి. తల్లిదండ్రుల ఆస్తులు వాటాలేసుకోవడం కాదు వంతుల వారీగా తల్లిదండ్రులను పంపకాలు చేసుకోడం కాదు. వాళ్ళని ఈ పెద్ద వయసులో ఆత్మీయంగా సాకండి. తరగని సంపదలుగా భావించండి. తిరిగి సంపాదించుకోలేని అమ్మానాన్నలే వృద్ధులని గుర్తుంచుకోండి. మనసు పెట్టి సాకండి మలిసంధ్యలో. చివరి రోజులలో వారికో ఆత్మ సంతృప్తినివ్వండి. వారికి ఆసరా అయినా, భరోసా ఇచ్చినా, ఊతమిచ్చి సాకినా, ఏం చేసినా మీరే. వృద్ధులని జాలి చూపకండి. చేయూతగా మారి వారిని ఆదుకోండి మానవత్వంతో.



-అక్షర కిరీటి తెన్నేటి మాస్టారు
పశ్చిమ గోదావరి జిల్లా
సెల్: 9989515300

# హిందూ వేదాంతాన్ని విశ్వవ్యాప్తం చేసిన స్వామి రామతీర్థ

**నేడు ఆయన 151వ జయంతి**



స్వామి రామతీర్థ ఒక హిందూ మత నాయకుడు. వ్యక్తిగత, కవిత్వ పద్ధతిలో ఆచరణాత్మక వేదాంతాన్ని బోధించడంలో ప్రసిద్ధి చెందారు. రామతీర్థ వేదాంతానికి సజీవ విగ్రహం. ఆయన అసలు పేరు తీరత్ రామ్. మనిషి దైవిక స్వభావాన్ని వివరించడానికి సాధారణ అనుభవాలను ఉపయోగించాడు. రామతీర్థకు కనిపించే ప్రతి వస్తువు భగవంతుని ప్రతిబింబమే. తన స్వల్ప జీవితంలో, ఆయన గొప్ప సంఘ సంస్కర్త, అద్భుతమైన వక్త, ప్రముఖ రచయిత, అద్భుతమైన సన్యాసి, ఉన్నత జాతీయవాది హోదాను పొందాడు. స్వామి రామతీర్థ వేదాంత హిందూ తత్వశాస్త్రం భారతీయ గురువు . ఆయన యునైటెడ్ స్టేట్స్‌లో ఉపన్యాసాలు ఇచ్చిన మొదటి ప్రముఖ హిందూ మత గురువులలో ఒకరు. 1902లో అక్కడికి వెళ్లారు, స్వామి రామతీర్థ తన అమెరికన్ పర్యటనల సమయంలో 'ఆచరణాత్మక' అనే భావనపై తరచుగా ప్రసంగించేవారు. ఆయన అమెరికన్ విశ్వవిద్యాలయాలకు యువ భారతీయులను తీసుకురావాలని ప్రతిపాదించాడు. భారతీయ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయడంలో సహాయం చేశాడు.స్వామి రామతీర్థ తన అపూర్వమైన పనితో ప్రపంచం మొత్తం మీద పేరు తెచ్చుకున్నాడు. ఆయన కేవలం 32 సంవత్సరాల వయస్సులో తన జీవితాన్ని విడిచిపెట్టాడు, కానీ ఈ చిన్న జీవితం అనేక అసాధారణ విజయాలు సాధించాడు. ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడపడానికి దీర్ఘాయువు అవసరం లేదని నిరూపిస్తుంది.

రామతీర్థ పంజాబీ కుటుంబంలో పండిట్ హీరానంద్ గోస్వామికి 22 అక్టోబర్ 1873న పాకిస్తాన్ పంజాబ్ గుజ్రాన్‌వాలా జిల్లాలోని మురళీవాలా గ్రామంలో జన్మించారు . ఆయన రోజుల వయస్సులో ఉన్నప్పుడు తల్లి చనిపోయింది. అన్నయ్య గోస్సేన్ గురుదాస్ వద్ద పెరిగాడు. చిన్నతనంలో, రాముడికి పవిత్ర గ్రంథాల నుండి పారాయణాలు వినడం, కథలకు హాజరు కావడం చాలా ఇష్టం. రాముడు ముఖ్యంగా గణితంలో తెలివైన విద్యార్థి. లాహోర్‌లోని ప్రభుత్వ కళాశాల నుండి గణితశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీని పొందిన తరువాత, కొంతకాలం లాహోర్‌లోని ఫోర్మాన్ క్రిస్టియన్ కళాశాలలో గణితశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేశాడు. ఈ దశలోనే ఆయన ఆధ్యాత్మిక జీవితం వికసించడం ప్రారంభించింది. గీత చదవడం ప్రారంభించాడు. శ్రీకృష్ణుని గొప్ప భక్తుడు అయ్యాడు. ఆయన తీవ్రమైన కోరిక శ్రీకృష్ణుని దర్శనాన్ని ఇచ్చింది. లాహోర్‌లోని సనాతన ధర్మ సభ ఆధ్వర్యంలో భక్తిపై ఉపన్యాసాలు ఇచ్చేవారు.

రామతీర్థ తన ఆధ్యాత్మిక జీవితాన్ని భగవంతుని భక్తుడిగా ప్రారంభించి, ద్వారకా మఠానికి చెందిన శ్రీ మాధవ తీర్థ ప్రేరణతో వేదాంతాన్ని అభ్యసించారు.లాహోర్‌లో మొదటిసారి చూసిన స్వామి వివేకానంద ఆయన ఆధ్యాత్మిక జీవితానికి గొప్ప ప్రేరణనిచ్చాడు. సన్యాసిగా ఉన్న స్వామిని చూడగానే కాషాయ వస్త్రాన్ని ధరించాలనే కోరిక రేకెత్తించింది.1897లో లాహోర్‌లో స్వామి వివేకానందతో జరిగిన ఒక అవకాశం , సన్యాసి జీవితాన్ని చేపట్టాలనే ఆయన నిర్ణయాన్ని ప్రేరేపించింది .అంతటా వ్యాపించిన భగవంతుని దర్శనం పట్ల మక్కువ మరింత పెరగడం ప్రారంభమైంది. దేవునితో ఏకత్వం కోసం చాలా ఆశపడ్డాడు. తిండి, బట్టల పట్ల ఉదాసీనతతో ఎప్పుడూ ఆనంద పారవశ్యంతో ఉండేవాడు. అతని చెంపల మీదుగా కన్నీళ్లు తరచూ ప్రవహించేవి. కృష్ణుడు , అద్వైత వేదాంతానికి సంబంధించిన ప్రసంగాలకు ప్రసిద్ధి చెందిన ఆయన 1899లో దీపావళి రోజున తన భార్య, పిల్లలను, తన ప్రొఫెసర్ కుర్చీని విడిచిపెట్టి స్వామి అయ్యాడు. "సన్యాసిగా డబ్బును ముట్టుకోలేదు. తనతో సామాను తీసుకెళ్లలేదు. అయినప్పటికీ, అతను ప్రపంచాన్ని చుట్టివచ్చాడు. హిందూమతాన్ని బోధించడానికి జపాన్ పర్యటనకు తెహ్రీకి చెందిన మహారాజా కీర్తిషా బహదూర్ ఆర్థిక సహాయం అందించారు. అక్కడి నుండి 1902లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు వెళ్లాడు. అక్కడ అతను హిందూ మతం, ఇతర మతాలు ,"ఆచరణాత్మక వేదాంత" తత్వశాస్త్రంపై రెండు సంవత్సరాలు ఉపన్యాసాలు ఇచ్చాడు. భారతదేశంలోని కుల వ్యవస్థ అకృత్యాలు, స్త్రీలు, పేదల విద్య ప్రాముఖ్యత గురించి తరచుగా మాట్లాడేవారు. "మహిళలు, పిల్లలు, శ్రామిక వర్గాల విద్యను నిర్లక్ష్యం చేయడం మనకు మద్దతు ఇస్తున్న కొమ్మలను నరికివేయడం వంటిది. ఇది జాతీయత అనే చెట్టు మూలాలకు చావుదెబ్బ కొట్టడం లాంటిది అనేవారు. భారతదేశానికి విద్యావంతులైన యువకులు అవసరమని, మిషనరీలు కాదని వాదిస్తూ, అమెరికన్ విశ్వవిద్యాలయాలలో భారతీయ విద్యార్థులకు సహాయం చేయడానికి ఒక సంస్థను ప్రారంభించాడు. భారతీయ విద్యార్థులకు అనేక స్కాలర్‌షిప్‌లను స్థాపించడంలో సహాయం చేశాడు. స్వామి రామతీర్థ ఓడలో యుఎస్‌కి ప్రయాణిస్తున్నాడు, ఓడ యుఎస్ చేరుకున్నప్పుడు, ఆయన్ని ఆహ్వానించడానికి ఎవరూ లేరు, ఆయన వద్ద నగదు లేదు , ఆయన వేచి ఉన్నాడు, ఆయన ముందు వ్యక్తి అడిగాడు" మీరు ఎవరి కోసం ఎదురు చూస్తున్నారు" అని. అప్పుడు స్వామీజీ అన్నారు, అవును , నేను నీ కోసం ఎదురు చూస్తున్నాను. ఆ వ్యక్తి ఆ తర్వాత రెండేళ్లు స్వామిని చూసుకున్నాడు, ఆ తర్వాత రెండేళ్లు స్వామి అతని ఇంట్లోనే ఉన్నాడు.ఆయన ఎల్లప్పుడూ తనను తాను మూడవ వ్యక్తిగా సూచిస్తాడు , ఇది అహం నుండి తనను తాను వేరుచేసుకోవడానికి హిందూ మతంలో ఒక సాధారణ ఆధ్యాత్మిక అభ్యాసం. ఒక విఐపి తనను సందర్శించినప్పుడు, అతను తనను తాను చక్రవర్తి రాముడిగా చెప్పుకున్నాడు.

1904లో భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు మొదట్లో ఆయన ఉపన్యాసాలకు హాజరైనప్పటికీ, 1906లో ప్రజా జీవితం నుండి పూర్తిగా వైదొలిగి హిమాలయాల దిగువ ప్రాంతాలకు వెళ్లి అక్కడ ఆచరణాత్మక వేదాంతాన్ని క్రమబద్ధంగా ప్రదర్శించే పుస్తకాన్ని రాయడానికి సిద్ధమయ్యాడు. కానీ, పూర్తి కాకుండానే 17 అక్టోబర్ 1906 న మరణించాడు. ఆయన చనిపోలేదు కానీ తన శరీరాన్ని గంగా నదికి ఇచ్చాడని చాలామంది నమ్ముతారు.భవిష్యత్ భారతదేశం గురించి స్వామి రామతీర్థ చేసిన ఒక ముఖ్యమైన అంచనా శివ ఆర్. ఝువార్ పుస్తకం, బిల్డింగ్ ఎ నోబుల్ వరల్డ్‌లో ఉదహరించారు. .రామతీర్థ పబ్లికేషన్ లీగ్ భారతదేశంలోని ఈ గొప్ప సాధువు చాలా రచనలను బయటకు తీసుకువచ్చింది. అవి ఇన్ ది వుడ్స్ ఆఫ్ గాడ్-రియలైజేషన్ పేరుతో అనేక సంపుటాలుగా వెలువడ్డాయి.

పంజాబీ భారతీయ జాతీయవాది భగత్ సింగ్ తన వ్యాసం "పంజాబ్ భాష , లిపి సమస్య"-లో భారత జాతీయవాద ఉద్యమానికి పంజాబ్ చేసిన గొప్ప సహకారానికి ఉదాహరణగా తీర్థను పేర్కొన్నాడు. తీర్థకు స్మారక చిహ్నాలు లేకపోవడం, ఉద్యమంలో పంజాబ్ చేసిన కృషికి గౌరవం లేకపోవడానికి సింగ్ ఉదాహరణగా ఇచ్చారు. భారతీయ విప్లవ పండిట్ రామ్ ప్రసాద్ బిస్మిల్ యువ సన్యాసి అనే పద్యంలో స్వామి రామతీర్థ పాత్రను చిత్రించారు .అతని ఇద్దరు శిష్యులు, . పురాణ్ సింగ్ , నారాయణ స్వామి జీవిత చరిత్రలు రాశారు. పురాణ్ సింగ్ ది స్టోరీ ఆఫ్ స్వామి రామ: ది పోయెట్ మాంక్ ఆఫ్ ది పంజాబ్ 1924లో వెలువడింది. ఇది ఆంగ్లంతో పాటు హిందీలో కూడా ప్రచురితమైంది. నారాయణ స్వామి పేరులేని వృత్తాంతం 1935లో రామతీర్థ సేకరించిన రచనలలో భాగంగా ప్రచురితమైంది. ఆయన జీవితానికి సంబంధించిన మరో కథనాన్ని హరి ప్రసాద్ శాస్త్రి రచించారు.1955లో హెచ్‌పి శాస్త్రి సైంటిస్ట్ అండ్ మహాత్మా'గా అనువదించిన స్వామి రామతీర్థ కవితలతో ప్రచురించారు.పరమహంస యోగానంద రామతీర్థ అనేక పద్యాలను బెంగాలీ నుండి ఆంగ్లంలోకి అనువదించారు . వాటిలో ఒకటి, "మార్చింగ్ లైట్ " పేరుతో, యోగానంద కాస్మిక్ చంట్స్ పుస్తకంలో "స్వామి రామతీర్థ పాట"గా కనిపించింది.స్వామి రామతీర్థ మిషన్ ఆశ్రమం ఉత్తరాఖండ్‌లోని డెహ్రా డూన్ సమీపంలోని కోటల్ గావ్ రాజ్‌పురాలో ఉంది .

-పోతుగంటి వెంకటరమణ,
న్యూస్ నెట్‌వర్క్ ఇన్‌ఛార్జి
(వీ3 న్యూస్, విశ్వంభర)
సెల్: 6304475133

# అగ్రరాజ్యంలో భారతీయం

**అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మన వాళ్లే ఓట్లే కీలకం**

**మెక్సికన్ల తర్వాత భారతీయులదే రెండో స్థానం**

**సంఖ్య తక్కువైనా ప్రభావం ఎక్కువ**

**ఓట్లు దక్కించుకునేందుకు రెండు పార్టీల ప్రణాళిక**



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భారతీయ అమెరికన్లు తీవ్ర ప్రభావం చూపనున్నారు. అమెరికాకు వలస వచ్చిన వారిలో మెక్సికన్ల తర్వాత భారతీయులదే రెండో స్థానం. ఈ ఏడాది ఎన్నికల్లో భారతీయ అమెరికన్ల ఓట్లు కీలకంగా మారాయి. సంఖ్య పరంగా చూస్తే ఓటర్ల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, నానాటికీ భారతీయ అమెరికన్ల ప్రభావం పెరుగుతుండడం వల్ల వారిని విస్మరించే పరిస్థితి లేదు. అందుకే రెండు ప్రధాన పార్టీలు వీరి ఓట్లను దక్కించుకునేందుకు ప్రత్యేక ప్రణాళికలు వేస్తున్నాయి.

**భారతీయ అమెరికన్ల ఓట్లే కీలకం!..**

అమెరికాలో నవంబర్ 5న జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో భారతీయ అమెరికన్ల ఓట్లు కీలకంగా మారాయి. అక్కడి దేశ రాజకీయాల్లో భారతీయ మూలాలు ఉన్నవారు కీలక పాత్ర పోషిస్తున్నారు. కేవలం ఓటర్లుగానే కాకుండా రాజకీయ నేతలుగా, అభ్యర్థులుగా, ఓటర్లను సమీకరించే శక్తిగా, నిధుల సేకరించే వారిగా ఇలా అనేక అంశాల్లో భారతీయులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అమెరికా మొత్తం ఓటర్లలో భారతీయ అమెరికన్ల ఓట్లు దాదాపు 21 లక్షలు ఉంటాయి. సంఖ్యా పరంగా చూస్తే తక్కువే అయినా వీరి ప్రభావం నానాటికీ పెరుగుతుండడంతో వీరిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అందుకే రెండు ప్రధాన పార్టీలైన డెమోక్రటిక్, రిపబ్లికన్ పార్టీలు భారతీయ అమెరికన్లను విస్మరించే పరిస్థితి లేదు. ఈసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్న డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ కూడా భారతీయ మూలాలు ఉన్న వ్యక్తి కావడం గమనార్హం. భారతీయ అమెరికన్లలో ఎక్కువ మంది విద్యాధికులే ఉన్నారు.

**స్వింగ్ రాష్ట్రాల్లో పరిస్థితి ఏమిటి?..**

అధ్యక్ష ఎన్నికను మలుపు తిప్పగల సామర్థ్యమున్న స్వింగ్ రాష్ట్రాల్లో భారతీయుల జనాభా ఎక్కువగా ఉంది. స్వింగ్ స్టేట్‌స్‌గా పిలిచే పెన్సిల్వేనియా, ఆరిజోనా, నెవాడా, జార్జియా, మిషిగన్, నార్త్ కరోలినా, విస్కాన్సిన్ రాష్ట్రాల్లో ఉన్న దక్షిణాసియా ఓటర్లలో ఇండియన్లు అత్యధికంగా ఉన్నారు. అధ్యక్ష ఎన్నికల ఫలితాన్ని తేల్చడంలో అత్యంత కీలకమైన పెన్సిల్వేనియా రాష్ట్రంలోని బక్స్ కౌంటీలో భారతీయులు అధిక సంఖ్యలో ఉన్నారు. మిషిగన్, జార్జియా రాష్ట్రాల్లోనూ భారతీయ సంతతి అధికంగా ఉంది. దీంతో వీరి ఓట్లు, మద్దతు రెండు పార్టీలకూ కీలకంగా మారనుంది.

అధ్యక్ష ఎన్నికల్లో విజేతను తేల్చడంలో అతి కీలకంగా మారే మిషిగన్, జార్జియా వంటి స్వింగ్ స్టేట్లలో భారతీయుల మద్దతు రెండు పార్టీలకూ మరింత కీలకంగా మారాయి. 2020లో బైడెన్ విజయంలో జార్జియా ఫలితమే నిర్ణాయకంగా మారడం తెలిసిందే. అక్కడ భారతీయ ఓటర్ల సంఖ్య చాలా ఎక్కువ. గత రెండు మూడు అధ్యక్ష ఎన్నికలు అత్యంత హోరాహోరీగా జరుగుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో హారిస్, ట్రంప్ భాగ్యరేఖలు స్వింగ్ స్టేట్లలోని ఇండియన్ ఓటర్ల మనోగతంపై గట్టిగానే ఆధారపడ్డాయంటే అతిశయోక్తి కాదంటారు డాక్టర్ మిశ్రా. స్వింగ్ స్టేట్లుగా పేరుబడ్డ 10 రాష్ట్రాల్లో ఉన్న దక్షిణాసియా ఓటర్లలో ఇండియన్లే మెజారిటీ. స్వింగ్ స్టేట్లలో పెన్సిల్వేనియాను అత్యంత కీలకమైనదిగా చెప్తారు. అలాంటి రాష్ట్రంలో అధ్యక్ష ఎన్నికల ఫలితాన్ని తేల్చడంలో బక్స్ కౌంటీది నిర్ణయాక పాత్ర. అక్కడ ఆధిపత్యం పూర్తిగా ఇండియన్లదే! దక్షిణాసియాకు చెందిన 48 లక్షల మంది పై చిలుకు యువ ఓటర్లను ప్రభావితం చేయడంలో భారతీయులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. గత రెండు అధ్యక్ష ఎన్నికల్లోనూ భారతీయ అమెరికన్లు భారీ సంఖ్యలో ఓటేశారు.

**సర్వేలు ఏం చెబుతున్నాయి?..**

స్వింగ్ రాష్ట్రాల్లో హారిస్, ట్రంప్ విజయావకాశాలపై ఇండియన్ ఓటర్లు ప్రభావితం చేసే అవకాశం ఉందని సర్వేలు అంటున్నాయి. అమెరికాలో దక్షిణాసియాకు చెందిన 48 లక్షల మందిపైగా యువ ఓటర్లను ప్రభావిత చేయడంలో భారతీయులు కీలకంగా మారినట్లు వెల్లడించాయి. గత రెండు అధ్యక్ష ఎన్నికల్లోనూ భారతీయ అమెరికన్లు భారీ సంఖ్యలో ఓటేసినట్లు ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. 2020 ఎన్నికల్లో 71 శాతం ఇండో అమెరిన్లు ఓటేసినట్లు చెప్పాయి. ఈ సారి 91 శాతం మంది ఓటు వేసే అవకాశాలు ఉన్నాయని ఆసియన్ అమెరికన్ ఓటర్ సర్వే అంచనా వేసింది.

**భారీ స్థాయిలో విరాళాలు..**

అమెరికాలో ప్రధాన పార్టీలకు భారతీయ అమెరికన్ల నుంచి పెద్ద మొత్తంలో విరాళాలు వెలుతున్నాయి. అక్కడ భారతీయ అమెరికన్ల సగటు వార్షిక ఆదాయం 1.45 లక్షల డాలర్లుగా ఉంది. ఇది అమెరికన్లతో పోలిస్తే 21 శాతం ఎక్కువ. హారిస్‌కు కాలిఫోర్నియాలో ఇటీవల ఒక్క వారంలోనే ఏకంగా 5.5 కోట్ల డాలర్ల విరాళాలు వచ్చాయి. వాటిలో ఎక్కువ మొత్తంలో మన వారినుంచే వచ్చాయి. డెమోక్రటిక్ పార్టీకి భారీ విరాళాలిచ్చిన జాబితాలో 60 మందికి పైగా ఇండియన్ అమెరికన్లు ఉన్నారు. భూరి విరాళాలిస్తున్న వారితో పాటు పార్టీలకు, వాటి ఎన్నికల ప్రచార కార్యకలాపాలకు చిన్న మొత్తాలు అందజేస్తున్న అమెరికన్ల సంఖ్య కూడా భారీగా పెరుగుతోందని ఆసియన్ అమెరికన్ డయాస్పొరాలో అతి పెద్దదైన రాజకీయ కార్యాచరణ కమిటీ ఏఏపీఐ విక్టరీ ఫండ్ చైర్మన్ శేఖర్ నరసింహన్ చెప్పుకొచ్చారు. 2012 నుంచీ ఇండియన్ అమెరికన్లలో ఈ ధోరణి బాగా పెరుగుతోందని డ్రూ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సంగయ్ మిశ్రా వెల్లడించారు. అమెరికా అధ్యక్ష పీఠానికి దారి సిలికాన్ వ్యాలీ గుండా వెళ్తుందన్నది నానుడి. కీలకమైన ఆ టెక్ రాజధానిలో భారతీయులదే హవా. హారిస్‌కు కాలిఫోర్నియాలో ఇటీవల ఒక్క వారంలోనే ఏకంగా 5.5 కోట్ల డాలర్ల విరాళాలు పోగయ్యాయి! వాటిలో మనవారి నుంచి వసూలైనవే ఎక్కువ. డెమొక్రాట్ పార్టీకి భారీ విరాళాలిచ్చిన జాబితాలో 60 మందికి పైగా ఇండియన్ అమెరికన్లు న్నారు. వీరిలో పారిశ్రామిక దిగ్గజం ఇంద్రా నూయీ మొదలుకుని ఏఐ ఇన్వెస్టర్ వినోద్ ఖోస్లా దాకా పలువురి పేర్లున్నాయి.

**రాజకీయాల్లోని మనవారి హవా..**

అక్కడ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్న భారతీయుల సంఖ్య పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. సెనేట్, ప్రతినిధుల సభతో పాటు రాష్ట్రాల సెనేట్లు, అసెంబ్లీలు, సిటీ కౌన్సిళ్లు, స్కూలు బోర్డులకు ప్రాతినిధ్యం వహిస్తున్న, జిల్లా అటార్నీలుగా నియమితులవుతున్న భారతీయ మూలాల ఉన్నవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. యూఎస్ కాంగ్రెస్‌లో ఐదుగురు భారతీయ అమెరికన్లున్నారు. వచ్చే ఎన్నికల్లో ఇది ఏడుకు పెరుగుతుందని భావిస్తున్నారు. అమెరికా యువజనుల్లో భారతీయులు కేవలం 0.6 శాతమే. కానీ వారిలో 4.4 శాతం మంది ప్రభుత్వంలో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. బైడెన్ పాలనా యంత్రాంగంలో 150 మందికి పైగా భారతీయ అమెరికన్లు కీలక స్థానాల్లో ఉన్నారు. హారిస్ అధ్యక్షురాలిగా ఎన్నికైతే ఆ సంఖ్య 200కు పెరిగే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. అమెరికా జనాభాలో యూదులు 2 శాతమే అయినా కాంగ్రెస్‌లో వారి సంఖ్య 10 శాతం. కొన్నేళ్లలో భారతీయులు అమెరికా సమాజంపై ఆ స్థాయిలో ప్రభావం చూపుతున్నారన్నది ఒక అంచనా.

**ఇండియన్ అమెరికన్ల మద్దతు ఎవరికి?..**

భారతీయ అమెరికన్లలో దాదాపు 55 శాతం మంది డెమోక్రటిక్ పార్టీ మద్దతిస్తున్నట్లు తాజా సర్వేలు వెల్లడించాయి. 25 శాతం మంది రిపబ్లికన్ పార్టీకి మద్దతిచ్చారు. 15 శాతం మంది స్వతంత్రులకు మద్దతివ్వగా, మిగిలిన వారు తమ అభిప్రాయాన్ని చెప్పేందుకు విముఖత చూపినట్లు సర్వేలు తెలిపాయి. 2020 నుంచి ఇండియన్ అమెరికన్లు ముఖ్యంగా హిందువులు రిపబ్లికన్ పార్టీకి క్రమంగా దూరమవుతున్న వైనం స్పష్టంగా కన్పిస్తోందని సర్వేలు చెప్పాయి.అమెరికా మొత్తం ఓటర్లు 16.1 కోట్ల పై చిలుకు. అందులో భారతీయ అమెరికన్ల సంఖ్య మహా అయితే 21 లక్షలు. కానీ ఆ దేశ రాజకీయాల్లో మనవాళ్లు నానాటికీ ప్రబల శక్తిగా ఎదుగుతున్నారు. ప్రధాన పార్టీలైన రిపబ్లికన్లు, డెమొక్రాట్లు ఇప్పుడు వారి రాజకీయ శక్తిని ఏ మాత్రమూ విస్మరించే పరిస్థితి లేదు.

# ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

## ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



**విశ్వంభర, చింతపల్లి:** రైతులు పండించిన చివరి ధాన్యం ప్రతి గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని కుర్మేడ్ గ్రామంలో నాఫెడ్ సహకారంతో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, చింతపల్లి మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మేలు చేయడంలో గత ప్రభుత్వం లాగా కాంగ్రెస్ పార్టీ మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం సర్కార్ నిధులు ఇవ్వకుండా వదిలేసిన చాలా పథకాలకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేయడం, రైతుల సంక్షేమంపై మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క రైతుకు పెట్టుబడి సాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దీనికి అనుకూలంగా మంత్రి వర్గ ఉప సంఘం నివేదిక రూపొందిస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. రాష్ట్ర మంత్రి వర్గ ఉప సంఘం నివేదిక ఇచ్చిన తర్వాతే తెలంగాణలో వచ్చే యాసంగి సీజన్ నుంచి రైతు భరోసా పథకం అమలు చేస్తామని, ఎకరానికి రూ.7,500ల చొప్పున ఇస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రెండు లక్షల వరకు రుణాలుండి నిర్ధారణ కాని రైతు కుటుంబాలను గుర్తించి వారి ఖాతాలో నిధులను జమ చేస్తామన్నారు. వచ్చే సీజన్ నుంచి పంటల భీమా పథకం అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వం హయంలో రైతు బంధు కింద కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్, వెంచర్లు, సాగులో లేని భూములకు సైతం దాదాపు రూ.25 వేల కోట్లు ఇచ్చారని బీఆర్ఎస్ పార్టీ నాయకులపై ఎమ్మెల్యే బాలునాయక్ మండిపడ్డారు. మా ప్రభుత్వం హయంలో కేవలం సాగులో ఉన్న భూములకే రైతు భరోసా నిధులు జమ చేస్తామని తెలిపారు. ఇందు కోసం మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు చేశామని. విధివిధానాలు ఖరారు కాగానే రాబోయే పంట సీజన్ నుంచి రైతుల ఖాతాలో పంట సాయం వేస్తామని, ఆర్థిక వెసులుబాటు లేకపోయినా రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం, మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, మాజీ జెడ్పీటీసీ హరి నాయక్, మాస భాస్కర్, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, కొండల్ యాదవ్, ఏవో శ్రావణి కుమారి, సీఈవో మల్లేష్, ఎమ్మార్వో రమాకాంత్ శర్మ, ఎంపీడీవో సుజాత, ఆర్ ఐ సునీత, ఏఈఓ నర్సింహా, బేసిక్ సంస్థ సంగమేశ్వర్ రావు, పలువురు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన విభాగం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎల్ఓసీ అందజేసిన మాజీ జడ్పీటీసీ



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలంలోని చరికొండ గ్రామ పంచాయతీకి చెందిన మహమ్మద్ హుస్సేన్ అనారోగ్యంతో నిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆర్థిక భారం ఎక్కువైనందున మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ చొరవతో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని ఆశ్రయించారు. దీంతో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సహకారంతో హుస్సేన్ కుటుంబానికి ఎల్ఓసీ క్రింద 2 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. ప్రొసీడింగ్ కాపీలను నిమ్స్ హాస్పిటల్లో మాజీ సర్పంచ్ లాలికోట భారతమ్మ నరసింహ గౌడ్తో కలిసి హుస్సేన్ కుటుంబానికి అందించారు. నరసింహగౌడ్ బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## వానాకాలం రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కార్



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రైతు హామీలు నెరవేర్చాలని, వానాకాలం రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతపట్టి స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడుతూ రైతాంగ వ్యతిరేక చర్యలు చేపడుతున్న కాంగ్రెస్ ద్వంద వైఖరి తగదన్నారు. ఎన్నికల్లో సీట్ల కోసం రైతులకు, రైతు కూలీలకు, కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని, బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8,000లు ఇస్తున్నది మేము రూ. 15,000లు ఇస్తామని మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు రైతు భరోసా రైతులకు ఎగ్గొట్టి, పెట్టుబడి సాయం మరిచి, రైతులతోచెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ విధానం సహించలేనిదని సునీల్ కుమార్ అన్నారు. ఆరు గ్యారెంటీలతో మహిళలకు మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించిందని, ఎటువంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ, రైతు బీమా, 24 గంటల వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు అందించాలని లేకపోతే రైతాంగ పోరాటం మరింత ఉధృతం చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం పోరాటంలో కొట్టుకుపోవడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు పడిసిరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు బీరబోయిన వెంకట నరసమ్మ, అయినాల రామకృష్ణ, కోలా రాజు, గుంజా ఏడుకొండలు, తూటిక ప్రకాష్, కాపుల సూరిబాబు, బత్తుల నరసింహులు, పసుపులేటి రమేష్, గోసుల శ్రీనివాస్, రాజుదేవర నాగరాజు, బడిశా నాగరాజు, కావూరి సీతామహాలక్ష్మి, పూజల లక్ష్మి, నరసమ్మ, తేల్లం రాణి, సుశీలమ్మ, సలోమి, సలీమా, ప్రియాంక ఉన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ



**విశ్వంభర, వరంగల్:** వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్లో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. అనంతరం మార్కెట్ ఆఫీస్ ఆవరణలో రైతులు, కొనుగోలుదారుల సమస్యల మీద మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వినతులు స్వీకరించి వారి పట్ల సానుకూలంగా స్పందించారు. అనంతరం మొదటి సారి మార్కెట్ వచ్చిన మంత్రి, ఎమ్మెల్యేలను మార్కెట్ సెక్రటరి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. మార్కెట్ సమస్యల మీద మంత్రి, ఎమ్మెల్యేలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీసీఐ జనరల్ మేనేజర్ అర్జున్, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బొమ్మినేనీ రవీందర్ రెడ్డి, స్థానిక డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, ప్రజా ప్రతినిధులు, మార్కెటింగ్, వ్యవసాయ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకున్ని పరామర్శించిన చల్లా



**విశ్వంభర, వరంగల్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ పరిధిలోని బొల్లికుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సోల్తి నరేందర్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సోమవారం ఉదయం పరకాల మాజీ ఎమ్మె ల్యే చల్లా ధర్మారెడ్డి నరేందర్ ను ఆయన నివా సంలో పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థి తిని, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో కొద్ది రోజుల క్రితం మృతి చెందిన గట్టికొప్పుల రాజశేఖర్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజశారు. రాజశేఖర్ మృతికి గల కార ణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసు కున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

## కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



విశ్వంభర, మహబూబాబాద్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. తొర్రూరు మండలం కంటా యిపాలెం గ్రామానికి చెందిన కొండ భారతమ్మ, తన భూమి సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయిం చవలసిందిగా దరఖాస్తు చేశారు. ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన బోయిన శంకరయ్య తనకు పక్షవాతం వచ్చిందని సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని కోరారు. మహబూబాబాద్ పట్టణం కంకర బోర్డు ఆహ్మదీబిన్ మహమ్మద్ నూతన పెన్షన్ను మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేశారు. నెల్లికుదురు మండలం రావిరాల గ్రామానికి చెందిన దొంగర శ్రీలత, తనకు బోధకాలు ఉందని పెన్షన్ మంజూరికి దరఖాస్తు చేసుకు న్నారు. ఇస్లావత్ తండాకు చెందిన కిషన్ రుణ మాఫీ పథకంలో తనకు అవకాశం కల్పించాలని దరఖాస్తు చేశారు. ఇలా రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ, దివ్యాంగుల సంక్షేమ శాఖ, తదితర విభాగాలకు చెందిన 114 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తులను సంబంధిత విభాగాల అధికారులకు పంపి పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించుటకు తగు ఆదేశాలు జారీ చేశామ న్నారు. ఈప్రజావాణి కార్యక్రమంలో డీఆర్డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధు సూదన్ రాజు, ఏడీ ఎస్ఎల్ఆర్ ఏ. నరసింహ మూర్తి, డీసీఓ వెంకటే శ్వర్లు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహ స్వామి, డిప్యూటీ జడ్పీ సీఈవో నర్మద, డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, డీపీఓ విజయనిర్మల, డీడీ గ్రౌండ్ వాటర్ సురేష్, ఈఈ ఆర్ అండ్ బీ భీమ్లా నాయక్, డీఈఓ రాజేశ్వర్, డీఎంహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, ఏడీ హార్టికల్చర్ జి.మరియన్న, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే వీర్లపల్లి




**విశ్వంభర, షాద్నగర్:** ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. సోమవారం షాద్ నగర్లో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన గందే సురేష్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. సమస్యలను పరిష్కరించేందుకు సంఘటితంగా ముందుకు సాగాలని కోరారు. తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గందే సురేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని వివరించారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ అగ్గనూరు విశ్వం, ఆర్యవైశ్య సంఘం నాయకులు పలపట్ల మోహన్ రావు, గజవాడ వెంకటేష్, బెజగం రమేష్, లష్కర్ కుమార్, పెద్దిరామ్మోహన్, ఎంసానిశ్రీనివాస్, మలిపెద్దిశ్రీనివాస్, వైశ్యప్రముఖులు పాల్గొన్నారు.

## గెస్ట్ లెక్చరర్స్ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్గా సదానందం గౌడ్



**విశ్వంభర, కల్వకుర్తి:** తెలంగాణ రాష్ట్ర అతిథి ఆధ్యాపక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా ఉమ్మడి పాలమూరు జిల్లా కల్వ కుర్తికి చెందిన తెలంగాణ ఉద్యమనేత ఉన్నత విద్యావంతుడు బీసీ మేధావుల ఫోరం సభ్యులు అయిల్ సదానందం గౌడ్ని ఏకగ్రీ వంగా ఎన్నుకోవడం జరిగింది. హైదరాబాద్లోని నాంపల్లి జీజేఎల్ఏ భవన్లో నిర్వహించిన రాష్ట్రకమిటీ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మధుసూ దన్ రెడ్డి నియామకపత్రం అందజేశారు. అతిథుల ఉద్యోగ భద్రతకై కృషి చేస్తానని సదానందం గౌడు అన్నారు. రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్గా ఎన్ను కున్న రాష్ట్రఅధ్యక్ష, కార్యద ర్శులకు, రాష్ట్ర కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

# రైతులకు రుణమాఫీ చేసి రైతు భరోసా ఇవ్వాలి

## సీపీఐ డిమాండ్



**విశ్వంభర, మహేశ్వరం:** బాలాపూర్ మండలం లెనిన్ నగర్ లో సీపీఐ పార్టీ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘం మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం పిచ్చిరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొంత మాధవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాలలో భాగంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం 11 నెలలు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు సంపూర్ణంగా రుణమాఫీ చేయలేదని అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఎకరాకు రూ. 7,500లు వేస్తామన్న హామీని అమలు చేయాలని, రైతులకు ఇచ్చినటువంటి హామీలకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. రైతుల సమస్యలపై నిరంతరం రైతు సంఘం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తుందని కేంద్ర ప్రభుత్వం రైతుల పోరాటానికి నిర్దాక్షిణ్యంగా అణచివేయడమే కాకుండా వందలాదిమంది రైతుల ప్రాణాలు పోరాటాలలో కోల్పోయారని అయినా వెనకకి తగ్గకుండా రైతాంగం పోరాటం నిర్వహించి హక్కుల సాధన కోసం నిలబడ్డారని ఆ స్ఫూర్తితో సమస్యలపై పోరాటానికి రైతాంగం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన బాలాపూర్ మండల కౌన్సిల్ని ఎన్నుకున్నారు. రైతు సంఘం బాలాపూర్ మండల అధ్యక్షులుగా పిచ్చి రాజు, మండల కార్యదర్శిగా జాజాల అంజయ్య, ఉపాధ్యక్షులుగా రామస్వామి, సహాయ కార్యదర్శిగా బాబయ్య కార్యవర్గ సభ్యులుగా సి హెచ్ శ్రీను, విజయ్ కుమార్, కౌన్సిల్ సభ్యులుగా రజియా బేగం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు జర్పుల శివనాయక్, మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి బండ యాదమ్మ యాదవ్, గిరిజన సమాఖ్య జిల్లా కోశాధికారి రమావత్ చత్రు నాయక్, చల్లా నారాయణరెడ్డి, బాలయ్య, నారాయణ, రేష్మ బేగం, దివ్య, కల్పన, శోభ, ఎండీ ఖలీల్, వీరితోపాటు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**విశ్వంభర, మేడిపల్లి:** మేడిపల్లి మండలం భీమారం గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-2008 పదవ తరగతి చదువుకున్నపూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరుపుకున్నారు. వీరంతా 16 సంవత్సరాల తర్వాత కలుసుకుని ఒకరి నొకరు పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకొని ఆలాయ్ బలాయ్ చేసుకున్నారు. చాలా రోజుల తర్వాత పిల్ల పాపలతో భార్య భర్తలతో ఇలా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఎన్నో జ్ఞాపకాలు ఎన్నెన్నో సరదాలు అలనాడు చేసిన చిలిపి పనులు, కలబడిన కలహాలు, వాదనలు, అలనాటి మధురమైన స్నేహ బంధం గురించి నెమరు వేసుకుని సంతోషంతో గడిపారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ అనాడు విద్యార్థులు చేసిన చిలిపి పనులు, చదువుపై ఆసక్తి కనపరచిన పూర్వ విద్యార్థినీ, విద్యార్థులను దండించిన జ్ఞాపకాలను విద్యార్థులతో ఉపాధ్యాయులు నెమరు వేసుకుని పూర్వ విద్యార్థులతో చాలా సేపు ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయులు లింగారెడ్డి, గంగాధర్, రాజారెడ్డి, శరత్, మోహన్, శ్యాం సుందర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ, డీజే పాటలతో డాన్సులు చేస్తూ పిల్లాపాపలతో సంతోషంగా గడిపారు.

## ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు ఎస్ఐ వెంకటేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఐదు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రత్నాకర శర్మ చూపిన మార్గంలో నడవాలి



**విశ్వంభర, హైదరాబాద్:** శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశీర్వాదంతో నిర్వహిస్తున్న శ్రీ సచ్చిదానంద కాళా పీఠం ఆధ్వర్యంలో ఆధ్యాత్మికవేత్త సీనియర్ జర్నలిస్టు యం. రత్నాకర శర్మ జయంతి వేడుకలు నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్లో నిర్వహించారు. చిన్నారులు, తల్లి దండ్రులు, గురువులు పాల్గొని నృత్యాలు, పాటలతో నీరజనాలు తెలిపారు. ముఖ్య అతిథిగా డా. యం.కే. రాము పాల్గొని రత్నాకర శర్మ చేసిన సేవలను గుర్తు చేశారు. ఆయన చూపిన మార్గంలో సంస్థ మరింత ముందుకు వెళ్ళాలని మరెన్నో సేవా కార్యక్రమాలను చేసి సమాజ శ్రేయస్సులో బాగస్వామ్యం కావాలని సూచించారు. శ్రీని వాస్ రెడ్డి, ప్రభు, పద్మ వెంకటేష్ కళాజాగృతి అధ్యక్షులు, సంగీత గురువు అనితప్రియ దర్శిని, నృత్య గురువులు డా. రేణుకా ప్రభాకర్, శ్రీమతి స్వరాజ్యలక్ష్మీ, కందాల హరిని, శిక్షణ బృందం పాల్గొన్నారు. మైసూర్ ఆస్థాన సంగీత గురువు మనస్విని వాసిరెడ్డిని రత్నాకర శర్మ అవార్డ్తో సత్కరించారు. పద్మ వెంకటేష్, కళాజాగృతి అధ్యక్షులును ఏం కే రాము ఆత్మీయ సత్కారం చేశాడు.

## రైతు నిరసన దీక్షలో పాల్గొననున్న కేటీఆర్



**విశ్వంభర, ఆమనగల్లు:** త్వరలో అమనగల్లులో 10 వేల మంది రైతులతో ఏర్పాటు చేయ తలపెట్టిన రైతు నిరసన దీక్షలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. రైతు భరోసా ఇవ్వడానికి డబ్బులు లేవంటూనే మూసీ సుందరీకరణ చేస్తున్నారని అన్నారు. రైతు బంధు డబ్బులను రైతుల అకౌంట్లలో వేయాలని జైపాల్ యాదవ్ డిమాండ్ చేశారు.

## ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



**విశ్వంభర, చింతపల్లి:** ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 29 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 31 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు పెళ్ళికి వరంగా మారిందన్నారు. అలాగే దేశంలోనే ఈ పథకం ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి కార్యక్రమాలను ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఇప్పటికే నాలుగు పథకాలు అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు, పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి, మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, మాజీ జెడ్పీటీసీ హరి నాయక్, మాస భాస్కర్, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, కొండల్ యాదవ్, సదానందం, జాల నర్సింహా రెడ్డి, ఎమ్మార్వో రమాకాంత్ శర్మ, పలువురు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన విభాగ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# అమరవీరుల స్థూపానికి ఘనంగా నివాళులు




**విశ్వంభర, సంగారెడ్డి:** అమరవీరుల స్థూపానికి సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ ఘనంగా నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ 21 అక్టోబర్ 1959లో సి.ఆర్.పి.యఫ్ ఎస్.ఐ కరమ్ సింగ్ నాయకత్వంలోని 20 మంది భారత జవాన్లు లడక్ ప్రాంతంలో హాట్ స్ప్రింగ్ వద్ద విధులు నిర్వహిస్తుండగా చైనా ఆర్మీ మన వారి పై దొంగ దాడి చేసి 10 మందిని హత మార్చిందన్నారు. అప్పటి నుండి దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరులను స్మరిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా (పోలీస్ ఫ్లాగ్ డే)గా నిర్వహిస్తున్నాం అన్నారు. ఒక్కొక రాష్ట్రంలో ఒక్కొక్క రకమైన సమస్యలు ఉండేవి, మన రాష్ట్రంలో నక్సలిజం ప్రభావం ఎక్కువగా ఉండేది, ఆ సమయంలో ఎంతో మంది జవాన్లను కోల్పోవడం జరిగిందని, పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛతీస్ ఘడ్, అస్సాం వంటి కొన్ని నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాలలోనూ ఎంతో మంది జవాన్లను కోల్పోవడం జరిగిందన్నారు. జమ్ముకాశ్మీర్ లాంటి రాష్ట్రాలలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులతో ఎంతో మంది పోలీసులు, ఆర్మీ జవాన్లు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడి ఉగ్ర మూకలను హతమార్చి, తమ తనువులను చాలించారని పేర్కొన్నారు. ఆనాటి వారి ప్రాణత్యాగల వలననే మనం ఈ రోజు స్వేచ్ఛగా ఉండ గలుగుతున్నామని అన్నారు. ఈ సంవత్సరం మన దేశంలో విధినిర్వహణలో 214 మంది వీరమరణం పొందారని, ఇందులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు ఒక్కరున్నారని అన్నారు. వీరమరణం పొందిన వారి ప్రాణ త్యాగాలను స్మరిస్తూశ్రద్ధాంజలి ఘటిస్తున్నామని తెలిపారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన నలుగురు వీర జవాన్లు వివిధ సంఘటనలలో నక్సల్స్ మరియు సంఘవిద్రోహ శక్తుల దుశ్చర్యలకు బలి అయ్యారన్నారు. ఇందులో సిర్గాపూర్ పోలీస్ స్టేషన్ కు చెందిన జంగయ్య, సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ కు చెందిన ఎల్లయ్య, జిన్నారం పోలీస్ స్టేషన్‌కు చెందిన సత్యనారాయణ, కంగ్టి పోలీస్ స్టేషన్ కు చెందిన సురేష్ విధి నిర్వహణలో ప్రాణాలర్పించి వీరమరణం పొందారని, వారి ఆత్మకు శాంతి చేకూరలని, ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నానన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ.. పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని, ఆనాటి వారి ప్రాణత్యాగల వలననే నేడు మనందరం సుఖ:సంతోషాలతో ఉండగలుగుతున్నాం అన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితిలలోనైనా పోలీసు శాఖ ఎదురు నిలబడి, పోరాడటం జరుగుతుందని, అలాంటి పోలీసుల సేవలు మనందరి మదిలో చిరస్మరణీయం అన్నారు. గడిచిన ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడంలో పోలీసుల పాత్ర కీలకం అన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిర్మూలనలో జిల్లా పోలీసు శాఖ ముందంజలో ఉందని, పోలీసుల సేవలను కొనియాడారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్నిరకాల సహాయ సహకారాలు అందించడం జరుగుతుంది అన్నారు. పోలీసు అమరుల కుటుంబాలను ఉద్దేశించి మాట్లాడుతూ పోలీసు కుటుంబాల సంక్షేమం, ఆర్థిక పరమైన ప్రయెజనాలను చేకూరేలా, వారి కుటుంబాలలో మనోధైర్యాన్ని అందించటమే పోలీసు అమరవీరులకు మనం అందించే నిజమైన నివాళి అన్నారు. అనంతరం పోలీస్ అమరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యొక్క సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందజేశారు. ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకై ఏర్పడ్డ వ్యవస్థ పోలీస్ వ్యవస్థ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, ఇలా ప్రతి సందర్భాల్లోనూ పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. అమరవీరులు అయిన పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ అక్టోబర్ 21 నుండి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన అక్టోబర్ 31 "జాతీయ ఐక్యత దినోత్సవం" వరకు ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్.పి ఎ.సంజీవ డి.ఎస్.పి సత్తయ్య గౌడ్, జహీరాబాద్ డి.ఎస్.పి రామ్ మోహన్ రెడ్డి, పటాన్ చేరు డి.ఎస్.పి రవీందర్ రెడ్డి, నారాయణఖేడ్ డి.ఎస్.పి వెంకట్ రెడ్డి, ఎఆర్. డి.ఎస్.పి నరేందర్, యస్.బి సీఐ విజయ్ కృష్ణ, డి.ఎస్.ఆర్.బి సీఐ రమేష్, జిల్లా సీఐలు, ఆర్ఐలు రామరావ్, రాజశేఖర్, పరేడ్ కమాండర్ డానియెల్, అమరవీరుల కుటుంబ సభ్యులు హాజరై నివాళ్లులు అర్పించారు.



పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం మహబూబాబాద్ పట్టణంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ అమరవీరులకు నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించిన జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ సుధీర్ ఆర్ కేకన్, పోలీస్ సిబ్బంది తదితరులు. (విశ్వంభర, మహబూబాబాద్)

## 27న దీపావళి సదర్ సమ్మేళనం ఉత్సవాలు



**విశ్వంభర, హైదరాబాద్:** ఈ నెల 27న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద రాజ్యసభ సభ్యుడు ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో దీపావళి సదర్ సమ్మేళనం ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజర కానున్నట్లు ఆయన తెలిపారు. యాదవులంతా ఈ దీపావళి సదర్ వేడుకలకు పార్టీలకు అతీతంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సదర్ పండుగ వ్యక్తుల మధ్య గాని కుటుంబాల మధ్యగాని జరగటంలేదని భేదాభిప్రాయాలను రానీయకుండా యధావిధిగా నూతన ఉత్సాహంతో కొనసాగించడానికి ఇలాంటి వేడుకలు దోహదపడతాయని అనిల్ అన్నాడు. సదర అనేది ఒక యాదవులకు మాత్రమే చెందింది అని కాకుండా హిందువులందరి వేడుకగా భావించాలని ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ సూచించారు.

## సిమెంటు కంపెనీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి

### ఐలు జిల్లా అధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో నెలకొల్పనున్న అంబుజా సిమెంట్ కంపెనీకి వ్యతిరేకంగా సకలజనులు ఉద్యమించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి కోరారు. కాలుష్యకారక అంబుజా సిమెంట్ కంపెనీ రామన్నపేట జనావాసాలకు దగ్గరలో ఏర్పాటు చేయడం అమానుషమని, కంపెనీకి వ్యతిరేకంగా ప్రజలంతా ఈ నెల 23 జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో వ్యతిరేకించాలని, నోటిఫికేషన్లో ఇచ్చిన వెబ్సైట్లో ఈ-మెయిల్ ee-nlg-tspcb@telangana.gov.inకు విస్తృతంగా, కంపెనీకి వ్యతిరేకంగా మెయిల్ చేయాలని ఆయన కోరారు. ప్రజలంతా వ్యతిరేకించి 23న జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో పెద్ద ఎత్తున ప్రజలు, కార్మికులు, కర్షకులు, రైతులు, యువకులు, విద్యార్థులు, మేధావులు, అందరూ ఐక్యంగా ఎదుర్కోవాలని ఆయన కోరారు. వర్తక సంఘం ఏర్పాటు చేసిన జీప్ జాత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ ఎండి రెహాన్, సభ్యులు బాబు, కందుల హనుమంతు, కామిశెట్టి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు, డ్రగ్స్ పై అవగాహన



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం తిమ్మాపురం గ్రామంలో సోమవారం గ్రామ ప్రజలతో సీఐ పి.సోలోమన్ రాజు మాట్లాడారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ పైన అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు గ్రామంలో తిరుగుతుంటే వెంటనే పోలీసు లకు సమాచారం అందించాలని కోరారు. యువత గ్రామ అభివృద్ధి కోసం పాటుపడాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. సైబర్ నేరాగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే మీ యొక్క వివరాలు చెప్పొద్దని సూచనలు చేశారు. పోలీస్ సిబ్బందికి గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువత, పోలీస్‌సిబ్బంది రంగం శ్రీను, కప్పర హుస్సేన్, పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని కొత్తగూడెం, లక్ష్మాపురం, శోభనాద్రిపురం, నీర్నెముల గ్రామాల్లో పి.ఎ.సి.ఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పి.ఎ.సి.ఎస్ ఛైర్మన్ నంద్యాల నర్సింహా రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగిరెడ్డి మల్లారెడ్డి లు ప్రారంబించారు. పి.ఎ.సి.ఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జంగారెడ్డి, పి.ఎ.సి.ఎస్ డైరెక్టర్లు మంగలపెల్లి కొండల్ రెడ్డి, నక్క యాదయ్య, మాజీ సర్పంచ్లు ఉప్పు ప్రకాష్, చిల్లర కైలాసం, నాయకులు బత్తుల కృష్ణ, గుడిపెల్లి నర్సిరెడ్డి, నీలనర్సింహ,పి.ఎ.సి.ఎస్ సిబ్బంది సాలయ్య, గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## విగ్రహంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



**విశ్వంభర, ఎల్‌బీ నగర్:** ముత్యాలమ్మ గుడి విగ్రహం పైదాడి చేసిన ఉగ్రముకలను కఠినంగా శిక్షించాలని రంగా రెడ్డిజిల్ల కోర్టు న్యాయ వాధుల నిరసన వ్యక్తంచేశారు. సికింద్రాబాద్ కుమ్మరి బస్తి ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహం పై దాడికి పాల్పడిన ఉగ్రముకపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం రంగా రెడ్డి జిల్లా కోర్టు న్యాయ వాదులు తమ నిరసనను తెలిపారు. వరుస క్రమంలో హైంథవ సంస్కృతి పై దాడి చెస్తున్న నింధితులను వదిలి పోలీసులు ఆదివారం నిరసన చెస్తున్న హింధువులపై లాటీచార్జి చేయడం అమానుషం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాధి శ్రీనాథ్, ప్రదీప, రంగా ప్రవీణ్ కుమార్, నరేష్, శ్రీకాంత, పరమేశ్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ హెూదాల్లో పనిచేస్తూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల చిత్ర పటాలకు సీఐ పి.సోలోమన్ రాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి అని అన్నారు. అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఐదు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై సైదులు, పోలీసులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## పంబాల కులస్తులను ఎస్సీ (ఏ)లో చేర్చాలి




**విశ్వంభర,హనుమకొండ:** హనుమకొండఎస్సీ ఉపకులాల నిరసన దీక్షలో హనుమకొండ జిల్లా పంబాల కులస్తులు పెద్ద మొత్తంలో హాజరయ్యారని సోమవారం పంబాల కుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం భార్గవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంబాల కులస్తులను ఎస్సీ పంబాలగా ప్రభుత్వం గుర్తించాలని ఆయన అన్నారు. ఎస్సీ (ఏ)లో పంబాల కులస్తులను చేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుల ధ్రువీకరణ పత్రాలను(ఆర్‌డీఓ) వద్ద నుండి కాకుండా, మండల తహసిల్దార్ నుండి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆయా గ్రామాల నుండి నిరసన దీక్షకు తరలి వచ్చిన పంబాల కులస్తులందరికీ గడ్డం భార్గవ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంబాల కుల వృత్తి రాష్ట్ర అధ్యక్షులు సుద్దాల కుమారస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల పాండు, సుద్దాల ప్రవీణ్, హనుమకొండ జిల్లా పంబాల సంఘం అధ్యక్షుడు గడ్డం భార్గవ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రౌతు హరికృష్ణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గడ్డం రాజయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల భూపాల్ రాజు, రాష్ట్ర కోశాధికారి ఉమ్మడి వరంగల్ జిల్ల ఇంచార్జి బత్తుల శ్రీనివాస్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం విజయేందర్, గడ్డం కుమార్, గడ్డం అశోక్, బత్తుల రామకృష్ణ, కొండూరు సత్యనారాయణ, గడ్డం వెంకట రమణ, బోడ దేవేందర్, బోడ విజయేందర్, సుద్దాల మహీందర్, ప్రదీప్ పాల్గొన్నారు.

## అర్జీలను వెంటనే పరిష్కరించాలి

- ప్రజావాణికి 94 దరఖాస్తులు
- ప్రత్యేక అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవే క్షించాలి
- ట్రై సైకిళ్ళు పంపిణీ చేసిన కలెక్టర్
- తేజస్ నంద్ లాల్ పవార్



**విశ్వంభర, సూర్యాపేట:** ప్రజావాణిలో వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఇబ్బంది పడకుండా సాధ్యమైనంత త్వరగా ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మండలాలకి కేటాయించిన ప్రత్యేక అధికారులు తమ మండలంలో కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఆశ కార్యకర్తలు రోజు వారి కార్య క్రమ వివరాలను నమోదు చేసుకొనుటకు ఆశ కార్యకర్త దినచర్య రికార్డ్ లను కలెక్టర్ ఆశ కార్యకర్తలకు అందజేశారు. అనంతరం మోతేకి చెందిన రేణుక, బుర్కచర్ల కి చెందిన నర్సయ్య, చంద్రయ్య, చివ్వేంల మండలం ఖాదర్ లకు వికలాంగుల ట్రై సైకిళ్ళు పంపిణి చేశారు. నేటి ప్రజావాణిలో భూ సమస్యలకు సంబందించి 37 దరఖాస్తులు, డీ ఆర్‌డీఏ 25, పంచాయతీ రాజ్ శాఖకి సంబంధించి 7 దరఖాస్తులు, జిల్లా సంక్షేమ శాఖకి సంబందించి 5 దరఖాస్తులు, శాఖలకి సంబందించి 20దరఖాస్తులు, మొత్తం 94దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. సీ పీ ఓ కిషన్, డీ పీ ఓ నారాయణ రెడ్డి, డీఏఓ శ్రీధర్ రెడ్డి, డీ యం హెచ్ ఓ కోటాచలం, డీ డబ్ల్యూ ఓ నరసింహ రావు, సంక్షేమ అధికారులు శంకర్, లత, అనసూయ, జగదీశ్వర్ రెడ్డి, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరిటీడెంట్‌లు పద్మారావు, సాయి గౌడ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి



**విశ్వంభర, భూపాలపల్లి:** విధి నిర్వహణలో, దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం పోలీస్ ఫ్లాగ్ డే ను పురస్కరించుకుని జిల్లాలోని అర్మ్డ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలోని అమరవీరుల స్థూపం వద్ద, స్మృతి పరేడ్ లో భాగంగా కలెక్టర్, ఎస్పీ, ఓఎస్‌డీ బోనాల కిషన్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పోలీసు అమరవీరులకు ఘననివాళుల ర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావసరాల కోసం, సంరక్షణ కోసం ఏర్పడ్డ వ్యవస్థ, పోలీస్ శాఖ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ తో పాటు దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఇలా ప్రతి సందర్భంలోనూ పోలీసు వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. శాంతిభద్రతలు సక్రమంగా ఉంటే మారుమూల గ్రామాలకు కూడా అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 21 నుంచి 31 వరకు ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారని, ఇది అభినందనీయమని, అలాగే పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులకు జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరపున ఎలాంటి సహాయ సహకారాలైన అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో పోలీసులు చేసిన త్యాగాలను నిరంతరం స్మరించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ 21 అక్టోబర్ 1959 సంవత్సరంలో లడక్ ప్రాంతంలో హాట్ స్ప్రింగ్ వద్ద మన పోలీసులు విధులు నిర్వహిస్తుండగా చైనా ఆర్మీ మన వారిపై అక్రమంగా దాడి చేసి 10 మంది పోలీసులను హతమార్చిందన్నారు. అప్పటి నుంచి వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ క్రమం తప్పకుండా ప్రతి ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణార్థం పోలీస్ ఫ్లాగ్ దేను ఘనంగా నిర్వహిస్తోందన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించి అమరవీరులైన పోలీసుల త్యాగాలు వెల కట్టలేనివని, ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లిలో దశాబ్దాల క్రితం మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేదని, జిల్లా పరిధిలో 18 మంది పోలీసులు సంఘవిద్రోహశక్తులతో పోరాడి చిరస్మరణీయులైన విషయం గుర్తు చేశారు. అలాగే పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో ఎస్పీ సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎలాంటి అవసరాలైన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ బోనాల కిషన్, కాటారం సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్, డీఎస్పీలు సంపత్ రావు, రామ్మోహన్ రెడ్డి, నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని సీఐలు, రిజర్వు ఇన్స్పెక్టర్ లు ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



**విశ్వంభర, పరిగి:** పరిగి మున్సిపాలిటీ మూడవ వార్డు ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన ముగ్గురు వ్యక్తులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పరిగి శాసనసభ్యులు టి. రామ్మోహన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని అన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందే విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మూడో వార్డు ఇంచార్జ్ పట్టణ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఎజాజ్, యూత్ కాంగ్రెస్ పరిగి టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజ్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అనిల్ పాల్గొన్నారు.

## ఐకేపీ సెంటర్ ప్రారంభం



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట మండలం ఇమాంపేట గ్రామంలో ఐకేపీ సెంటర్ 2ను సోమవారం ఏపీఎం రణపంగ వెంకన్న, సీసీ కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ నిర్వాహకులు పుట్ట పుల్లారెడ్డి, సుదర్శన్, నకిరేకంటి నిర్మల, పల్ల నాగమణి, మాజీ సర్పంచ్ పాముల ఉపేందర్, కుంచం అంజయ్య, కొండ ఆంజనేయులు, నకిరేకంటి బాలకృష్ణ, నకిరేకంటి సతీష్, మామిడి సైదులు, పాముల కృష్ణ, వెంకట్ నర్సు, చెన్నయ్య, తదితర రైతులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల రక్షణలో పోలీసు సేవలు, త్యాగాలు గొప్పవి

- జిల్లా కలక్టర్ తేజస్ నందలాల్ పవార్
- పోలీసు త్యాగాలు గుర్తించబడినవి
- జిల్లా పోలీసుల సంస్మరణ దినోత్సవంలో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



**విశ్వంభర, సూర్యాపేట:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) అక్టోబర్ 21 పురస్కరించుకుని సోమవారం సూర్యాపేట జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్ లో పోలీసు అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ తేజష్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మా నాయక్, అధనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ అధనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, డీఎస్పీలు, జిల్లా సీఐ లు, ఆర్ఐ లు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, పౌరులు, పోలీసు సిబ్బంది పాల్గొని గౌరవ వందనం చేసి పోలీసు అమరవీరులకు నివాళులు ఘటించారు. పోలీస్ పరేడ్ కమాండర్గా ఆర్ ఐ నరసంహ వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ఎఆర్ అధనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సంవత్సర కాలంలో దేశంలో అమరులైన 214 మంది పోలీసు సిబ్బంది, జవాన్ల పేర్లను జిల్లా అధనపు ఎస్పీ నాగేశ్వరరావు స్మరిస్తూ గుర్తు చేశారు. పోలీసు కళాబృందం సభ్యులు అమరవీరుల త్యాగాలను వివరిస్తూ సాంస్కృతిక గేయాలను పాడారు. అనంతరం పోలీసు అమరవీరుల స్తూపం వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించి, పూలమాలలు పెట్టి వారి ఆత్మకు శాంతి కలగాలని నివాళులు ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజష్ నందలాల్ పవార్ మాట్లాడుతూ శాంతి భద్రతల రక్షణ, సమాజంలో శాంతి నెలకొల్పడంలో యూనిఫామ్ ఫోర్స్, పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు, జవానులు నిత్యం పనిచేస్తున్నారని ఎండ, వాన, చలి, రాత్రి, పగలు అనే తేడా లేకుండా సమాజంలో శాంతిభద్రతలు, పౌరుల రక్షణకు 24 గంటలు పని చేస్తున్నారని అన్నారు. శాంతి భద్రతలను కాపాడుతూ విధి నిర్వహణలో పోలీసు జవాన్లు అమరులవుతున్నారని అన్నారు. పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలు వెలకట్టలేనివని వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని, వారి త్యాగాలు ఏమిచ్చినా, ఏం చేసినా తీర్చలేనివని, వారి ఆశయ సాధన కోసం పౌరులు, పోలీసులు, సిబ్బంది, అధికారులు పనిచేయాలని అన్నారు. శాంతియుత సమాజ స్థాపనలో అందరూ కలిసి ముందుకు రావాలని అన్నారు. నేటి సమాజంలో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారంటే పోలీసు అమరవీరుల త్యాగఫ లమేనని అన్నారు. మంచి పని చేసినప్పుడు, త్యాగాలు చేసిన ప్పుడు సరైన గుర్తింపు ఉండ దు, ఎక్కడో చిన్న తప్పు జరిగితే వ్యవస్థ మొత్తాన్ని చెడుగా చేస్తుం టారు. ఇలాంటి పరిస్థితుల్లో పోలీసు శాఖ, పోలీసులు మనోధైర్యం కోల్పోకుండా అత్యంత అప్రమత్తంగా పని చేయాలని కలెక్టర్ కోరారు. జిల్లా ఎస్పీ శ్రీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల దినోత్సవం ఆవిర్భావం గురించి వివరించారు. లడఖ్ లోని అక్సాయిచిన వద్ద సముద్ర మట్టానికి 6 వేల అడుగుల ఎత్తులో ఉన్న భూభాగం హాట్(స్ప్రింగ్స్ ప్రాంతంలో ఎస్పీ త్యాగి, డీఎస్పీ ధరం సింగ్ ఆద్వర్యంలో సరిహద్దు ప్రాంతంలో కాపలా కాస్తున్న, 10మంది సి.ఆర్.పి. జవానుల పై 1959 అక్టోబర్ 21వ తేదిన చైనా జావానులు ఆయుదాలతో దాడులు చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న మన దేశ సైనికులు చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి అమరులయ్యారు. పూరన్సంగ్, శర్వణాదాస్, హంగ్ జిత్ సుబా, ఇమాన్ సింగ్, ధరం సింగ్, శినాథ్ ప్రసాద్, శ్చేరింగ్ నోర్బు నోర్బులామా, బేగ్జ్, మఖన్లాల్లు తమ కర్తవ్యపాలనలో జవానులు ఆనాడు అమరులయ్యారు. ఎస్పీ త్యాగి టీమ్ ను చైనా సైనికులు భందించి చిత్రహింసలకు గురి చేశారు. తమ శక్తినిమించిన పోరాటంలో ప్రాణాలు వదిలిన ఈ పది మంది పోలీసులు వీరోచిత కృత్యం దేశ ప్రజలలో విషాదంతో పాటు ఆరాధనాభావాన్ని కూడా కలిగించిందన్నారు. నాటి నుండి అక్టోబర్ 21వ తేదిని పోలీసు సంస్మరణదినం (ఫ్లాగ్ డే) గా జరుపుకుం టున్నాం అన్నారు. నేటి ప్రశాంత సమాజం పోలీసు అమరవీరుల ప్రాణాల త్యాగ ఫలితమేనని, శాంతిభద్రతలు కాపాడుటలో పోలీసు 24 గంటలు నిర్విరామంగా పనిచేస్తూ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ప్రజలకు రక్షణ కల్పిస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో, దేశంలో సంఘవిద్రోహక శక్తుల ప్రభావం తగ్గడంలో, తగ్గించడంలో పోలీసుల వీరోచిత కృషి, పోలీసుల ప్రాణ త్యాగ ఫలితమేనని ఎస్పీతెలిపారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని వారి సంక్షేమాలకు కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు.కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా పోలీసు కుటుంబ సభ్యులకు అమరవీరుల త్యాగాల గుర్తుగా జ్ఞాపకాలను బహూకరించారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మా నాయక్, అధనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ అధనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, డీఎస్పీలు రవి, శ్రీనివాస్, ఎఆర్ డీఎస్పీ నరసింహ చారి, ఏఓ మంజు భార్గవి, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ సంక్షేమ సంఘం సబ్యులు వెంకన్న, సీఐ లు వీరరాఘవులు, రాజశేఖర్, సురేంధర్ రెడ్డి, శ్రీను, రఘువీర్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, రజిత రెడ్డి, రాము, లక్ష్మినారాయణ, శివకుమార్, ఆర్ఐలు నారాయణరాజు, నరసింహ, ఎస్ఐ, ఆర్ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఖిల్లా మైసమ్మ దేవాలయ ఛైర్మన్‌గా కుంచారపు సురేష్



**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ లోని 400 ఏళ్ళ సంవత్సరాల ప్రాచీన చరిత్ర కలిగిన ఎంతో ప్రాముఖ్యత, ప్రాధాన్యత కలిగిన ఖిల్లా మైసమ్మ అమ్మ వారి దేవాలయ ఛైర్మన్‌గా కుంచారపు సురేష్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ గుప్త, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ ఈవో మురళీ కృష్ణ వారిచే ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. అనంతరం కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక నిధులు అందజేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నూతన పాలకవర్గం సభ్యులు సమన్వయంతో పనిచేసి దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. సురేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్, బండి మధు, తలాటి రమేష్, భూపాల్ రెడ్డి, ధనరాజ్, కిరణ్, గట్ల రవీంద్ర, ముప్పిడి లింగ స్వామి గౌడ్, శేఖర్ ముదిరాజ్, జ్ఞానేశ్వర్ యాదవ్, యాదవ రెడ్డి, ఎస్ కే మహమూద్,సుజాత, హరి పురి కాలనీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు తాడేపల్లి వెంకటేశం గుప్తా, సూరి, చందు, పెద్ద పూర సైదులు,కళ్యాణ్‌యాదవ్,నభి, శ్రీనివాస్ గుప్త, ఎల్లన్న, కవిత, అరుణ, లావణ్య, లక్ష్మి పాల్గొన్నారు.

## చింతపల్లిలో బీజేపీ నమో స్టాల్ ప్రారంభం



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల కేంద్రంలో బీజేపీ నమో స్టాల్ ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతావత్ లాలు నాయక్ ప్రారంభించారు. నరేంద్ర మోడీకి మద్దతుగా భారతీయ జనతా పార్టీలో చేరాలనుకునే వారికి ప్రతి మండల కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో నమోస్టాల్ పేరుతో సభ్యత్వ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కేవలం మూడు రోజులు మాత్రమే సమయం ఉన్నది కాబట్టి సభ్యత్వ నమోదు ప్రక్రియ మండలంలో వేగవంతం చేసి దేవరకొండ నియోజకవర్గంలోని చింతపల్లి మండలంలో అత్యధిక సభ్యత్వ నమోదు చేయాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ మండల అధ్యక్షులు శివర్ల రమేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు వనం నరేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి వెన్నం శేఖర్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కుంభం శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు కనిగిరి గోవర్ధన్, బీజేవైఎం మండల అధ్యక్షులు కుందేళ్ళ శ్రీశైలం, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గజ్జ అభినవ్, బూతు అధ్యక్షులు వెంకటరమణ, రవి, పాలకూర రాజు, గడ్డి మహేందర్, మేకల నరసింహ పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీశ్‌పై ఫిర్యాదు

### సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపణ



**విశ్వంభర, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి హరీశ్‌రావు పై బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. హరీశ్‌రావు పై బేగంబజార్ పోలీస్ స్టేషన్ లో తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ సాయికుమార్ ఫిర్యాదు చేశారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మెట్టు సాయి మాట్లాడుతూ హరీశ్ రావు నోరు అదుపులో పెట్టుకోకపోతే తెలంగాణలో తిరగనీయమని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీకి సభ్యత సంస్కారం అన్ని తెలుసు కాబట్టి, తాము నోటిని అదుపులో పెట్టుకుంటున్నామన్నారు.

## కాలనీల అభివృద్ధి మా ధ్యేయం : కౌన్సిలర్ అనుపమ



**విశ్వంభర,పెద్దఅంబర్‌పేట్:** మున్సిపాలిటీ కుంట్లూర్‌లోనీ 24వ వార్డ్ గణేష్ నగర్‌లో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను వార్డ్ కౌన్సిలర్ కందాడ అనుపమ సుప్రసేనారెడ్డి తో కల్సి మున్సిపల్ ఛైర్ పర్సన్ పండగల జయశ్రీ రాజు ప్రారంభించారు. ఛైర్పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ లోనీ అన్నీ వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ్ శేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు గ్యారల శ్రీనివాస్ గౌడ్, చెవుల హరి శంకర్ ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, డిఈ శివానందం, ఫీల్డ్ ఆఫీసర్ అశోక్ కాలనీవాసులు, నరసింహారెడ్డి, శేఖర్ పగిళ్ల, గోషిక సంతోష్, అనిల్ కుమార్, సత్యనారాయణ, అరుణ్ యాదవ్, అనసూయ, మహేశ్వరి, శైలజ, అంజి, భిక్షపతి పాల్గొన్నారు. 37

## రక్తదాతలు ప్రాణదాతలతో సమానం


### కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే



**విశ్వంభర, భూపాలపల్లి:** రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా ఆర్మ్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం (పోలీసు ఫ్లాగ్ డే) పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సహాకారంతో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా కలెక్టర్, ఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే రక్తదానం చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో లేకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. అలాగే ప్రజలకు అన్ని వేళలా తోడుగా ఉంటూ పోలీసులు తమ ఉద్యోగాలు చేస్తున్నారని, పోలీసు వృత్తి అనేక వత్తిళ్లతో కూడుకున్నదని, పోలీసులు తమ వృత్తి ధర్మం కోసం తమ కుటుంబాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్నారని కొనియాడారు. కొందరు పోలీసులు తమ కర్తవ్య నిర్వహణలో తమ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ అమరవీరుల త్యాగానికి గుర్తుగా రక్తదాన శిబిర కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న ఓ ప్రాణాన్ని కాపాడవచ్చునని తెలియజేశారు. ప్రతి వ్యక్తి రక్తదానం చేసే గుణాన్ని ఏర్పరచుకోవాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ఎస్పీ కిరణ్ ఖరే సర్టిఫికెట్లను అందజేశారు. ఈ రక్తదాన శిబిరంలో 150 యువత, పోలీసులు, వివిధ వర్గాల ప్రజలు రక్తదానం చేశారు. ఓఎస్డీ బోనాల కిషన్, కాటారం సబ్‌కలెక్టర్ మాయాంక్ సింగ్, డీఎస్పీలు సంపత్ రావు, రామ్మోహన్ రెడ్డి, నారాయణ నాయక్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు డాక్టర్ కిరణ్, జిల్లా పరిధిలోని సీఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఎస్సైలు, ప్రజలు, యువత పాల్గొన్నారు. 32

## జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులను అరికట్టాలి

### ఏడీజీపీకి టీడబ్ల్యూజేఎఫ్ నేతల విజ్ఞప్తి



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను, అక్రమ కేసుల బనాయింపును వెంటనే అరికట్టాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఏడీజీపీ) మహేష్ భగవత్ ను కోరారు. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, పిల్లి రాంచందర్, బండి విజయ్ కుమార్, రఘు, కార్యదర్శులు రాజశేఖర్, నవీన్, ఎస్ కే సలీమా, బిక్షపతి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రమాదేవి తదితరులు హైదరాబాదులో ఏడీజీపీని కలిసి వినతి పత్రం సమర్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తమ యూనియన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడైన జర్నలిస్టు మహ్మద్ యూసుఫ్ పై చందుర్తి పోలీసులు అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారని ఆరోపించారు. అతనికి సంబంధం లేని ఒక కేసులో ఆయనను ఇరికించారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి అక్రమ కేసు బనాయించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టు యూసుఫ్ పై పెట్టిన కేసును ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో జర్నలిస్టు సుదర్శన్ పై దుండగులు దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారని, సుదర్శన్ పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రంలో చాలా చోట్ల జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయని, మరోవైపు కొందరు పోలీసు అధికారులు కక్ష్యపూరితంగా అక్రమ కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని వారు కోరారు.

## స్నిగ్ధం దీక్షిత్ యాదవ్‌కు ఆర్థిక సహాయం



**విశ్వంభర, హైదరాబాద్:** ఆర్‌టీసీ క్రాస్ రోడ్, చిక్కడపల్లి లోని అరోరా డిగ్రీ కళాశాల బీకాం కంప్యూటర్స్ సెకండ్ ఇయర్ చదువుతున్న స్నిగ్ధం దీక్షిత్ యాదవ్‌కు 15,000/- రూపాయలను మణిదీప్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హైదరాబాద్ జిల్లా శాఖ యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్ మణిదీప్ లు ఆర్థిక సహాయం అందజేశారు. దీక్షిత్ యాదవ్ ఆర్థిక ఇబ్బందుల వలన కళాశాలలో ఫీజు చెల్లించలేని పరిస్థితిలో మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి నేను వున్నా అని మంచి మనస్సుతో సహాయం అందించిన మణిదీప్‌కి కృతజ్ఞతలు తెలిపారు. పేద విద్యార్థులను ఆర్థికంగా ఆదుకున్న మీకు ఎప్పుడు మంచి జరగాలని భగవంతుడుని కొరుకుంటున్నాను అని దీక్షిత్ తెలిపారు.

## అయోడిన్‌పై అవగాహన



**విశ్వంభర, మహబూబాబాద్:** ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని వికాస్ జూనియర్ కాలేజీ నందు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్. గుండాల మురళీధర్ మాట్లాడుతూ అయోడిన్ కలిగిన ఉప్పును మాత్రమే వంటల్లో ఉపయోగించేలా ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కలిగించాలని, అయోడిన్ లోపం వల్ల వచ్చే వివిధ రకాల ఆరోగ్య సమస్యలను వివరించాలని పేర్కొన్నారు. అయోడైజ్డ్ ఉప్పు వాడకం వల్ల సరియైన పెరుగుదల, చురుకుతనం, మంచి శారీరక మానసిక ఆరోగ్యం, జ్ఞాపకశక్తి ఉంటుందని అయోడిన్ లోపం వల్ల గర్భ స్రావం, మృత శిశు జననం, మరుగుజ్జుతనం, బుద్ధి మాంద్యత, గాయిటర్ (గొంతు వాపు) ఉంటుదన్నారు. ప్రజలు ప్రతి రోజు ఉప్పు వాడకాన్ని 5 గ్రాములకే పరిమితం చేయాలని సూచించారు. తెలంగాణలో గాయిటర్ ప్రివలెన్స్ రేటు 8.7% ఉందన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది అయోడిన్ టెస్ట్ కిట్స్ ద్వారా దుకాణాలు, గృహ సందర్శన సమయంలో వారు వాడుతున్న ఉప్పును పరీక్షించడం జరుగుతుందన్నారు. వారం రోజుల పాటు ఆరోగ్య సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉప్పును మూత వున్న డబ్బాలలో నిల్వ ఉంచుకోవాలని, సాధారణంగా వంటలు వండి అయిపోయి పొయ్యి నుండి దించిన తరువాత ఉప్పును వేయాలని, ఊరగాయలు, పచ్చళ్ళు, అప్పడాలలో కూడా అయోడిన్ ఉప్పునే వాడాలని తెలిపారు. ఎన్ సీ డీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగేశ్వర్ రావు, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్, వీరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ లు రాజు, గీత, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## పాల బిల్లులను సకాలంలో చెల్లించండి



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ విజయ పాలశీతలీకరణ కేంద్ర ఆవరణలో రెండు సంవత్సరాల క్రితం నిర్మాణం పూర్తి చేసుకున్న షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలను వెంటనే వ్యాపారస్తులకు కేటాయించాలని మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ సోమవారం నాడు తెలంగాణ డైరీ అభివృద్ధి సహకార సమైక్య ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ 2022 సంవత్సరంలో 46 లక్షల వ్యయంతో మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ సహకారంతో దుకాణ సముదాయ నిర్మాణం పూర్తికాగా ఇప్పటికీ వ్యాపారస్తులకు కేటాయించకపోవడంతో డైరీ సంస్థ 25 నుంచి 30 లక్షల రూపాయలు నెలవారి కిరాయి రూపంలో నష్టపోయిందని ఛైర్మన్ కు తెలిపారు. వెంటనే షాపింగ్ కాంప్లెక్స్ ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రైతులకు పాల బిల్లులు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బిల్లులు పొందడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పడుతుండడంతో దాణ, పశుగ్రాసం కొనుగోలుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తద్వారా రైతులు అప్పులు చేయవలసి వస్తుందని తెలిపారు. రైతులకు సరైన సమయంలో పాల బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ కొండ తండ మాజీ ఉపసర్పంచ్ ప్రశాంత్ నాయక్, చెన్న వెంకటేష్ పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తల డైరీ ఆవిష్కరణ

**విశ్వంభర, భూపాలపల్లి:** పొరపాట్లకు తావులేకుండా ప్రజల సమగ్ర సమాచారం నమోదు చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆశా కార్యకర్తలను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో కుటుంబ సంక్షేమ శాఖ రూపొందించిన ఆశా కార్యకర్తల దిన చర్యల రికార్డు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్తకు ఈ రికార్డ్ అందిస్తామని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నమోదులు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఎలాంటి తప్పులకు తావు లేకుండా వ్యక్తుల సమగ్ర సమాచారం నమోదు చేయాలని సూచిం చారు. ఈ పుస్తకంలో ఆశా కార్యకర్తలకు ప్రతిరోజు చేసే పనులను సులభతరం చేస్తుం దని, సమగ్రమైన మార్గదర్శకాలను అంది స్తుందని అన్నారు. ఈపుస్తకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్యసేవల పరిపాలన మరింత సమర్థవంతంగా నిర్వహించబ డుతుందని స్పష్టం చేశారు. ఆశాకార్యకర్తలు రోజువారి నమోదులు చేయాలని సూచిం చారు. వైద్యాధికారులు నమోదులు తనిఖీ చేస్తూ ఉండాలని ఆదేశించారు. ప్రతి వ్యక్తి యొక్క ఆరోగ్య కార్యక్రమాల వివరాలు నమో దు చేయడం వల్ల వైద్య సేవలు సులభంగా అందించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. తద్వారా ఎప్పటికప్పుడు నాణ్యమైన సేవల అందించడానికి రికార్డు ఉపయోగ పడుతుందని తెలిపారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్యా ధికారి డా మధుసూదన్, ఆర్డీఓ మంగిలాల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారత్ లౌకిక దేశంగా ఉండాలనుకోవడంలేదా?

## పిటిషనర్‌కు సుప్రీం ప్రశ్న



**ఢిల్లీ:** సోషలిస్ట్ (సామ్యవాద), సెక్యులర్ (లౌకిక) పదాలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలోనే కీలకమైనవని ఇప్పటికే ఎన్నో తీర్పులు నొక్కిచెప్పాయని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యాంగ పీఠిక నుంచి ఈ పదాలను తొలగించాలని కోరుతూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి తదితరులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై నేడు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్, న్యాయవాది విష్ణు శంకర్ జైన్ తన వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగానికి 1976లో చేపట్టిన 42వ సవరణపై పార్లమెంట్‌లో చర్చ జరగలేదన్నారు. దీనిపై జస్టిస్ ఖన్నా స్పందిస్తూ.. ఈ పదాలకు వివిధ వివరణలున్నాయని.. వేర్వేరుగా అన్వయించుకుంటున్నారని పేర్కొన్నారు. అదే సమయంలో కోర్టులు పలుమార్లు ఇవి రాజ్యాంగంలోని ప్రాథమిక భాగాలుగా అభివర్ణించినట్లు వెల్లడించారు.

"సోషలిజం అంటే.. అందరికీ సమాన అవకాశాలు ఉండాలని. సమానత్వం అనే అంశాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. మీరు దీనిని మరో రకంగా చూడకూడదు. అప్పుడు వేరే అర్థం కూడా వస్తుంది. ఇక సెక్యులర్ అనే పదం కూడా అంతే" అని ఖన్నా వ్యాఖ్యానించారు. మరో న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ తన వాదనలు వినిపిస్తూ.. ఈ సవరణ అమల్లోకి వచ్చేనాటికి అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించిన విషయాన్ని గుర్తు చేశారు. దీనిపై న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా స్పందిస్తూ "మీరు భారత్ లౌకిక దేశంగా ఉండాలనుకోవడంలేదా..?" అని సూటిగా ప్రశ్నించారు. దీనిపై అడ్వకేట్ జైన్ బదులిస్తూ "భారత్ లౌకిక దేశంగా ఉండకూడదని మేము అనడంలేదు.

ఆ సవరణను మాత్రమే సవాలు చేశాం" అని పేర్కొన్నారు. పీఠికలో ఈ రెండు పదాలు చేర్చడం వల్ల పాండోరా బాక్స్‌ను తెరిచినట్లైందని అభిప్రా యపడ్డారు. భవిష్యత్తులో ప్రజాస్వామ్యం అనే పదాన్ని కూడా తొలగించవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఇక భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి తన వాదనలు వినిపిస్తూ.. పీఠికలో 26 నవంబర్ 1949 తేదీ ఉండటం తప్పని నిరూపిస్తానని పేర్కొన్నారు. " మనకు రాజ్యాంగ పీఠిక రెండు భాగాలుగా ఉండొచ్చు. కానీ, సెక్యులరిజం, సోషలిజం పదాలు చేర్చడానికి భారత ప్రజలు అంగీకరించారని చెప్పడం సరికాదు. పీఠిక రెండు భాగాల్లో ఒక దానిని తేదీతో, మరో దానికి డేట్ లేకుండా ఉంచవచ్చు" అని పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ ఖన్నా స్పందిస్తూ.. పిటిషనర్లు సంబంధిత పత్రాలను సమర్పిస్తే పరిశీలిస్తామని చెప్పారు. నోటీసులు జారీ చేయడానికి మాత్రం బెంచ్ అంగీకరించలేదు. తదుపరి వాదనలను నవంబర్ 18వ తేదీన వింటామని న్యాయమూర్తులు పేర్కొన్నారు.

### మదార్సాల విషయంలో ఎన్సీపీసీఆర్ సిఫార్సులపై సుప్రీం స్టే

**ఢిల్లీ:** గుర్తింపు లేని మదర్సాల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు తరలించాలని, మదర్సా బోర్డులకు రాష్ట్రాలు నిధులు ఇవ్వొద్దని రాష్ట్రాలను కోరుతూ బాలల హక్కుల సంఘం చేసిన సిఫార్సులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. మదార్సాల్లో విద్యాహక్కు చట్టాన్ని పాటించట్లేదని, అక్కడ బోధించే విద్య.. విద్యార్థులకు ఎందుకూ పనికిరాదని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ( ఎన్సీపీసీఆర్) ఇప్పటికే సుప్రీంకోర్టుకు తెలిపింది. కాగా ఈ ఏడాది జూన్ 7, జూన్ 25 తేదీల్లో గుర్తింపు లేని మదర్సాల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు తరలించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించడంతో ఉత్తరప్రదేశ్, త్రిపుర ప్రభుత్వాలు వీటిని అమలు చేయడానికి ఆదేశాలు జారీ చేశాయి. దాంతో ఈ ప్రభుత్వాల చర్యలను వ్యతిరేకిస్తూ ముస్లిం సంస్థ జమియాత్ ఉలేమా-ఇ-హింద్ సుప్రీంలో పిటిషన్ వేసింది. ఈ రాష్ట్రాలు ఇచ్చిన ఉత్తర్వులపై కూడా సుప్రీం స్టే విధించింది.

## కశ్మీర్ ఎన్నటికీ పాకిస్థాన్‌లో భాగం కాదు

### ఎన్సీపీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా



**శ్రీనగర్:** కశ్మీర్ ఎప్పటికీ పాకిస్థాన్‌లో భాగం కాదని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదాన్ని భారత్‌లోకి ఎగదోయడాన్ని పాక్ ఇప్పటికైనా ఆపివేయాలని హితవు పలికారు. న్యూఢిల్లీతో సత్సంబంధాలు ఏర్పరుచుకోవాలంటే పాకిస్థాన్ ఉగ్రచర్యలకు స్వస్తి పలకాలని సూచించారు. "కశ్మీర్ ఎప్పటికీ పాకిస్థాన్‌లో భాగం కాదు. ఇక్కడి ప్రజలు తమ జీవితాలను గౌరవంగా జీవించాలనుకుంటున్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేసే సమయం వచ్చిం ది. భారత్ హెచ్చరికలను పాకిస్థాన్ పెడచెవిన పెడితే.. ఫలితాలు చాలా తీవ్రంగా ఉంటాయి" అని ఫరూక్ అబ్దుల్లా దాయాది దేశాన్ని హెచ్చరించారు. గాందర్‌బల్ జిల్లాలోని గుండ్ వద్ద శ్రీనగర్ - లేహ్ జాతీయ రహదారిలో సొరంగ నిర్మాణపనులు చేస్తున్న కార్మికులు, సిబ్బంది ఆదివారం పనులు ముగించుకొని తమ ఇళ్లకు వచ్చిన సమయంలో ఇద్దరు ఉగ్రవాదులు వారిపై కాల్పులకు తెగబడ్డారు. కాల్పుల్లో ఓ వైద్యుడు, ఆరుగురు కార్మికులు మృతిచెందగా, మరో అయిదుగురు గాయపడ్డారు. దీంతో పోలీసు బలగాలు, సైనిక దళాలు ముష్కరుల గాలింపునకు చర్యలు చేపట్టాయి.

## పిలవకపోయినా విజయ్ ర్యాలీకి వెళ్తా

### విశాల్ ఆసక్తికర వ్యాఖ్యలు



**చెన్నై:** 'తమిళగ వెట్రి కళగం పార్టీతో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తమిళ నటుడు విజయ్ వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే త్వరలోనే తొలిసారి బహిరంగ సమావేశం నిర్వహించనున్నారు. ఈ ర్యాలీ గురించి తాజాగా మరో నటుడు విశాల్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విజయ్ సభపై తాను ఆసక్తిగా ఉన్నానని, పిలవకపోయినా తాను అక్కడికి వెళ్తానని అన్నారు. చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న విశాల్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా 'విజయ్ పొలిటికల్ ర్యాలీకి హాజరవుతున్నారా?' అంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. "నాకు ఓటు హక్కు ఉంది. విజయ్ తన తొలి ప్రసంగంలో ఎలాంటి హామీలు ఇస్తారనేది ఒక ఓటరుగా తెలుసుకోవాలనుకుంటున్నా. ప్రస్తుతమున్న రాజకీయ నాయకుల కంటే భిన్నంగా విజయ్ ఆలోచ నలు ఎలా ఉన్నాయో చూడాలనుకుంటున్నా. దీనికి నాకు ఆహ్వానం అవసరం లేదు. టీవీలో చూడటం కంటే సభకు వెళ్లి సాధారణ ప్రజల మధ్య ఒకడిగా నిలబడి తెలుసుకుంటేనే ఇంకా బాగుంటుందనేది నా అభిప్రాయం" అని విశాల్ చెప్పారు. ఈ సందర్భంగా విజయ్ టీవీకే పార్టీలో తాను చేరినట్లు వస్తున్న ఊహాగానాలను విశాల్ కొట్టిపారేశారు. "ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన అవ సరం లేదు. ముందు విజయ్‌ని తన తొలి సభను విజయవంతంగా నిర్వహించనివ్వండి. ఆయన మేనిఫెస్టో ఎలా ఉందో తెలుసుకుందాం. దానికి (పార్టీలో చేరడానికి) ఇంకా సమయం ఉంది" అని తెలిపారు. విల్లుపురంలోని విక్రవండిలో అక్టోబర్ 27న టీవీకే రాష్ట్రస్థాయిలో తొలిసారిగా బహిరంగ సమావేశం ఏర్పాటుకు సిద్ధమైంది. ఇందుకోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశిస్తూ ఓ లేఖ విడుదలచేసిన విజయ్.. 'కర్త వ్యం, గౌరవం, క్రమశిక్షణ' అనే సూత్రాన్ని పాటించాలని సూచించారు. రాజకీయాల్లో గెలుపు, ఓటమి మాత్రమే కొలమానాలు కాదని, సిద్ధాంతాలకు కట్టుబడి ఉండటం ఎంతో ముఖ్యమన్నారు.

## నవంబరు 1-19 మధ్య ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దు: పన్నూ వార్నింగ్



**ఢిల్లీ:** దేశంలో గత కొన్ని రోజులుగా విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాల వేళ ఖలిస్థానీ వేర్పాటువాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూ 'ఎయిర్ ఇండియా'కు హెచ్చరికలు చేయడం తీవ్ర కలకలం రేపింది. నవంబరు 1 నుంచి 19వ తేదీల మధ్యలో ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దని అతడు వార్నింగ్ ఇవ్వడం గమనార్హం. భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఎయిర్ ఇండియా విమానాలపై దాడి జరిగే అవకాశం ఉందని పన్నూ అన్నాడు. అందులో ఆయా తేదీల్లో ఆ సంస్థ విమానాల్లో ప్రయాణించొద్దంటూ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నాడు. కాగా.. పన్నూ ఇలాంటి హెచ్చరికలు చేయడం ఇది తొలిసారి కాదు. గత నవంబరులోనూ ఇలాంటి వీడియో విడుదల చేశాడు. నవంబరు 19న ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఆ రోజు మూతపడుతుందని, దాని పేరు కూడా మార్చేస్తామని గతేడాది అతడు ఓ వీడియోలో హెచ్చరించాడు. సిఖ్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటువాద సంస్థను 2007లో స్థాపించగా.. వ్యవస్థాపకుల్లో గురుపత్వంత్ సింగ్ పన్నూ కూడా ఒకడు. ఈ సంస్థను భారత్ 2019లోనే నిషేధించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం కింద భారత ప్రభుత్వం అతడిని 2020లో ఉగ్రవాదిగా ప్రకటించింది. ప్రస్తుతం అతడు అమెరికాలో ఉన్నట్లు సమాచారం. పన్నూకు అగ్రరాజ్యంతో పాటు కెనడా పౌరసత్వం కూడా ఉంది.

## ఢిల్లీలో దారుణంగా పడిపోయిన గాలి నాణ్యత

**ఢిల్లీ:** దేశ రాజధాని నగరం ఢిల్లీలో గాలి నాణ్యత దారుణంగా పడిపోతున్నది. సోమవారం ఉదయానికి ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 349కి పడిపోయింది. దాంతో కాలుష్య నియంత్రణ మండలి ఈ పరిస్థితిని 'వెరీ పూర్ ' కేటగిరిగా వర్గీకరించింది. వాయు కాలుష్యం కారణంగా నగరంపై దట్టంగా పొగ మంచు కమ్మి ఉంటోంది. దాంతో ఉదయం పూట వాహనదారులు రోడ్లపై విజిబిలిటీ సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి నాణ్యతలు క్షీణించడంతో ఢిల్లీ వాసులు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధ సమస్యలు తీవ్రంగా పెరిగాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఢిల్లీ ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే బాణాసంచా వినియోగం, తయారీపై ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ప్రతి ఏడాది శీతాకాలంలో చల్లదనం కారణంగా ఢిల్లీలో గాలి నాణ్యత దెబ్బతింటున్నా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం లభించడంలేదు.


## బ్రెజిల్ అధ్యక్షుడి తలకు గాయం

### బ్రిక్స్ సదస్సుకు వర్చువల్‌గా హాజరుకానున్న లూయిజ్



బెజిల్: బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా తలకు గాయం కావడంతో బ్రిక్స్ సదస్సుకు వర్చువల్‌గా హాజరుకానున్నారు. శనివా రం రాత్రి బాత్రూంలో జారిపడటంతో ఆయన తలకు గాయం అయ్యిందని అధికారులు తెలిపారు. వైద్యుల సూచన మేరకు రష్యాలో జరగనున్న బ్రిక్స్ సదస్సు కార్యక్రమానికి ఆయన నేరుగా హాజరు కాలేకపోతున్నారని..వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతారని బ్రెజిల్ అధికారిక కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. మాస్కో అధ్యక్ష తన రష్యాలోని కజన్ వేదికగా ఈ నెల 22 నుంచి 24 వరకు 16వ బ్రిక్స్(బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా బ్రిక్స్ సభ్య దేశాల అధినేతలతో భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు నిర్వహిస్తారు. మోదీ రష్యా పర్యటన చేపట్టడం ఈ ఏడాదిలో ఇది రెండో సారి.

## కంబాలా రేస్‌ను ఆపండి కర్నాటక హైకోర్టును కోరిన పెటా



**బెంగళూరు:** కర్నాటకలో జరిగే కంబాలా రేసింగ్ పోటీలను నిలిపివేయాలని కోరుతూ రాష్ట్ర హైకోర్టును పెటా ఆశ్ర యించింది. అక్టోబర్ 25వ తేదీన బెంగుళూరులో ఈ ఈవెంట్ జరగాల్సి ఉన్నది. ఆరేస్‌ను ఆపేయాలని పిల్ వేశారు. జస్టిస్ ఎన్వీ అంజారియా, జస్టిస్ కేవీ అరవింద్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పిల్ తరపున సీనియర్ న్యాయవాది ధ్యాన్ చిన్నప్ప వాదించారు. దక్షిణ కన్నడ జిల్లాల్లో కంబాలా దున్నపోతల ఈవెంట్‌ను ఆర్గనైజ్ చేయడం అక్కడి సాంప్రదాయం. ఆ ఈవెంట్‌ను నిర్వహించేందుకు బెంగుళూరుకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చెందిన దున్నలను తీసుకువస్తారని చిన్నప్ప తన పిటీషన్‌లో వాదించారు. ఈ వెంట్‌ను నిర్వహించడమంటే.. జంతువుల్ని క్రూరంగా హింసించడమే అవుతుందని చిన్నప్ప కోర్టుకు తెలిపారు. ఈ ఏడాది జూలైలోనే పిల్ వేశామని, కానీ తమ కేసు లిస్టింగ్ కాలేదని పెటా తెలిపింది. జల్లికట్టు, కంబాలా లాంటి రేసులను నిర్వహించుకునేందుకు గత మే నెలలో సుప్రీంకోర్టు క్లియరెన్స్ ఇచ్చిన విషయం తెలిసిందే.

## ఉగ్రవాదంపై యుద్ధం ఇంకా ముగియలేదు: అమిత్ షా



**ఢిల్లీ:** దేశంలో ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఢిల్లీలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కార్యకలాపాలను అణచివేయడానికి భారత బలగాలు గత పదేళ్లుగా శాయశక్తులా కృషి చేస్తున్నాయని.. అయినప్పటికీ ఉగ్రవాదంపై యుద్ధం ఇంకా ముగియలేదన్నారు. డ్రగ్స్, భారత వ్యతిరేక చర్యలు, ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టడానికి ఎన్డీఏ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశాన్ని రక్షించడానికి 36,468 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని.. వారి త్యాగాల వల్లే దేశం సురక్షితంగా ఉందని అమిత్ షా అన్నారు. గత ఏడాది కాలంలో దాదాపు 216 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. వీరి త్యాగాలను దేశం ఎప్పటికీ మరిచిపోదన్నారు. "మా పదేళ్ల పాలనలో జమ్ము కశ్మీర్, వామపక్ష అతివాద ప్రభావిత ప్రాంతాల్లో శాంతి నెలకొంది. అయినా మా పోరాటాన్ని ఆపం. కశ్మీర్‌లో మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, మతపరమైన ఉద్రిక్తతలను సృష్టించే కుట్రలు, చొరబాట్లకు పాల్పడుతున్న ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటాము" అని షా అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు అమిత్ షా నివాళులర్పించారు. 1959లో లడఖ్‌లో చైనా సైనికులు జరిపిన ఆకస్మిక దాడిలో మరణించిన పోలీసులు, ఇతర అధికారుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## సీఆర్పీఎఫ్ పాఠశాల వద్ద పేలుడు వెనుక ఖలిస్థానీ గ్రూప్ హస్తం..!




**ఢిల్లీ:** ఢిల్లీలోని రోహిణి ప్రశాంత్ విహార్ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ పాఠశాల వద్ద పేలుడుకు 'జస్టిస్ లీగ్ ఇండియా' అనే ఖలిస్థానీ అనుకూల గ్రూపు బాధ్యతను తీసుకొంది. దీనికి సంబంధించిన మెసేజ్‌లు కొన్ని టెలిగ్రామ్ గ్రూపుల్లో ప్రత్యక్షమైనట్లు ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. ఈ గ్రూపులకు సంబంధించిన సమాచారం ఇవ్వాలని టెలిగ్రామ్‌కు ఇప్పటికే అధికారులు లేఖలు రాశారు. ఖలిస్థానీ వేర్పాటువాదులను మట్టుబెట్టడానికి ప్రతీకారంగా దుండగులు ఈ చర్యను చేపట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ పేలుడు క్లిప్‌తోపాటు "కొందరు గూండాలతో భారత నిఘా ఏజెన్సీ మా సభ్యుల నోరుమూయించాలని చూస్తే.. ప్రపంచంలో వారే మూరు?లు. మేము వారికి ఎంత దగ్గరగా ఉన్నామో ఏమాత్రం ఊహించలేరు. ఏక్షణమైనా దాడి చేయగల సత్తా మాదగ్గర ఉంది. ఖలిస్థాన్ జిందాబాద్" అనే సందేశాన్ని టెలిగ్రామ్‌లో పోస్టు చేశారు. పోలీసుల దర్యాప్తులో మాత్రం ఎటువంటి ఆర్గనైజేషన్ గ్రూప్ పేరు వెల్లడికాలేదు. ఇక పోలీసు వర్గాల అంచనాల ప్రకారం.. అది తక్కువ శక్తి ఉన్న ఐఈడీగా భావిస్తున్నారు. రిమోట్ కంట్రోల్, టైమర్ వంటివి వాడి పేలుడుకు పాల్పడి ఉండొచ్చనే అంచనాలున్నాయి. ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేయడానికే ఈ పనిచేసినట్లు భావిస్తున్నారు.

### అనుమానితుడి గుర్తింపు

అధికారులు సమీపంలోని సీసీటీవీ దృశ్యాలను విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే తెల్ల టీషర్ట్ ధరించిన ఓ అనుమానితుడిని గుర్తించారు. పేలుడు జరగడానికి ముందు రోజు రాత్రి ఆ ప్రదేశంలో అతడు ఏదో చేస్తున్నట్లు ఆ దృశ్యాల్లో ఉంది. పేలుడు పదార్థాలను ఒక పాలిథిన్ బ్యాగ్‌లో చుట్టి అక్కడ అడుగు గోతిలో అమర్చి.. ఆ పై చెత్తతో కప్పి ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. ఆదివారం ఉదయం 7:50 గంటలకు జరిగిన ఈ పేలుడులో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. దాడి తీవ్రతకు ఆ ప్రాంతంలో దట్టమైన పొగ వ్యాపించిందని, పాఠశాల గోడ కూలి పోవడంతోపాటు సమీపంలో ఉన్న దుకాణాలు, కార్లు దెబ్బతిన్నాయని ప్రత్యక్ష సాక్షులు వెల్లడిం చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఆ తర్వాత ఫోరెన్సిక్ బృందాలు, క్రైమ్, బాంబు స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. పాఠశాల సమీపంలోని మట్టి, అక్కడ గుర్తించిన తెల్లని పౌడర్ నమూనాలనూ ల్యాబ్‌కు పంపించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఢిల్లీ నగరంలో హై అలర్ట్ ప్రకటించారు.

## 'నువ్వు మాకు రాజు కాదు'.. ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో బ్రిటన్ రాజుకు షాక్..!



స్వీడన్: బ్రిటన్ రాజు కింగ్ ఛార్లెస్-3కు ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో షాక్ ఎదురైంది. ఆ దేశానికి అధికారికంగా పాలకుడైన ఆయన సోమవారం పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడటం పూర్తయినవెంటనే స్థానిక ఆదివాసీ సెనెటర్ లిడియా థోర్పే రాచరికానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. "మా భూమిని తిరిగి ఇచ్చేయండి. మా నుంచి దోచుకొన్నవి మొత్తం వాపస్ ఇవ్వండి. ఇది మీ భూమి కాదు.. మీరు మా రాజూ కాదు. ఆస్ట్రేలియా ఆదివాసీలపై ఐరోపా వలసదారులు నరమేధానికి పాల్పడ్డారు" అని ఆమె దాదాపు నిమిషం పాటు పెద్దపెద్దగా కేకలు వేశారు. వలస విధానాన్ని థోర్పే ఎప్పుడూ వ్యతిరేకిస్తారని పేరుంది. 2022లో థోర్పే ప్రమాణ స్వీకార సమయంలో కూడా వలస రాజ్యపాలకురాలంటూ క్వీన్ ఎలిజిబెత్-2ను అభివర్ణిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో నాటి ఛాంబర్ ప్రెసిడెంట్ సు లిన్స్ ఆమెను ఉద్దేశించి "సెనెటర్ థోర్పే..మీరు ప్రమాణస్వీకారం కార్డులో ప్రచురించిన అంశాన్ని మాత్రమే చదవాలి" అని సరిచేశారు. ఆస్ట్రేలియా రాణి హోదా నుంచి క్వీన్ ఎలిజిబెత్-2ను తప్పించి.. పార్లమెంట్ సభ్యులు ఎన్నుకొన్నవారిని నియమించేలా 1999లో ఓటింగ్ జరిగింది. నాడు స్వల్ప మెజార్టీతో ఈ తీర్మానం వీగిపోయింది. మరోవైపు దేశంలో ఆదివాసీ కన్సల్టేటివ్ అసెంబ్లీ ఏర్పాటుకు తీర్మానాన్ని కూడా 2023లో పార్లమెంట్ భారీ మెజార్టీతో తిరస్కరించింది. ఆస్ట్రేలియా దాదాపు 100 ఏళ్లకు పైగా బ్రిటన్ వలస రాజ్యంగా ఉంది. ఈ సమయంలో వేలమంది ఆదివాసీ ఆస్ట్రేలియన్లు హత్యలకు గురయ్యారు. ఆ తర్వాత 1901లో ఆ దేశం అప్రకటిత స్వాతంత్ర్యం సాధించింది. కానీ, పూర్తిస్థాయి రిపబ్లిక్‌గా ఏర్పడలేదు. ప్రస్తుతం దానికి కింగ్‌ఛార్లెస్-2 రాజుగా వ్యవహరిస్తున్నారు. ఆయన తాజాగా ఆస్ట్రేలియా, సమవో దేశాల్లో తొమ్మిది రోజుల పర్యటన మొదలుపెట్టారు.

# ఏ ప్రగతి జరగాలన్నా పోలీసులే కీలకం: సీఎం చంద్రబాబు

**విశ్వంభర, విజయవాడ:** విధి నిర్వహణలో చాలా మంది పోలీసులు ప్రాణాలు విడిచి ప్రజల హృదయాల్లో త్యాగధనులుగా నిలిచారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అన్నింటికంటే పోలీసు శాఖ అత్యంత కీలకమని చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు."ఏ ప్రగతి జరగాలన్నా పోలీసులే కీలకం. ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడేందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసులను మన స్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఉమ్మడి రాష్ట్రంలో నక్సలిజాన్ని ఉక్కు పాదంతో అణచివేశారు. ఫ్యాక్షనిజం, రౌడీల ఆట కట్టించారు. శాంతిభద్రతలను కాపాడటంలో ఏమాత్రం రాజీలేదు. పోలీసుల సంక్షేమం మా ప్రభుత్వం బాధ్యత. పటిష్ఠ యంత్రాంగంగా తయారు చేయడం మా కర్తవ్యం. రాష్ట్ర విభజన తర్వాత పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చాం. వాహనాలతో పాటు పరికరాలు, సాంకేతిక సౌకర్యం కల్పించాం. ఏపీ పోలీసు అంటే దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దాలని ముందుకెళ్లాం. 2014-2019 మధ్య రూ.600 కోట్లు ఖర్చు చేశాం. కొత్తగా వాహనాల కోసం రూ.150కోట్లు వెచ్చించాం. పోలీసు కార్యాలయాల మరమ్మతులు, నిర్వహణకు రూ.60కోట్లు ఖర్చుపెట్టాం. రూ.27కోట్లతో ఏపీఎఫ్ఎస్ఎల్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేశాం. పోలీసు సంక్షేమానికి రూ.55 కోట్లు కేటాయించాం.






### సర్వే రాళ్లపై బొమ్మలకు తగలేసి.. సీసీ కెమెరాలకు రూ.700కోట్లు ఇవ్వలేకపోయారు..

సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు దీటైన పోలీసు వ్యవస్థకు శ్రీకారం చుట్టాం. విశాఖపట్నంలో గ్రేహౌండ్స్ కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశాం. కేంద్రం ఎప్పటికప్పుడు పోలీసు వ్యవస్థ ప్రక్షాళనకు ముందుకొస్తోంది. ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అధికారంలోకి వచ్చిన 125 రోజుల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లించాం. దిశ పేరుతో వాహనాలకు రూ.16కోట్లు, కమ్యూనికేషన్ పరికరాల కోసం రూ.20కోట్లు పెండింగ్ పెడితే వాటినీ చెల్లించాం. తప్పు చేసిన వ్యక్తిని వెంటనే పట్టుకునే వ్యవస్థ అవసరం.గత ప్రభుత్వం కక్ష సాధింపులే పనిగా పెట్టుకుంది. రాగ ద్వేషాలకు అతీతంగా పనిచేసేదే పోలీసు వ్యవస్థ. సర్వే రాళ్లపై బొమ్మ కోసం రూ.700 కోట్లు తగలేసిన వ్యక్తి జగన్. సీసీ కెమెరాల కోసం మాత్రం రూ.700 కోట్లు ఇవ్వలేకపోయారు. నేరాల తీరు మారుతోంది.. పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలి. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలి" అని చంద్రబాబు సూచించారు.

## తిరుమల శ్రీవారి ఆలయంపై చక్కర్లు కొట్టిన హెలికాప్టర్



**విశ్వంభర, తిరుమల:** తిరుమల కొండపై సోమవారం ఉదయం ఓ హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. శ్రీవారి ఆలయానికి సమీపం నుంచే హెలికాప్టర్ వెళ్లడం తీవ్ర కలకలం రేపుతోంది. ఆగమ శాస్త్రం ప్రకారం.. తిరుమల కొండపై విమానాలు, హెలికాప్టర్లు ఎగరడం నిషిద్ధం. కానీ నిబంధనలకు విరుద్ధంగా కొండపై చాలా సార్లు విమానాలు, హెలికాప్టర్లు ఎగిరిన ఘటనలు ఇటీవలే అనేకం వెలుగు చూశాయి.తాజాగా మరోసారి అలాంటి ఘటనే చోటు చేసుకోవడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ హెలికాప్టర్ ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లిందనే దానిపై టీటీడీ అధికారులు ఆరా తీస్తున్నారు. నో ఫ్లై జోన్‌గా ఉన్న తిరుమల కొండపై హెలికాప్టర్ వెళ్లడంపై ఏవియేషన్ అధికారులకు టిటిడే అధికారులు ఫిర్యాదు చేశారు.

## సుప్రీంకోర్టులో టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసు విచారణ వాయిదా



**విశ్వంభర, అమరావతి:** టీడీపీ కేంద్ర కార్యాలయం,చంద్రబాబు నివాసంపై దాడి కేసుల్లో సోమవారం సుప్రీంకోర్టులో విచారణజరిగింది. జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా ధర్మాసనం విచారణ చేపట్టింది. రెండు కేసుల్లో వైకాపా నేతలు దేవినేని అవినాష్, జోగి రమేశ్ సహా పలువురి పిటిషన్లపై రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసింది. కౌంటర్‌కు రిజాయిండర్ దాఖలు చేస్తామని నిందితుల తరఫు న్యాయవాదులు తెలిపారు. కొంత సమయం ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరారు. తదుపరి విచారణను ధర్మాసనం డిసెంబర్ 17కి వాయిదా వేసింది. అప్పటివరకు మధ్యంతర ఉత్తర్వుల్లో ఉపశమనం కొనసాగుతుందని పేర్కొంది.

## నందిగం సురేష్‌కు 14 రోజుల రిమాండ్



**విశ్వంభర, అమరావతి:** వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు మరో 14 రోజుల రిమాండ్ విధించారు. వెలగపూడిలో మహిళ మరియమ్మ హత్య కేసులో ఆయన నిందితుడిగా ఉన్నారు. కస్టడీ ముగిశాక ఆయన్ను పోలీసులు మంగళగిరి కోర్టులో ప్రవేశపెట్టారు. నవంబర్ 4 వరకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. సురేష్‌ను గుంటూరుజిల్లా జైలుకు తరలించారు.

## టీచర్ హత్య కేసులో దోషికి యావజ్జీవం



విశ్వంభర, అనంతపురం: ప్రైవేటు టీచర్ విజయలక్ష్మీ హత్య కేసులో అనంతరపురం జిల్లా న్యాయస్థానం తీర్పు వెలువరించింది. నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. కంబదూరు మండలం కదిరి దేవరపల్లికి చెందిన రుద్రేశ్ రాంగ్ ఫోన్ కాల్ ద్వారా వివాహిత విజయలక్ష్మీతో పరిచయం ఏర్పరుచుకున్నాడు. నెల రోజుల్లోనే ఆమెను దారుణంగా హత్య చేశాడు. 2018లోజరిగిన ఈ ఘటనకు సంబంధించిన కేసుపై విచారణ పూర్తి చేసిన న్యాయస్థానం తాజాగా తీర్పు వెలువరించింది.

# డయేరియా మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

## గుర్లలో డయేరియా బాధితులను పరామర్శించిన పవన్ కల్యాణ్



**విశ్వంభర, గుర్ల:** విజయనగరం జిల్లా గుర్లలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటించారు. స్థానిక పీహెచ్‌సీలో డయేరియా బాధితులను ఆయన పరామర్శించారు. వ్యాధి వ్యాప్తి, కారణాలపై అధికారులను ఆరా తీశారు. అనంతరం గుర్లలో బాధిత కుటుంబాలతో ఆయన మాట్లాడారు. అంతకుముందు నెల్లిమర్ల మండలం ఎడయేరియా బాధితులను పరామర్శించిన పవన్‌కల్యాణ్‌స్ఎస్ఆర్ పేట వద్ద తాగునీటి పథకాన్ని పవన్ పరిశీలించారు. సాయంత్రం విజయనగరం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించనున్నారు.

విజయనగరం జిల్లాలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటించారు. నెల్లిమర్ల మండలం ఎస్.ఎస్.ఆర్.పేట వద్ద గుర్ల తాగునీటి పథకాన్ని ఆయన పరిశీలించారు. గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించారు. ఆ గ్రామస్థులతో ముఖాముఖి మాట్లాడారు. అతిసారం వ్యాప్తి కారణాలపై కలెక్టర్‌తో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. విచారణ తర్వాత ప్రభుత్వం నుంచి పరిహారం ప్రకటిస్తామన్న ఆయన.. వ్యక్తిగతంగా మృతుల కుటుంబాలకు రూ. 1లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు." గత ప్రభుత్వ తప్పిదాలు మాకు వారసత్వంగా వచ్చాయి. గుర్లకు వెళ్లే చంపావతి నీరే కలుషితమైంది. గత ప్రభుత్వం కనీసం మంచినీరు అందించలేకపోయింది. విచారణకు సీనియర్ ఐఏఎస్ విజయానంద్‌ను నియమించారు. విచారణ తర్వాత ప్రభుత్వం నుంచి పరిహారం ప్రకటిస్తాం. మృతుల కుటుంబాలకు వ్యక్తిగతంగా రూ.1లక్ష సాయం ప్రకటిస్తున్నా" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చిన జగన్ : వైఎస్. షర్మిల



విశ్వంభర, అమరావతి: ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అప్పటి జగన్ ప్రభుత్వం నీరుగార్చిందని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా జగన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు." వైఎస్ఆర్ హయాంలో కాంగ్రెస్ పార్టీ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేశారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపి, ఎంతో మందిని ఇంజినీర్లు, డాక్టర్లుగా తీర్చిదిద్దిన గొప్ప పథకం అది. అలాంటి పథకాన్ని జగన్ నీరుగార్చారు. విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.3500 కోట్లు పెండింగ్‌లో పెట్టడం సిగ్గుచేటు. బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడారు. జగన్ హయాంలో విద్యార్థుల తల్లిదండ్రులను మనోవేదనకు గురిచేశారు. దోచుకుని దాచుకోవడంపై ఉన్న శ్రద్ధ, విద్యార్థుల సంక్షేమంపై పెట్టలేదు" అని షర్మిల పేర్కొన్నారు. "మతాలకు అనుకూలంగా ఉండే భాజపాను వైఎస్ఆర్ వ్యతిరేకిస్తే.. జగన్ మాత్రం అదే పార్టీకి దత్తపుత్రుడిగా మారారు. కాషాయ పార్టీతో చెట్టా పట్టాలు వేసుకొని తిరిగారు. అలాంటి వాళ్లకు వైఎస్ఆర్ ఆశయాలు గుర్తు లేవు. ఆయన ఆశయాలకు జగన్ వారసుడు అవుతారని అనుకోవడం పొరపాటే. వైకాపా మహా పాపం చేసింది" అని షర్మిల వ్యాఖ్యానించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను రిలీజ్ చేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని.. వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## నెల రోజుల్లో డ్రోన్ పాలసీ : సురేశ్ కుమార్




**విశ్వంభర, అమరావతి:** డ్రోన్ కాన్ఫరెన్స్‌లో రెండు ఒప్పందాలపై సంతకాలు చేసినట్లు ఏపీ డ్రోన్ కార్పొరేషన్ కార్యదర్శి సురేశ్ కుమార్ తెలిపారు. డ్రోన్ కార్పొరేషన్ అధికారులతో కలిసి రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం జరుగుతుందని, డ్రోన్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ కూడా సర్టిఫైడ్ ఏజెన్సీగా నిలుస్తుందని చెప్పారు. డ్రోన్ కార్పొరేషన్ ద్వారా డ్రోన్ పైలట్ శిక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు." తిరుపతి ఐఐటీతో నాలెడ్జ్ పార్ట్‌నర్‌షిప్‌ఎంవోయూ కుదుర్చుకుంటాం. ఎంవోయూ కోసం చాలా కంపెనీల నుంచి దరఖాస్తులు వస్తున్నాయి. వాటిని అధ్యయనం చేసి ఓ విధానం ప్రకారం ఎంవోయూ చేస్తాం. డ్రోన్ ఎకో సిస్టమ్ కోసం స్ట్రాటజీ ఫ్రేమ్‌వర్క్ కాన్సెప్ట్ పేపర్ విడుదల చేస్తాం. దానిని డ్రోన్ కాన్ఫరెన్స్‌కు వచ్చే వారికి అందజేస్తాం. సలహాలు స్వీకరించి నెల వ్యవధిలో డ్రోన్ పాలసీ తీసుకొస్తాం. మంగళవారం డ్రోన్లతో నిర్వహించబోయే కార్యక్రమం దేశంలోనే అతి పెద్దది. విజయవాడ పున్నమి ఘాట్‌లో కృష్ణా నది పక్కనే 5,500 డ్రోన్లతో షో నిర్వహిస్తున్నాం. సాయంత్రం 6.30 నుంచి రాత్రి.8.30 వరకు డ్రోన్ షో ఉంటుంది. దీంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయి" అని సురేశ్‌కుమార్ వివరించారు.

## అక్రమాలకు తావు లేకుండా 'ఆవాస్' లబ్ధిదారుల ఎంపిక: కేంద్ర మంత్రి పెమ్మసాని



**విశ్వంభర, గుంటూరు:** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద అక్రమాలకు తావు లేకుండా అర్హులకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకం కింద చేపట్టే నిర్మాణాలపై గుంటూరు లోని ఆర్‌అండ్ బీ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ..అక్రమాలకు తావు లేకుండా అర్హులకు 'ఆవాస్'ఆండ్రాయిడ్ అప్లికేషన్ ద్వారా దేశవ్యాప్తంగా రెండుకోట్ల నూతన గృహాల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పెమ్మసాని చెప్పారు.సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, హౌసింగ్‌కార్పొరేషన్ ఛైర్మన్, జిల్లా కలెక్టర్, గృహనిర్మాణశాఖ అధికారులు పాల్గొన్నారు.

## వైసీపీ హయాంలో కుంటుపడిన గృహ నిర్మాణ రంగం

### మంత్రి పార్థసారథి

రానున్న ఐదేళ్లలో అర్హులైన పేదలకు ఇళ్లను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు. 2014-19లో యూనిట్ ఖరీదు రూ.2.5 లక్షలు ఉండగా.. వైకాపా ప్రభుత్వం రూ.1.8లక్షలకు తగ్గించినట్లు చెప్పారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో గృహ నిర్మాణ రంగం కుంటుపడిందన్నారు. కాలనీలోని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తేనే లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ముందుకు వస్తారని చెప్పారు. అందుకే రాష్ట్రప్రభుత్వం మౌలిక సదుపాయాలపై దృష్టిసారించిందన్నారు.

## హత్య కేసులో మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కుమారుడి అరెస్ట్



**విశ్వంభర, అమరావతి:** వైసీపీ సీనియర్ నాయకుడు, ఏపీ మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కుమారుడు పినిపె శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రెండేళ్ల క్రితం జరిగిన వాలంటీర్ హత్య కేసులో శ్రీకాంత్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. గత కొన్ని రోజులుగా ఆయన కోసం గాలిస్తున్న పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్టు తెలుస్తోంది. తమిళనాడులోని మధురైలో శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అక్కడే అతడిని కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై ఏపీకి తీసుకురానున్నారు.వాలంటీర్ హత్య కేసులో ఏకంగా మాజీ మంత్రి కుమారుడు అరెస్టు కావడం కలకలం రేపుతోంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అయినవిల్లిలో రెండేళ్ల క్రితం వాలంటీర్ హత్య జరిగింది. కోనసీమ అల్లర్ల సమయంలో వాలంటీర్ దుర్గాప్రసాద్ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు 2022 జూన్ 6న దుర్గాప్రసాద్‌ను హత్య చేశారు. ఈ కేసు దర్యాప్తు చేసిన పోలీసులు అప్పట్లోనే ఉప్పలగుప్తం మండలానికి చెందిన వడ్డిధర్మేశ్‌ను నిందితుడిగా చేర్చారు. అతడు దుర్గాప్రసాద్‌కు సన్నిహితుడే కాకుండా వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా కూడా ఉన్నట్టు తెలిసింది.ధర్మేశ్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు పినిపె శ్రీకాంత్‌తోపాటు మరో నలుగురి పేర్లను నిందితుల జాబితాలో చేర్చారు. అయితే ధర్మేశ్ అరెస్టు తర్వాత శ్రీకాంత్ సహా నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు. వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు ఎట్టకేలకు గత రాత్రి మధురైలో శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## కారు నుంచి అకస్మాత్తుగా మంటలు



**విశ్వంభర, చంద్రగిరి:** తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం తొండవాడ వద్ద రోడ్డుపై వెళ్తున్న కారు నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సోమవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. మంటల్లో కారు పూర్తిగా దగ్ధమైంది. మంటలు రాగానే అందులోని ప్రయాణికులు గమనించి కారు దిగిపోవడంతో ప్రాణాపాయంతప్పింది. స్థానికుల సమా చా రంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రాజమహేంద్రవరానికి చెందిన కుటుంబం గోల్డెన్ టెంపుల్ నుంచి స్వస్థలానికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది.



# 'అన్‌స్టాపబుల్' సీజన్ 4 మొదటి ఎపిసోడ్‌లో చంద్రబాబు నాయుడు

'అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బికె' సీజన్ 4 మొదటి ఎపిసోడ్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటున్నారు. ఈ ఎపిసోడ్ షూట్ కోసం చంద్రబాబు అన్‌స్టాపబుల్ సెట్స్ కు వచ్చారు. చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందించి బాలకృష్ణ ఆహ్వానించారు. తొలి ఎపిసోడ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు, బాలకృష్ణ మధ్య అద్భుతమైన సంభాషణల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అక్టోబరు 25న ఆహా లో అన్‌స్టాపబుల్ ప్రసారం కానుంది.

# మెకానిక్ రాకీ' రెండోసారి చూసే రేంజ్‌లో ఉంటుంది

## ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్ సేన్

విశ్వక్ సేన్, రవితేజ ముళ్లపూడి, రామ్ తాళ్లూరి, ఎస్ ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ 'మెకానిక్ రాకీ' యాక్షన్ ప్యాక్డ్ హ్యూమరస్ ట్రైలర్ 1.0 లాంచ్ అయింది. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ అప్ కమింగ్ మూవీ 'మెకానిక్ రాకీ' ఫస్ట్ గేర్, సాంగ్స్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. డెబ్యుటెంట్ రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని ఎస్‌ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. మేకర్స్ సోమవారం 'మెకానిక్ రాకీ' ట్రైలర్ 1.0 లాంచ్ చేశారు. శ్రీరాములు థియేటర్లో భారీగా హాజరైన అభిమానుల సమక్షంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ట్రైలర్ మెయిన్ క్యారెక్టర్స్ పరిచయం చేస్తూ సినిమా యాక్షన్ ప్యాక్డ్ హ్యూమరస్ గా వుంటుందని ప్రామిస్ చేసింది. రాకీ చదువులో ఫెయిల్ అయిన తర్వాత, తన తండ్రి మెకానిక్ షాప్ ని టేకోవర్ చేసుకొని, లేడిస్ కోసం డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభిస్తాడు. హీరోయిన్స్ పాత్రలు పోషించిన మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ లని ఫ్లర్ట్ చేస్తాడు. పవర్ ఫుల్ మ్యాన్ సునీల్ తో తలపడటం క్యురియాసిటీని పెంచింది. ట్రైలర్ లో యాక్షన్, హ్యూమర్, రొమాన్స్, మాస్ అన్నీ ఎలిమెంట్స్ అద్భుతంగా వున్నాయి. డైలాగులు ప్రేక్షకులను అలరించాయి. రవితేజ ముళ్లపూడి తన డైరెక్షన్‌తో ఆకట్టుకున్నాడు.



విశ్వక్ సేన్ హ్యూమర్, చరిష్మా తో స్ట్రాంగ్ పెర్ఫార్మెన్స్ తో కట్టిపడేశాడు. మీనాక్షి చౌదరి క్లాసిక్, ట్రెడిషనల్ గా పాత్రలో మెరిసింది. శ్రద్ధా శ్రీనాథ్ మోడరన్ అమ్మాయి పాత్రను పోషించింది. నరేష్, వైవా హర్ష కామెడీ రిలీఫ్‌ను అందించగా, సునీల్ మెయిన్ విలన్ గా చిల్లింగ్ ఇంప్రెషన్‌ని కలిగించాడు. మనోజ్ కటసాని స్టైలిష్ విజువల్స్, జేక్స్ బెజోయ్ ఎనర్జిటిక్ స్కోర్ ఎక్స్ పీరియన్స్ మరింతగా ఎలివేట్ చేసింది. నిర్మాణ విలువలు అత్యున్నత స్థాయిలో ఉన్నాయి. ఈ చిత్రానికి అన్వర్ అలీ ఎడిటర్, క్రాంతి ప్రియం ప్రొడక్షన్ డిజైనర్. సత్యం రాజేష్, విద్యాసాగర్ జె ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్. ఈ ట్రైలర్ 1.0 రాకీ మాస్ అప్పీల్‌ను ఇంపాక్ట్ ఫుల్ గా ప్రజెంట్ చేసింది. నవంబర్ 22న విడుదల కానున్న సినిమాపై భారీ అంచనాలు పెంచింది. హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ.. అందరికీ థాంక్ యూ. మీ అందరీ ఎనర్జీ చూస్తుంటే చాలా హ్యాపీగా వుంది. నవంబర్ 22న థియేటర్స్ లో కలుద్దాం. డైరెక్టర్ రవితేజ మాట్లాడుతూ. ట్రైలర్ అందరికీ బాగా నచ్చిందని అనుకుంటున్నాను. ఇంకా చాలా కంటెంట్ వుంది. ఒకొక్కటి అనౌన్స్ చేస్తూ వుంటాం. అవన్నీ మీకు చాలా ఎక్సయిటింగ్ గా ఉంటాయని ఆశిస్తున్నాను. అందరూ చూసి పెద్ద హిట్ కొట్టాలని ఆశిస్తున్నాను.' అన్నారు. నిర్మాత రామ్ తాళ్లూరి మాట్లాడుతూ.. హలో ఎవ్రీ వన్. ట్రైలర్ మీ అందరికీ నచ్చడం ఆనందంగా వుంది. సినిమా కూడా మాస్ కా దాస్ రేంజ్ లో ఉటుంది. నటీనటులు: విశ్వక్ సేన్, మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్, నరేష్, సునీల్, వైవ హర్ష, హర్షవర్ధన్, రోడీస్ రఘు రామ్.

31న ప్రపంచవ్యాప్తంగా 500 థియేటర్స్‌లో

# ఆదిపర్వం



రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్విక్రా ఆర్ట్స్ పతాకంపై ఏఐ ఎంటర్ టైన్ మెంట్స్ కలయికలో నిర్మించిన చిత్రం "ఆదిపర్వం". ఈ సినిమాలో మంచు లక్ష్మి, ఎస్తేర్, శివ కంతమనేని ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మరో కీలక పాత్రను ఆదిత్య ఓం పోషిస్తున్నారు. ఎర్రగుడి నేపథ్యంలో అమ్మవారి చుట్టూ అల్లుకున్న పీరియాడిక్ ప్రేమకథతో గ్రాఫిక్స్ ప్రధానంగా "ఆదిపర్వం" చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకుడు సంజీవ్ మేగోటి. "ఆదిపర్వం" సినిమా ఈ నెల 31న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. 500కు పైగా థియేటర్స్ లో "ఆదిపర్వం" సినిమా ప్రేక్షకులను అలరించబోతోంది. 1974-90 మధ్య కాలంలో జరిగిన యదార్థ ఘటనల సమాహారంగా "ఆదిపర్వం" సినిమాను రూపొందించారు దర్శకుడు సంజీవ్ మేగోటి. అమ్మోరు, అరుంధతి చిత్రాల తరహాలో దుష్టశక్తికి, దైవశక్తికి మధ్య జరిగే యుద్ధాన్ని ఆసక్తికరంగా అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో, టెక్నికల్ హంగులతో ఈ సినిమాలో చూపించబోతున్నారు. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేలా "ఆదిపర్వం" థియేటర్స్ లోకి వస్తుందని మూవీ మేకర్స్ చెబుతున్నారు. నటీనటులు - మంచు లక్ష్మి, ఆదిత్య ఓం, ఎస్తేర్, సుహాసిని, శ్రీజిత ఘోష్, శివ కంతమనేని, వెంకట్ కిరణ్, సత్య ప్రకాష్, సమ్మెట గాంధీ, జెమినీ సురేష్, ఢిల్లీ రాజేశ్వరి, హ్యారీ జోష్, జబర్దస్త్ గడ్డం నవీన్, యోగి ఖత్రి , మధు నంబియార్, బీఎన్ శర్మ, బృంద, స్నేహ అజిత్, అయోషా, జ్యోతి, దేవి శ్రీ ప్రభు, శ్రావణి, గూడా రామకృష్ణ, రాధాకృష్ణ తేలు, రవి రెడ్డి, లీలావతి, దుగ్గిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

టాలీవుడ్ నటి సమంత చాలా రోజుల తర్వాత వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్న విషయం తెలిసిందే. ఆమె ప్రధాన పాత్రల్లో నటిస్తున్న స్పై యాక్షన్ సిరీస్ ' 'సిటాడెల్: హనీ బన్నీ'. ఇందులో వరుణ్ ధావన్ కథానాయకుడిగా నటిస్తుండగా.. 'ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫర్జీ' లాంటి విజయవంతమైన సిరీస్‌లను అందించిన రాజ్ అండ్ డీకే ఈ వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియాంక చోప్రా నటించిన హాలీవుడ్ బ్లాక్ బస్టర్ వెబ్ సిరీస్ 'సిటాడెల్'కు రీమేక్‌గా ఈ సిరీస్ రాబోతుంది. ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వేదికగా నవంబర్ 7 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఇక విడుదల తేదీ దగ్గరపడటంతో వరుస ప్రమోషన్స్ చేస్తుంది చిత్రబృందం. అయితే ఈ చిత్రానికి సంబంధించి హిందీ టాపిక్ రాగా.. వేదికలపై తనకు హిందీ మాట్లాడటం అంటే భయమంటూ చెప్పుకొచ్చింది ఈ భామ. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా చిత్ర దర్శకులు రాజ్ అండ్ డీకే మాట్లాడుతూ.. ఈ సిరీస్ కోసం మొదట హిందీ మాట్లాడేవారినే తీసుకుందాం అనుకున్నాం. అందుకే వరుణ్ ధావన్‌ను హీరోగా తీసుకున్నాం. అయితే సమంతకు హిందీ వచ్చు అని తెలియదు. ఒక ఇంటర్వ్యూలో సమంత హిందీలో మాట్లాడటం చూసి చాలా షాకయ్యాము. దీంతో ఈ సిరీస్‌కు సమంత ఫర్‌ఫెక్ట్ రోల్ అని అప్పుడే డిసైడ్ అయ్యాం అంటూ రాజ్ అండ్ డీకే చెప్పుకొచ్చారు. అయితే ఈ వ్యాఖ్యలపై సమంత తాజాగా స్పందించింది. సిటాడెల్ సిరీస్‌లో నాహనీ పాత్రకు హిందీ బాగా వస్తుంది. ఈ విషయాన్ని మీరు గుర్తించలేదు. నేను మాట్లాడేటప్పుడు

# అందుకే హిందీ మాట్లాడాలంటే భయం



ఉచ్చారణలో తప్పులు వస్తాయని భయంతో వేదికలపై హిందీ మాట్లాడను అంటూ సమంత చెప్పుకొచ్చింది. ఈ సిరీస్‌లో కే కే మీనన్, సిమ్రాన్, సాకిబ్ సలీమ్, సికందర్ ఖేర్, సోహమ్ మజుందార్, శివన్‌కిత్ పరిహార్ మరియు కష్వీ మజ్ముందర్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





## ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చేసిన

# సైకలాజికల్ థ్రిల్లర్ కలి

యంగ్ హీరోలు ప్రిన్స్, నరేష్ అగస్త్య నటించిన సినిమా "కలి". ఈ చిత్రాన్ని ప్రముఖ కథా రచయిత కె.రాఘవేంద్ర రెడ్డి సమర్పణలో "రుద్ర క్రియేషన్స్" సంస్థ నిర్మించారు. శివ శేషు దర్శకత్వం వహించారు. లీలా గౌతమ్ వర్మ నిర్మాతగా వ్యవహరించిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ ఈ నెల 4వ తేదీన థియేట్రికల్ రిలీజ్ కు వచ్చి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ రోజు నుంచి ఈటీవీ విన్ లో "కలి" సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. ఆత్మహత్యల తో జీవితంలోని సమస్యలు పరిష్కారం కావనే మంచి సందేశంతో థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, ఎంటర్ టైనింగ్ క్యారెక్టర్స్ తో "కలి" సినిమా రూపొందింది. మన పురాణాల్లోని కలి పాత్రను స్ఫూర్తిగా తీసుకుని హై క్వాలిటీ విజువల్ ఎఫెక్టులతో ఈ సినిమా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. థియేటర్స్ లో "కలి" సినిమా మిస్ అయిన వారు ఈటీవీ విన్ లో మూవీని ఎంజాయ్ చేయొచ్చు. నటీనటులు ప్రిన్స్, నరేష్ అగస్త్య, నేహా కృష్ణన్, గౌతంరాజు, గుండు సుదర్శన్, కేదార్ శంకర్, మని చందన, మధుమణి. తదితరులు.

# ఫోన్ల వల్ల పిల్లలకు ఎలాంటి సమస్యలో తెలుసా?

నేటి పిల్లలకు మొబైల్ ఫోన్ ఇస్తే చాలు ఇంకేమీ అక్కర్లేదు. రోజంతా కార్టూన్ వీడియోలు, గేమ్స్‌తోనే గడిపేస్తుంటారు. తల్లితండ్రులు తమ పనులు చేసుకునేందుకు చిన్నప్పటి నుంచి పిల్లలకు మొబైళ్లను అలవాటు చేస్తున్నారు. దీంతో పిల్లలకు స్మార్ట్ ఫోన్ అనేది ఒక వ్యసనంగా మారిపోయింది. అయితే పిల్లలు పదేపదే ఫోన్ వాడటం వల్ల మంచికంటే చెడు ఎక్కువ జరుగుతుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. స్క్రీన్ టైం పెరగడంతోపాటు ఊబకాయంతో బాధపడే పిల్లల సంఖ్య కూడా పెరుగుతోందని పరిశోధనలు చెబుతున్నాయి. యువతలో ఊబకాయం సమస్య చాలా ఎక్కువగా ఉంది. రోజంతా మొబైల్ ఫోన్లు చూడటం వల్ల క్రీడల్లోనూ విముఖత కనిపిస్తోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, మొబైల్ స్క్రీన్ ఎక్కువ సేపు చూడటం వల్ల పిల్లలకు ప్రమాదమేనంటున్నారు నిపుణులు. ఆడుకునే సమయం ఫోన్‌లకు బానిస కావడం వల్ల పిల్లల శారీరక శ్రమ తగ్గుతోంది. ఫలితంగా, అదనపు శరీర కొవ్వును తొలగించడం సాధ్యం కాదు. అది శరీరంలోనే ఉంటుంది. బరువు పెరగడానికి కారణమవుతుంది. స్థూలకాయం వంటి వ్యాధుల బారిన పడకుండా పిల్లలను దూరం చేయాలంటే కనీసం 60 నిమిషాల పాటు క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాల్సిందేనని వైద్యులు చెబుతున్నారు. అధిక మొబైల్ వాడకం అనేది పిల్లల అభివృద్ధిపై సానుకూల, ప్రతికూల ప్రభావాలను చూపుతుందని ఏఎం మెడికల్ సెంటర్



పీడియాట్రిషియన్ జయతి సేన్‌గుప్తా చెబుతున్నారు. మొబైల్ ద్వారా చాలా విషయాలు నేర్చుకోవచ్చు. ఏది ఏమైనప్పటికీ, ఎక్కువ కాలం మొబైల్ చూడటం ప్రతికూల ప్రభావాలు సానుకూలతలను అధిగమిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. మీరు ఒక రోజులో మొబైల్ ఫోన్ ముందు గడిపే సమయం మీ పనితీరు, మానసిక స్థితి లేదా అభ్యాసంపై కూడా ప్రభావం చూపుతుంది. ఇది పిల్లల భాషా అభివృద్ధిని కూడా ప్రభావితం చేస్తుందంటున్నారు. టీవీ లేదా మొబైల్ స్క్రీన్‌ల ముందు ఎక్కువ సమయం గడిపే తల్లిదండ్రులు వారి పిల్లలకు అదే అలవాటు చేసేస్తున్నారని అధ్యయనం గుర్తించింది.. ఈ అలవాటు తర్వాత ఊబకాయం, నిద్ర సమస్యలు, నిరాశ, ఆందోళనకు దారితీస్తుంది. గత 3 దశాబ్దాలలో యునైటెడ్ స్టేట్స్‌లో ఊబకాయం పిల్లలు కౌమారదశలో దాదాపు మూడు రెట్లు పెరిగిందని అధ్యయనాలు చెబుతున్నాయి. యునైటెడ్ స్టేట్స్‌లో పిల్లలలో ఊబకాయం రేటు దాదాపు 17 శాతం. ముఖ్యంగా టీవీ చూడటం వల్ల పిల్లలు అధిక బరువు, స్థూలకాయులుగా మారే ప్రమాదం రెట్టింపు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే తల్లిదండ్రులు పిల్లలను మొబైల్, టీవీలకు అతుక్కుపోకుండా చూడాలని సూచిస్తున్నారు.

# మేక పాలు తాగితే.. డెంగ్యూ తగ్గుతుందా?

ఇటీవలి కాలంలో డెంగ్యూ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం వేల మంది డెంగ్యూ బారినపడుతున్నారు. డెంగ్యూ వ్యాధి బారిన పడుతున్నవారు త్వరగా కోలుకునేందుకు సరైన ఆహారం కీలకమని చెబుతున్నారు వైద్య ఆరోగ్య నిపుణులు. కొన్ని రకాల పండ్లు, కూరగాయల రసాలు ప్లేట్ లెట్స్ సంఖ్యను పెంచుతాయని.. రోగ నిరోధక శక్తిని బూస్ట్ చేస్తాయని చెప్తున్నారు. అయితే, డెంగ్యూ బాధితులకు మేకపాలు మేలు చేస్తాయనే వార్తలు కూడా ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్నాయి. డెంగ్యూ వ్యాధి చికిత్సలో మేక పాలు నిజంగా పనిచేస్తాయా..? ఈ పాలు.. డెంగ్యూని తగ్గించగలవా..? నిపుణుల ప్రకారం.. మేక పాలతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఆవు పాలు మాదిరిగానే మేక పాలు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. పోషకగుణాలు అధికంగా ఉండే ఈ పాలను తాగడం వల్ల పలు ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చునని చెబుతున్నారు. ప్రొటీన్స్, కాల్షియం ఎక్కువగా ఉండే మేక పాలను తాగడం వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. మేక పాలల్లో అమినోయాసిడ్స్ పుష్కలంగా ఉండటం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అన్ని సక్రమంగా అందుతాయి. ఇది ఆవు పాల కంటే ఎక్కువ ప్రోటీన్, అవసరమైన విటమిన్లు, తక్కువ లాక్టోస్ కలిగి ఉంటుంది, దీని కారణంగా ఇది సులభంగా జీర్ణమవుతుంది. ఒక



కప్పు మేక పాలు తీసుకోవడం వల్ల 30 శాతం ఫాటీ ఆమ్లాలను శరీరం అధికంగా పొందుతుందని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. మేక పాలలో ఉండే బయోఆర్గానికి సోడియం శరీరానికి చాలా మేలు చేస్తుంది. కణాల అభివృద్ధికి ఉపయోగపడుతుంది. మేక పాలు తాగడం వల్ల రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుంది. ప్రతిరోజు మేకపాలు తాగడం వల్ల రక్తపోటు నియంత్రిస్తుంది. మేక పాలను తాగడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుంది. డెంగ్యూ సోకిన వారికి రక్తంలో ప్లేట్ లేట్స్ తగ్గిపోతుంటాయి. వారికి మేక పాలు ఇస్తే మంచి ఫలితం ఉంటుందని చెబుతారు. కానీ, డెంగ్యూ చికిత్సతో దీనికి ఎటువంటి సంబంధం లేదు. ఇది ఒక పోషకమైన ఎంపిక, శరీరానికి అవసరమైన పోషణను అందించగలదని నిపుణులు అంటున్నారు, అయితే ఇది ప్లేట్‌లెట్లను పెంచడంలో లేదా డెంగ్యూ వైరస్ ప్రభావాన్ని నేరుగా నియంత్రించడంలో సహాయపడదు. డెంగ్యూ అనేది డెంగ్యూ వైరస్ వల్ల కలిగే వైరల్ ఇన్ఫెక్షన్. డెంగీ దోమ కుట్టడం వల్ల ఇది వ్యాపిస్తుంది. ఇక.. ఈ దోమ కుట్టిన తర్వాత విపరీతమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. డెంగ్యూకి ఉత్తమ చికిత్స ఫ్లూయిడ్ థెరపీ అని నిపుణులు అంటున్నారు, రోగి వీలైనంత ఎక్కువ ద్రవాన్ని తీసుకోవాలి, ORS తీసుకోవాలి, ఇది శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుకోవడంలో సహాయపడుతుంది. ఈ సమయంలో విశ్రాంతి తీసుకోవడం చాలా ముఖ్యం అంటున్నారు నిపుణులు.

# మూసీపై ముఖ్యమంత్రిది పూటకోమాట

■ ఆయన కుట్రలను బట్టబయలు చేస్తాం

■ మాజీ మంత్రి హరీశ్‌రావు



**విశ్వంభర, హైదరాబాద్ :** మూసీపై సీఎం రేవంత్‌రెడ్డి పూటకోమాట మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపిపంచారు. పలు సందర్భాల్లో.. పలు వేదికల్లో మూసీపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలను ఆయన గుర్తు చేశారు. మూసీ పరివాహక అభివృద్ధి కోసం ఐదేండ్లలో రూ. లక్షా 50 వేల కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జులై 20వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారన్నారు. సెప్టెంబర్ 6న విడుదల చేసిన 'తెలంగాణ గ్రోత్ స్టోరీ ద రోడ్ టు వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ' విజన్ డాక్యుమెంట్‌లోనూ.. రూ. లక్షా 50వేల కోట్లు అంటే సుమారు 18 బిలియన్ల డాలర్లతో ఐదేండ్లలో మూసీ రివర్ ఫ్రంట్ రీడెవలప్‌మెంట్ కోసం ఖర్చు చేస్తున్నట్లుగా పేర్కొన్నారని హరీశ్‌రావు గుర్తు చేశారు. తాజాగా ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ రూ. లక్షా 50 వేల కోట్లు ఎవరన్నారంటూ రేవంత్ ఆవేశంతో ఊగిపోయారంటూ.. పూటకో తీరుగా మాట్లాడుతున్న మిమ్మల్ని చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతోందన్నారు. డీపీఆర్ లేకుండా రూ. లక్షా 50వేల కోట్లు ఖర్చవుతాయని చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. మూసీ పేరుతో ప్రజాధనం లూటీచేయాలనే కుట్రలను బట్టబయలు చేస్తామని, నిరంకుశ విధానాలను అడుగడుగునా ఎండగడతామన్నారు. తెలంగాణ ప్రజల తరుపున నిలదీస్తామని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు హెచ్చరించారు.

# 33 జిల్లాలు పూర్తి చేసుకున్న సీఎం కప్ టార్చ్ రిలే ర్యాలీ

■ రాష్ట్రమంతా 2700 కిలోమీటర్లు చుట్టుముట్టిన క్రీడాజ్యోతి

■ ఉత్సాహభరితంగా పాల్గొన్న లక్షలాదిమంది యువ క్రీడాకారులు

■ పార్టీలకతీతంగా పాల్గొన్న ప్రజా ప్రతినిధులు

■ జిల్లా కలెక్టర్లు ఎస్పీలు వివిధ శాఖల అధికారులు

■ సమన్వయం చేసిన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ




**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రామీణ క్రీడా రంగానికి పెద్ద పీట వేసే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించబోతున్న సీఎం కప్ 2024 కు పల్లెల నుంచి విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలన్న ఉద్దేశంతో తలపెట్టిన అక్టోబర్ 3న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన సీఎం కప్ టార్చ్ రిలే ర్యాలీ సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చేరుకొని 33 జిల్లాలు పూర్తిచేసుకుంది. 15 రోజులపాటు దాదాపు 2700 కిలోమీటర్లు చుట్టుముట్టి వచ్చిన టార్చ్ రిలే ర్యాలీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని తెలంగాణ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ కు చేరుకుంది. హైదరాబాద్ ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్ నుంచి ప్రారంభమై హైదరాబాద్ నగరంలో లంగర్ హౌస్ వరకు తదుపరి వికారాబాద్ నుండి మొదలుకొని జిల్లాలు పూర్తి చేసుకొని, సోమవారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కు చేరుకుంది. సమన్వయం చేసిన జిల్లా అధికార యంత్రాంగం 33 జిల్లా కేంద్రాల్లో కొనసాగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు ఎస్పీలు వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ముందుకు సాగింది. ఒకటి రెండు చోట్ల తప్ప మిగతా అన్నిచోట్ల జిల్లా కలెక్టర్లు ఎస్పీలు ఈ ర్యాలీలను ప్రారంభించారు. తెలంగాణ స్పోర్ట్స్ పార్టీ రెగ్యులర్ ట్రైనీలతోపాటు పోలీస్ ట్రైనీలు పీఈటీ ల భాగస్వామ్యంతో కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి. దసరా సెలవులు అనంతరం వివిధ పాఠశాల కళాశాలల విద్యార్థులు అందుబాటులో ఉండడంతో రెండో విడత లో జరిగిన జిల్లా కేంద్రాల్లో యువ క్రీడాకారుల భాగ్యం సామ్యంతో ఉత్సాహంగా కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి. ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం పలు జిల్లాల్లో ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని యువ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, నల్గొండ జిల్లా కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నిర్మల్ జిల్లా కేంద్రంలో బీజేపీ శాసనసభ పక్ష నాయకుడు మహేశ్వర్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఎంపీ జి నగేష్ పెద్దపల్లి జిల్లాలో శాసనసభ్యులు విజయ రమణారావు, జనగామ జిల్లా కేంద్రంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి మహబూబాబాద్ శాసనసభ్యులు మురళి నాయక్, సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, రంగారెడ్డి జిల్లా కేంద్రంలో రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి తోపాటు పలువురు స్థానిక మున్సిపల్ చైర్మన్లు స్థానిక ప్రజాప్రతినిధులు పలువురు నేతలు పార్టీలకతీతంగా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యారు. టార్చ్ బేరర్ లుగా దీప్తి జీవన్ జీ, నందిని ప్రీతి అగర్వాల్ ప్రారంభించిన ఈ క్రీడాజ్యోతి ర్యాలీలో క్రీడా అవార్డులు ద్రోణాచార్య ఇస్మాయిల్ బెగ్ అర్జున అవార్డు గ్రహీత అనూప్ కుమార్ యామ ఒలంపియన్ ఎడ్వర్డ్ రంగారెడ్డి జిల్లా కేంద్రంలో అర్జున అవార్డు ఉసముద్దీన్ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో టార్చ్ రిలే ర్యాలీలో పాల్గొన్నారు. 33 జిల్లాలు తిరిగి హకీం పేట స్పోర్ట్స్ స్కూల్ కు చేరుకునే క్రీడాజ్యోతి నవంబర్ రెండవ తేదీన ప్రారంభమయ్యే గ్రామీణ స్థాయి సీఎం కప్ పోటీల సందర్భంగా ఎల్బీ స్టేడియం కు చేరుకునే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. లక్షలాదిమంది యువ క్రీడాకారుల భాగస్వామ్యం 15 రోజులపాటు 33 జిల్లా కేంద్రాల్లో జరిగిన ఈ కార్యక్రమం లో ప్రతిచోట విద్యార్థినీ విద్యార్థులు యువకులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు. **మార్పును ఆహ్వానిస్తున్న యువత:** స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి దాదాపు దశాబ్ద కాలం నుండి ఇటువంటి క్రీడాకారులకు స్ఫూర్తి కలిగించే కార్యక్రమాల నిర్వహణ జరగలేదని, రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని దీనిని ఆహ్వానిస్తున్న యువత ఈ క్రీడాజ్యోతి కార్యక్రమాలను విజయవంతం చేసిందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాల రూపకల్పన చేసి విద్యార్థులను చెడు వ్యసనాల వైపు కాకుండా క్రీడా మైదానాల వైపు మళ్ళీ ఇస్తామని ఆయన తెలిపారు. నాలుగు అంచెలు గ్రామీణ మండల జిల్లా రాష్ట్రస్థాయిలో నిర్వహించే సీఎం కప్ 2024 పోటీలు తెలంగాణ క్రీడారంగా ముఖచిత్రాన్ని మార్చబోతున్నాయని శివసేన రెడ్డి అన్నారు.

# పోలీసు విచారణలో హైకమిషనర్ పాల్గొనాలని కోరారు

**అందుకే కెనడా నుంచి దౌత్యవేత్తలు వెనక్కి**

**భారత విదేశాంగ మంత్రి జైశంకర్**



**ఢిల్లీ:** భారత దౌత్యవేత్తలపై కెనడా ప్రభుత్వ చర్యలతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణించాయి. తాజా పరిణామాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరిందని.. అందుకే మన హైకమిషనర్‌తోపాటు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించామని చెప్పారు. ఓ జాతీయ వార్తా ఛానెల్ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన.. ఆ దేశంతో సంబంధాలను ప్రస్తుతం అంచనా వేయడం కష్టమేనన్నారు. "పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరింది. అందుకే మన హైకమిషనర్‌తోపాటు దౌత్యవేత్తలను ఉపసంహరించుకున్నాం. దౌత్యవేత్తల సంక్షేమం, భద్రతకు సంబంధించి కెనడాలో ఏం జరుగుతుందనే విషయాలను తెలుసుకోవడం కెనడాకు ఇబ్బందికరంగా మారినట్లు కనిపిస్తోంది. అదే భారత్‌లో.. కెనడా దౌత్యవేత్తలు మాత్రం మన సైన్యం, పోలీసుల సమాచారాన్ని స్వేచ్ఛగా సేకరించడం, నిర్దేశిత పౌరులను కెనడాలో అడ్డుకునేందుకు మాత్రం ఎటువంటి చర్యలుండవు" అని కెనడా తీరుపై జైశంకర్ మండిపడ్డారు. "అక్కడా, ఇక్కడా వారి తీరు భిన్నంగా ఉంది. భారత్‌కు చెందిన నేతలు, దౌత్యవేత్తలను మీ పౌరులు బహిరంగంగా బెదిరిస్తున్నారు అని మనం చెబితే.. వాక్ స్వాతంత్ర్యం అంటారు. భారత హైకమిషనర్‌ను బెదిరించినా భావ ప్రకటనా స్వేచ్ఛ కింద పరిగణించాలని అంటున్నారు. అదే భారత్‌లోని కెనడా దౌత్యవేత్త సౌత్‌బ్లాక్ నుంచి కోపంతో బయటకు వచ్చారని ఓ భారత జర్నలిస్టు పేర్కొంటే మాత్రం.. విదేశీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. వారి దేశంలో ఒక మాదిరిగా వ్యవహరిస్తాం. విదేశాల్లో అవి మీకు వర్తించవు అని అంటున్నారు. ఇదీ మారుతున్న ప్రపంచంలో చోటుచేసుకుంటున్న పరిస్థితులు" అని కెనడాను ఉద్దేశిస్తూ భారత విదేశాంగ మంత్రి చురకలు అంటించారు. 1945 తర్వాత ప్రపంచంపై పాశ్చాత్య దేశాల ప్రభావం ఎక్కువగా ఉండేదన్న జైశంకర్.. గడిచిన 20-25 ఏళ్లలో పరిస్థితుల్లో మార్పు వచ్చిందన్నారు. పాశ్చాత్యేతర దేశాల వాటా, భాగస్వామ్యం, ప్రభావం పెరిగిందని.. ఈ నేపథ్యంలో వివాదాలు, ఘర్షణలు, వాదనలు సహజమేనన్నారు. ఈ క్రమంలో కొన్ని దేశాల మధ్య సంబంధాలు అంత సాఫీగా ఉండవని విదేశాంగ మంత్రి అంచనా వేశారు.

# ఆలయాలపై దాడులు అరికట్టాలి..

## గవర్నర్‌కు బీజేపీ ఎంపీల వినతి



**విశ్వంభర, హైదరాబాద్:** భారతీయ జనతా పార్టీ నేతలు సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు. ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు గవర్నర్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఆలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వారు కోరారు. అనంతరం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. ధార్మిక సంఘాల నేతలపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. వాటిని ఎత్తివేసేలా చూడాలన్నారు. తెలంగాణలో అసలు నిఘా వ్యవస్థ పని చేస్తోందా అని ప్రశ్నించారు. దేవాలయాలపై దాడులు జరుగుతుంటే సీఎం స్పందించరా? అని నిలదీశారు.

# కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుచేయండి

## కేంద్ర కార్మిక శాఖ మంత్రి మాండవీయకు బండి సంజయ్ వినతి



**ఢిల్లీ:** కరీంనగర్ జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సోమవారం కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ మన్సూక్ మాండవీయను కోరారు. ఢిల్లీలో ఆయనను కలిసిన బండి సంజయ్ కరీంనగర్ జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. కరీంనగర్ జిల్లా కేంద్రం మెడికల్ హబ్‌గా మారిందని బండి సంజయ్ తెలిపారు. ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి అత్యధిక మంది ప్రజలు వైద్యం కోసం అక్కడికి విచ్చేస్తున్నారని తెలిపారు. ఉత్తర తెలంగాణలో బీడీ కార్మికులు, నేత కార్మికులు సహా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య అధికంగా ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయడంతో తమ ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని అన్నారు. బండి సంజయ్ విజ్ఞప్తికి మన్సూక్ మాండవీయ సానుకూలంగా స్పందించారని, అతి త్వరలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని బండి సంజయ్ తెలిపారు.

# ప్రొ.కేశవరావ్ జాదవ్ స్మారక చిహ్నాలు నిర్మించాలి

**విశ్వంభర, హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్‌గా ఎంతో మంది శిష్యులను ప్రజా ఉద్యమకారులుగా తీర్చిదిద్దిన ప్రొ. కేశవరావు జాదవ్ తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆయన చేసిన కృషికి నిదర్శనంగా, ఉస్మానియా విశ్వవిద్యాలయంలలో ఆయన విగ్రహం ప్రతిష్టాపించి, ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలకు ఆయన పేరు పెట్టాలని పలువురు విద్యావేత్తలు, రాజకీయ ప్రముఖులు కోరారు. ఈమేరకు వారు ప్రకటన విడుదల చేశారు.. తెలంగాణలో జరిగిన ఎన్నో చారిత్రక ఘటనలకు సాక్షీ భూతంగా నిలవడమే గాకుండా 1952 ముల్కీ ఉద్యమం, 1969 తెలంగాణ రాష్ట్ర సాధనలో తొలి, మలి ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించాడని, తెలంగాణ జెఏసి ఏర్పాటు కంటే ఎంతో ముందుగా తెలంగాణ ఐక్యవేదిక ద్వారా లక్షమందితో వరంగల్ సభ నిర్వహించి ఉద్యమానికి ఊపిరినిచ్చాడన్నారు. 2011లో ఆవిర్భవించిన తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ (టియుఎఫ్) చైర్మన్ గా, మిలిటెంట్ పోరాటాలకు ఆధ్యుడిగా ఆయన సాధించిన కృషికి ప్రొ. కేశవరావు జాదవ్"మిస్టర్ తెలంగాణ" అని ప్రఖ్యాతిగాంచాడన్నారు. జనవరి, 27, 2025న, 92వ జయంతి సందర్భంగా ఆయన స్మారక చిహ్నాల ఏర్పా టుకు ముందుకు రావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశం పై ఏకీభవించే శక్తులమంతా కలిసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడానికి ముందుకు రావాలని తెలంగాణ వాదులందరిని ఈసందర్భంగా కోరారు. తెలంగాణలో జరిగిన అన్ని ఉద్యమాల్లో ప్రొ? కేశవరావు జాదవ్ పాత్ర విస్మరించరానిదని ఈ విషయంపై త్వరలో సంతకాల సేకరణ చేస్తామన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో దిలీప్ కుమార్ (మాజీ ఎం.ఎల్.సి, టియుఎఫ్ పూర్వ సెక్రటరిజనరల్), టి. హన్మాండ్లు (టియుఎఫ్ ప్రధాన కార్యదర్శి), విమలక్క (టియుఎఫ్ అధ్యక్షురాలు), మహమ్మద్ రియాజ్ (తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్, టియుఎఫ్ పూర్వఅధికార ప్రతి నిధి), ఆచార్య కట్టా భగవంత రెడ్డి (టియు ఎఫ్ ఉపాధ్యక్షులు), మన్నారం నాగరాజు (తెలంగాణలోక్ సత్తా అధ్యక్షులు, టఫ్ నాయ కులు), సోగరబేగం (టియుఎఫ్ కోశాదికారి, పూర్వఅధికార ప్రతినిధి), డి. రాజు గౌడ్ (టీయుఎఫ్ రాష్ట్రకార్యదర్శి), మల్సూర్ (ఎసిఎఫ్ప్రధాన కార్యదర్శి) తదితరులున్నారు.

# మనవరాలి సంగీత్ వేడుకలో మల్లా రెడ్డి మాస్ డ్యాన్స్



**విశ్వంభర, హైదరాబాద్:** ఎప్పుడూ మాటలతో అదరగొట్టే మాజీ మంత్రి మల్లారెడ్డి, ఈసారి డ్యాన్స్‌తో ఉర్రూతలూగించారు. తన మనవరాలి సంగీత్ ఫంక్షన్‌లో తనదైన శైలిలో బ్రేక్ డ్యాన్స్ చేశారు. 75 ఏళ్ల వయసులో ఆయన చేసిన డ్యాన్స్ చూసి చాలా మంది ఆశ్చర్యపోయారు. మల్లారెడ్డి మనవ రాలు, మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి కుమార్తె వివాహం ఈనెల 27వ తేదీన జరగబోతోంది.

## డ్రోన్లతో రష్యాపై ఉక్రెయిన్ భారీ దాడులు

**వందకు పైగా కూల్చేసిన రక్షణ దళాలు**

**17 మందికి గాయాలు**

**కీవ్:** రష్యాలోని పశ్చిమ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ ఆదివారం డ్రోన్లతో భారీగా దాడులకు దిగింది. వీటిలో వందకుపైగా లోహవిహంగాలను రష్యా గగనతల రక్షణ దళాలు నేలకూల్చాయి. మరోవైపు ఉక్రెయిన్‌పై పుతిన్ సేన జరిపిన దాడిలో 17 మంది గాయపడ్డారు. తమ దేశంలోని ఏడు ప్రాంతాలపైకి డ్రోన్లను ఉక్రెయిన్ ప్రయోగించినట్లు రష్యా రక్షణశాఖ పేర్కొంది. సరిహద్దు ప్రాంతమైన కర్స్కను ప్రధానంగా లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. అక్కడ 43 డ్రోన్లను కూల్చేశామని వెల్లడించింది. మొత్తంమీద 110 డ్రోన్లను ధ్వంసం చేశామని పేర్కొంది. జెర్జిన్స్క ప్రాంతంలో రష్యా ప్రభుత్వ ఆధ్వర్యంలోని స్వెర్దలోవ్ కర్మాగారాన్ని లక్ష్యంగా చేసుకొని దాడి చేసినట్లు ఉక్రెయిన్ సైన్యం ప్రకటించింది. అక్కడ శతఘ్ని గుళ్ల, బాంబులకు అవసరమైన రసాయనాలను తయారుచేస్తున్నట్లు ఆరోపించింది. తమ డ్రోన్ దాడి వల్ల లిపెట్స్క ప్రాంతంలోని వాయుసేన స్థావరంలో మంటలు చెలరేగినట్లు పేర్కొంది. సెప్టెంబరు చివర్లోనూ ఇదే తరహా దాడికి ఉక్రెయిన్ ప్రయత్నించింది. నాడు 125కిపైగా డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ప్రకటించింది. ఉక్రెయిన్‌లోని క్రివీ రిహ్ నగరంపై జరిగిన క్షిపణి దాడిలో 17 మంది గాయపడ్డారు. ఇళ్ల, దుకాణాలు దెబ్బతిన్నాయి. రష్యా తమపైకి 49 డ్రోన్లు, రెండు ఇస్కాందర్-ఎం బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని ఉక్రెయిన్ వైమానిక దళం పేర్కొంది. వాటిలో 31 డ్రోన్లను కూల్చేశామని తెలిపింది. 13 లోహవిహంగాలను ఎలక్ట్రానిక్ రక్షణ వ్యవస్థలు నిర్వీర్యం చేసి ఉంటాయని పేర్కొంది.

# హెజ్‌బొల్లా ఆర్థిక మూలాలపై ఇజ్రాయెల్ టార్గెట్

■ భీకర దాడులకు సిద్ధమైన టెల్ అవీవ్

■ ఉగ్రవాద ప్రాంతాల నుంచి ప్రజలు వెళ్లిపోవాలని హెచ్చరిక

■ సురక్షిత ప్రాంతాలకు తరలుతున్న బీరూట్ ప్రజలు

**బీరూట్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. హమాస్ అధినేత యాహ్యా సిన్వర్‌ను చంపిన నేపథ్యంలో ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులకు దిగుతామని లెబనాన్‌లోని హెజ్‌బొల్లా ఇటీవల హెచ్చ రించిన సంగతి తెలిసిందే. టెల్ అవీవ్ మరిన్ని భీకర దాడులకు సిద్ధమైంది. ఈసారి హెజ్ బొల్లా ఆర్థిక మూలాలపై గురిపెట్టింది. రానున్న గంటల్లో బీరుట్ సహా లెబనాన్ వ్యాప్తంగా పెద్ద ఎత్తున బాంబు దాడులకు పాల్పడనున్నట్లు ప్రకటించింది. "హెజ్‌బొల్లా ఉగ్ర కార్యకలాపాలకు ఆర్థికంగా అండగా ఉండే ప్రాంతాలకు సమీపంలో ఉన్న ప్రజలు వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలి" అని ఇజ్రాయెల్ మిలిటరీ అధికార ప్రతినిధి డేనియల్ హగారీ హెచ్చరికలు జారీ చేశారు. లెబనాన్ వ్యాప్తంగా ఉన్న 'అల్ ఖర్ద్ అల్ హసన్' బ్రాంచీలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని వెల్లడించారు. 'అల్ ఖర్ద్ అల్ హసన్' అనేది లైసెన్స్ లేని గ్రే-మార్కెట్ బ్యాంక్. హెజ్‌బొల్లాకు నిధులు సమకూర్చే ప్రధాన ఆర్థిక వనరుగా పనిచే స్తోంది. లెబనాన్ వ్యాప్తంగా దీనికి దాదాపు 30 బ్రాంచీలు ఉన్నాయి. ఇందులో సగం బీరుట్‌లోని అత్యంత రద్దీ అయిన ప్రదేశాలు, నివాస సముదాయాల్లోనే ఉండటం గమనార్హం. ఇజ్రాయెల్ హెచ్చ రికలు వచ్చిన కాసేపటికే బీరుట్ లోని పలు ప్రాంతాల్లో భారీగా పేలుడు శబ్దాలు వినిపించాయి. శివారు ప్రాంతాల్లోని దాదాపు 11 ప్రాంతాల్లో పేలుళ్లు చోటుచేసుకున్నాయి. నగరంలోని ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోనూ దాడులు జరిగాయి. మరోవైపు హెచ్చరికల నేపథ్యంలో బీరుట్‌లోని వేలాది మంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లిపోతున్నారు. ప్రాణభయంతో మూకుమ్మడిగా వీధుల్లోకి రావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com